హాబుల్ గత వారంరోజుల్లో విలువ
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
ఖమ్మం
: fb.com/vaartha Digital
Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nalgonda, Nellore, Tadepalligudem, Srikakulam
27-6-2026 శనివారం సంపుటి: 32 సంచిక: 147 పేజీలు: 8+16 వెల: 6.50

## 'సర్'కు యేడాది.. 6 కోట్ల ఓట్లు తొలగింపు
5లో

## వెనిజులా భూకంపంలో 600 దాటిన మృతులు



## కొత్త సిఎస్‌గా సంజయ్ జాజు

### జులై 1న బాధ్యతల స్వీకరణ

### సిఎం ముఖ్య సలహాదారుగా కె. రామకృష్ణారావు



### సిఎంఒ నుంచి అజిత్ రెడ్డి ఔట్, సిఎం ప్రిన్సిపల్ సెక్రటరీగా ఎన్. శ్రీధర్

### 13 మంది ఐఎఎస్ అధికారుల బదలీలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జూన్26:** తెలంగాణ కొత్త సిఎస్‌గా సంజయ్ జాజును నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం సాయంత్రం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెలాఖరుతో ప్రస్తుత సిఎస్ రామకృష్ణారావు పదవీకాలం ముగియనుంది. ఆ వెంటనే సంజయ్ జాజు బాధ్యతలు చేపట్టనున్నారు. కాగా, రాష్ట్ర పరిపాలనపై ఆయనకు సుదీర్ఘ అనుభవం ఉంది. 1992 బ్యాచ్‌కు చెందిన సంజయ్ జాజు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఐటీ, కమ్యూనికేషన్ శాఖ కార్యదర్శిగా పనిచేశారు. రాష్ట్ర విభజన తర్వాత ఆయనను తెలంగాణ కేడర్‌కు కేటాయిం చారు. 1992బ్యాచ్ తెలంగాణక్యాడర్‌కు చెందిన సంజయ్ జాజు 12 ఏండ్లుగా కేంద్ర సర్వీసుల్లో కొనసాగు తున్నారు. 2014 అక్టోబర్‌నుంచి ఇప్పటి వరకు ఆయన కేంద్ర సర్వీసుల్లోనే ఉన్నారు. 2014 నుంచి 2018 వరకు నేషనల్ హైవేస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరే షన్ లిమిటెడ్ డైరెక్టర్‌గా విధులు >>2


ఎన్. శ్రీధర్


రాహుల్ బొజ్జా


సవ్యసాచి ఘోష్


శైలజ రామయ్యర్


కాత్యాయనీ దేవి


అజిత్ రెడ్డి

## మూసీ రివర్‌బెడ్ వాసులకు డబుల్ బెడ్ ఇళ్లు

### నెక్లెస్ రోడ్డులో మూసీ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ఏర్పాటు

### తీరం పొడవునా వ్యాపార సముదాయాలు, వ్యాహ్యాళి కేంద్రాలు

### నదిలో నిత్యం మంచినీటి ప్రవాహం

### మొదటి దశలో 9 కి.మీ. పరిధిలో పనులు: సమీక్షలో సిఎం రేవంత్ రెడ్డి


శుక్రవారం సమీక్ష సమావేశంలో సిఎం రేవంత్, మంత్రి పొంగులేటి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్26:** మూసీ రివర్ బెడ్‌లో ఉన్న వారికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కేటాయించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆదేశించారు..భూ సేకరణ కోసం ఆసక్తి ఉన్న వాళ్లకు టిడిఆర్ ఇవ్వాలి లేదా పరిహారం చెల్లించాలని అధికారులకు సూచించారు. శుక్రవారం ఎంసిఆర్ హెచ్‌ఆర్‌డి బోధి పెవిలియన్‌లో మూసీ రివర్ ఫ్రంట్ పైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి,ఎంపి వేం నరేందర్ రెడ్డి,ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ ఎండీ నర్సింహారెడ్డి, ఎంఆర్డీసిఎల్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమి, హెచ్‌ఎండిఎ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, సిఎంఒ కార్యదర్శి మాణిక్ రాజ్,మునిసిపల్ శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు. మూసి మొదటిదశ ప్రాజెక్ట్ పైన చర్చ చేశారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టు కోసం తీసు కుంటున్న డిఫెన్స్ భూముల్లో ఉన్ననిర్మాణాలను రాష్ట్ర ప్రభుత్వమే >>2



## కొత్తగా ఏడు బుల్లెట్‌ట్రైన్ కారిడార్లు

### గంటకు 350 కి.మీ వేగంతో బి35 కొత్తరైళ్లు

**న్యూఢిల్లీ,జూన్ 26:** భారతదేశ రైల్వే వ్యవస్థలో వందే భారత్ రైళ్లు వేగంగా దూసుకుపోతుంటే ఇప్పుడు అంతకంటే వేగంగా దూసుకు పోయే బుల్లెట్ రైళ్లుకూడా భారత్‌లో పరిగెత్తబోతున్నాయి. బుల్లెట్ ట్రైన్ కారిడార్లను కేంద్ర రైల్వే శాఖ వెల్లడించింది. 7 కొత్త బుల్లెట్ ట్రైన్ కారిడార్లు ప్రకటించింది. దేశవ్యాప్తంగా ప్రతిపాదిత బుల్లెట్ ట్రైన్ కారిడార్ల కోసం బి35 పేరుతో అత్యాధునిక హైస్పీడ్ రైళ్లను అభివృద్ధి చేయాలని నేషనల్ హైస్పీడ్ రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ నిర్ణయిం చింది. ఈ రైళ్ల రూపకల్పన, తయారీ కోసం సంస్థలు ఎంపిక చేసే ప్రక్రియను ఇప్పటికే ప్రారంభించింది. భారత్‌లోనే తయారు కానున్న ఈ బి35 బుల్లెట్ ట్రైన్లు గరిష్టంగా గంటకు 350 >>2

## పాస్‌పోర్ట్, పౌరసత్వం వేర్వేరు

### వాటిమధ్య చట్టపరమైన తేడా తెలుసుకోవాలి

### ఒవైసీ వ్యాఖ్యలు చట్టపరంగా తప్పు



### పౌరసత్వ చట్టం 1955లో రాగా, పాస్‌పోర్టు చట్టం 1967లో వచ్చింది: కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జూన్26:** పాస్‌పోర్ట్, పౌరసత్వ అంశంపై హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసి చేసిన వ్యాఖ్యలు చట్టపరంగా తప్పు, ఇవి ప్రజలను తప్పుదోవ పట్టించేలా, బాధ్యతారాహిత్యంగా మాట్లాడినవని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి కౌంటర్ ఇచ్చారు. ప్రఖ్యాత విదేశీ సంస్థలో చదువుకున్న వ్యక్తిగా, బారిష్టర్ అభ్యసించిన వ్యక్తిగా.. భారతదేశ చట్టాల్లోని ప్రాథమిక సూత్రాలను సరిగ్గా అర్థం చేసుకోలేకపోవడం విచారకరమని పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం ఓ ప్రకటన విడుదల చేశారు. ఒక ప్రజాప్రతినిధిగా, న్యాయ సంబంధితఅంశాలపై పరిజ్ఞానం ఉన్న వ్యక్తిగా, పాస్‌పోర్ట్, పౌరసత్వం మధ్య చట్టపరమైన స్పష్టమైన తేడాను ఒవైసి తెలుసుకోవాలని చెప్పారు. ఆయన వ్యాఖ్యలు చట్టంపై పూర్తి అవగాహన లేకపోయి ఉండొచ్చు. లేదంటే.. రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజల్లో కావాలనే గందరగోళాన్ని సృష్టించాలనే ఉద్దేశంతో ఈ వ్యాఖ్యలు చేశారని అర్థమవుతోందన్నారు. విదేశాంగ మంత్రిత్వ శాఖ చెప్పిన వివరణ ప్రకారం.. భారతీయ పాస్‌పోర్ట్‌కు విలువలేదని అర్థం కాదు. పాస్‌పోర్ట్ ఒక్కటే భారతీయ పౌరసత్వాన్ని నిర్ధారించే ఆధారం కాదని మాత్రమే విదేశాంగ శాఖ చెప్పిందన్నారు. భారత రాజ్యాంగంప్రకారం, పౌరసత్వ చట్టం-1955 ప్రకారం భారతదేశంలో పౌరసత్వం నిర్ణయించబడుతుంది.
ఏదో ఒక అడ్మినిస్ట్రేటివ్ డాక్యుమెంట్ ఆధారంగా పౌరసత్వాన్ని నిర్ణయించరు. పాస్‌పోర్ట్స్ చట్టం-1967 ప్రకారమే.. పాస్‌పోర్ట్ జారీ చేయబడుతుంది. దీన్ని విదేశాలకు వెళ్లేవారు.. ఓ ట్రావెల్ డాక్యుమెంట్‌గా మాత్రమే వినియోగించాలని స్పష్టంగా చట్టంలో పేర్కొన్నారు. పాస్‌పోర్ట్స్ చట్టంలోని సెక్షన్ 20 ప్రకారం, ప్రజాహితాన్ని దృష్టిలోపెట్టుకుని.. భారత పౌరుడు కాని వ్యక్తికి కూడా కేంద్ర ప్రభుత్వం పాస్‌పోర్ట్ జారీ చేసే అధికారం ఉంది. కాబట్టి, చట్టంలోని అంశాలను జాగ్రత్తగా గమనిస్తే.. పాస్‌పోర్ట్‌ను పౌరసత్వాన్ని నిర్ధారించే ఆధారంగా పరిగణించలేమన్నారు. ఇది మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త నిబంధనకాదు. పాస్‌పోర్ట్స్ చట్టం-1967లో, కాంగ్రెస్ పాలన లోనే అమలులోకి వచ్చింది. కాబట్టి, ఈ విషయంలో మోడీ ప్రభుత్వాన్ని విమర్శించడం అంటే మీరు చట్టం గురించి అవగాహనలేని వ్యక్తి కావడం లేదా ఉద్దేశపూర్వకంగా నిజా లను దాచిపెట్టేందుకు ప్రయత్నం చేస్తున్నారని >>2

## రాష్ట్రంలో గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్లు

### భారీగా ప్రోత్సాహకాలు

**హైదరాబాద్, జూన్ 26, ప్రభాతవార్త :** రాష్ట్రంలో గ్రీన్ హైడ్రోజన్, దాని అనుబంధ ఉత్పత్తుల యూనిట్ల స్థాపనకు తెలంగాణ ప్రభుత్వం ప్రోత్సా హకాలను ఇవ్వాలని నిర్ణయించింది. ఎలక్ట్రోలైజర్ ఆధారిత గ్రీన్ హైడ్రోజన్, అనుబంధ ఉత్పత్తుల ప్లాంట్లను స్థాపించే సంస్థలకు ఎలక్ట్రోలైజర్ స్టాక్ ప్లాంట్, వాటికి సంబంధించి పరికరాలపై 30 శాతం పెట్టుబడి రాయితీని అందించనుంది. ఇందులో భాగంగా ప్రతి మెగావాట్‌కు 1,400 టన్నుల వార్షిక ఉత్పత్తి సామర్థ్యానికి రూ.కోటి చొప్పున రూ.30 కోట్ల వరకూ గరిష్ట పరిమితికి లోబడ ఒక్కో ప్లాంట్‌కు పెట్టుబడి రాయితీ ఇవ్వనుంది. ప్లాంట్, పరికరాల (ఎలక్ట్రోలైజర్తో సహా) పరిశ్రమల స్థాపనకు పెట్టే పెట్టుబడులపై 25 శాతాన్ని రాయితీగా అందించనుంది. కనీసం 500 మెగావాట్ల వార్షిక ఎలక్ట్రోలైజర్ ఉత్పత్తి సామర్థం కలిగిన తొలి 5 ప్లాంట్లకు మాత్రమే ఈ రాయితీని వర్తించనుంది. అలాగే ఇంటిగ్రేటెడ్ గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమోనియా, గ్రీన్ మిథనాల్ (బయోజనిక్ కార్బన్తో సహా) పరిశ్రమల ఏర్పాటుకు ప్రాధాన్యత కల్పిస్తుంది. వీటితో పాటు రాష్ట్రంలో జరిపే గ్రీన్ హైడ్రోజన్, అను >>2



## ముదిరిన అయోధ్య విరాళాల వివాదం

### ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్‌రాయ్, మరో సభ్యుని రాజీనామా
5లో

### 8 మంది నిందితుల అరెస్టు

## ఓవర్‌లోడ్‌పై ఆంక్షలు



### వాహనాల్లో అనుమతికి మించి సరకు రవాణా నేరం

### సెక్షన్ 194 కింద బాధ్యులపై కఠిన చర్యలు

### ఉత్తర్వులు జారీ చేసిన రవాణా శాఖ

**హైదరాబాద్, ప్రభాతవార్త, జూన్ 26:** సరుకు రవాణాకు సంబం ధించి వాహనాల్లో ఎంత మేరకు లోండింగ్ చేయాలో అంత మేరకే సరకు, మైనింగ్, తీసుకెళ్లాలని అంతకు మించి తీసుకెళ్తే కేసులు తప్పవని రవాణాశాఖ హెచ్చరించింది. అనుమతికి మించి వాహనాల్లో సరుకు రవాణాచేస్తే యజమానులు, బాధ్యులపై చట్ట పరమైన చర్యలు తప్పవని రవాణా శాఖ స్పష్టం చేసింది. సరుకు, ఖనిజ వాహనాలలోడింగ్, రవాణాపై లోడింగ్ పాయింట్ల ఇంచార్జు లకు, జిల్లాల మైనింగ్ అధికారులకు, జిల్లాల రవాణా శాఖ అధికారులకు రవాణా శాఖ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. క్వారీలు, కంపెనీలు లోడింగ్ స్థావరాల వద్ద వాహనాలకు అనుమతించిన పరిమితికి మించి సరుకు, ఖనిజాలను నింపుతున్నా రని అధిక పరిమాణాలకు వే బిల్లులు, ట్రాన్సిట్ రసీదులు జారీ చేస్తున్నారని ఇటీవల జరిపిన ప్రత్యేక తనిఖీలలో రవాణా శాఖ గమనించింది. ఇలా చేయడం మోటారు వాహనాల చట్టం 1988, మైనింగ్ నిబంధనలు, సుప్రీంకోర్టు, హైకోర్టు ఆదేశాలకు స్పష్టమైన ఉల్లంఘన అవుతుందని రవాణా శాఖ పేర్కొంది.
మోటారు వాహనాల చట్టం 1988 యొక్క సెక్షన్ 113 ప్రకారం, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్‌లో పేర్కొన్న గ్రాస్ వెహికల్ వెయిట్ (జివిడబ్ల్యూ)కు మించి ఏ వాహనాన్ని కూడా నడపడం, నడిపించడా నికి అనుమతించడం నేరం. ఓవర్ లోడ్ వాహనం అనుమతిం చడం, నడపడం సెక్షన్ 194కింద శిక్షార్హమైన నేరం. అంతేగాకుండా ఉల్లంఘనలకు సెక్షన్ 199 కింద కూడా బాధ్యత వర్తిస్తుంది. రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్‌లో అనుమతించిన >>2



## రైతుల కోసం పాలన తెలుగు

### మాతృభాషలోనే ఉత్తర్వులు, లేఖలు

### సమాచార మార్పిడి పూర్తిగా తెలుగులోనే

### రైతు సంక్షేమ కమిషన్ చరిత్రాత్మక నిర్ణయం

**హైదరాబాద్, జూన్ 26, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని అన్నదాతలకు మరింత చేరువయ్యేందుకు, వారి సమస్యలను క్షేత్రస్థాయిలో వేగంగా పరిష్కరించేం దుకు రైతు కమిషన్ ఒక చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. కమిషన్ పరిధిలో జరిగే అధికారిక ఉత్తరప్రత్యుత్తరాల (కమ్యూనికేషన్స్) అన్నింటినీ ఇకపై పూర్తిగా తెలుగు భాషలోనే నిర్వహించాలని నిర్ణయించింది. రైతు కమిషన్ ఛైర్మన్ ఉన్నతాధికా రులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర ప్రజల మాతృభాష తెలుగు కావడం, గ్రామీణ ప్రాంతాల్లోని రైతులకు ఇంగ్లీషు కంటే సొంత భాషలోనే విషయాలు సులభంగా అర్థమవుతాయనే ఉద్దేశంతోనే ఈ మార్పునకు శ్రీకారం చుట్టింది. రైతు కమిషన్ మరింత ప్రజాస్వామ్యీకరించే దిశగా, సామాన్య ప్రజలకు చేరువ అయ్యేందుకు తీసుకునే చర్యల్లో భాగంగా ఈ ప్రతిపాదన చేసింది. కమి షన్ తీసుకునే నిర్ణయాలు, జారీ చేసే నివే దికలు, ఆదేశాలు ప్రతి సామాన్యుడికి, >>2

## అమెరికా, ఇరాన్ మధ్య మళ్లీ ఉద్రిక్తత!

### హార్ముజ్ నౌకలపై దాడులకు పాల్పడుతున్న ఇరాన్: ట్రంప్

**వాషింగ్టన్,జూన్ 26:** మధ్యప్రాచ్యంలో కాల్పుల విరమణ అమల్లో ఉన్నప్పటికీ అమెరికాఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరోసారి చెలరేగు తున్నాయి. హార్ముజ్ జలసంధిలో ప్రయాణిస్తున్న వాణిజ్య నౌకలపై ఇరాన్ డ్రోన్ దాడికి పాల్పడిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర ఆరోపణలు చేశారు.సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్‌లో స్పందించిన ట్రంప్ ఇరాన్ కనీసం నాలుగు వన్‌వే అటాక్ డ్రోన్లను నౌకలపై ప్రయోగించిందని తెలిపారు. వాటిలో ఒక డ్రోన్ భారీ కార్గో నౌక ఎగువ డెక్‌ను ఢీకొని నష్టాన్ని కలిగించింద >>2

## హీరాగోల్డ్ గోల్‌మాల్: రూ. 159 కోట్ల ఆస్తులు వేలం వేసిన ఇడి
2లో



## పుంజుకొంటున్న రుతుపవనాలు

### తెలంగాణ, ఎపి, కేరళ, కర్ణాటక, తమిళనాడుకు భారీ వర్షసూచన

### తూర్పు, ఈశాన్య భారత్‌లోను విస్తృతంగా వర్షాలు

**న్యూఢిల్లీ, జూన్ 26:** భారత వాతావరణ శాఖ (ఐఎమ్‌డి) ప్రకారం, రాబోయే కొద్ది రోజుల్లో దక్షిణ భారత్‌తో పాటు తూర్పు, ఈశాన్యం తదితర చాలా ప్రాంతాల్లో భారీ వర్షాలు కొనసాగనున్నాయి. దేశవ్యాప్తంగా నైరుతి రుతుపవనాలు మరోసారి జోరందుకున్నాయి. జూన్ ప్రారంభంలో కొద్దిరోజులు నెమ్మదించిన రుతుపవనాలు మళ్లీ వేగం పుంజుకుని ఉత్తర భారత దిశగా కదులుతున్నాయని ఐఎండి తాజాగా వెల్లడించింది. దక్షిణాదిలో రుతుపవనాలు వేగంగా కదులు తున్నాయని, దీంతో వచ్చే వారం రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశముందని >>2

## తెలంగాణలో 17 జిల్లాల్లో లోటు

**హైదరాబాద్, జూన్ 26, ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా రుతుపవనాల ప్రభావం అసమానంగా ఉంది. ఈ సీజన్‌లో అత్యధికంగా నల్గొండలో 13 వర్షపు రోజులు నమోదు కాగా, ఆతర్వాత రంగారెడ్డిలో 12, నిర్మల్ మరియు సూర్యాపేటలలో చెరో 11 వర్షపు రోజులు నమోదయ్యాయి. ఈ నెల 1 నుంచి హన్మకొండలో కేవలం మూడు వర్షపురోజులు మాత్రమే నమో దయ్యాయి. ఇది తెలంగాణలోనే అత్యంత తక్కువ. కాగా, జోగులాంబ గద్వాల్‌లో నాలుగు వర్షపురోజులు నమోద య్యాయి. రాష్ట్రవ్యాప్తంగా నైరుతి రుతుపవనాలు ముందుకు సాగుతున్నప్పటికీ, టిజిడిపిఎస్ జిల్లా >>2



శుక్రవారం ఉత్తరాఖండ్‌లోని ఉధమ్‌సింగ్‌నగర్ జిల్లాలో గోవింద్ వల్లభ్‌పంత్ యూనివర్సిటీ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ టెక్నాలజీ విద్యార్థులతో కలిసి వరినాట్లు వేస్తున్న కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్

## పాస్‌పోర్ట్, పౌరసత్వం వేర్వేరు

>> అర్థమవుతోందన్నారు. భారతదేశంలో పౌరసత్వ చట్టం - 1955 ప్రకారం.. జననం, వంశపారంపర్యత, నేచురలైజేషన్ (విదేశీయులకు భారతదేశ పౌరసత్వం కల్పించడం) వంటి చట్టబద్ధ మార్గాల ద్వారా పౌరసత్వం నిర్ధారితం అవుతుంది. అనేక సందర్భాల్లో.. ముఖ్యంగా పుట్టిన తేదీ, జన్మస్థలం, తల్లిదండ్రుల పౌరసత్వ స్థితి ఆధారంగా పౌరసత్వం నిర్ణయించాల్సి వచ్చినప్పుడు, ఇతర డాక్యుమెంట్స్ అవసరమవుతాయని పేర్కొన్నారు. ఈ డాక్యుమెంట్స్‌లో.. జనన ధ్రువీకరణ పత్రాలు, తల్లిదండ్రుల రికార్డులు, పాఠశాల రికార్డులు, ఓటరు జాబితా నమోదు వివరాలు, నివాస ధ్రువీకరణలు, ప్రభుత్వ రికార్డులు, పాస్‌పోర్ట్ మరియు ఇతర సమకాలీన పత్రాలుంటాయి. భారతీయ న్యాయస్థానాలు కూడా పాస్‌పోర్ట్ ఒక్కటే పౌరసత్వానికి తుది ఆధారం కాదని పలు సందర్భాల్లో పునరుద్ఘాటించాయన్నారు. పాస్‌పోర్ట్ కలిగి ఉండటం ఒక్కటే.. పౌరసత్వ చట్టంలోని నిబంధనలను పూర్తిచేసినట్లుకాదని 2013లోబొంబాయి హైకోర్టు కూడా స్పష్టంగా పేర్కొందన్నారు. ఒవైసితోపాటుగా ప్రజలంతా అర్థం చేసుకోవాల్సిన విషయం ఏంటంటే.. మోడీ ప్రభుత్వమో లేదా.. విదేశాంగ మంత్రిత్వ శాఖనో.. కొత్త నిబంధనను తీసుకురాలేదు. పౌరసత్వం అనేది రాజ్యాంగం ప్రకారం, పౌరసత్వ చట్టంప్రకారం సంక్రమిస్తుందని తెలుసుకోవాలని చెప్పారు. ఒవైసి ప్రజలను తప్పుదోవ పట్టించడం మానేసి, నిరాధార వ్యాఖ్యలు చేయడానికి ముందుగా.. పౌరసత్వ చట్టం -1955, పాస్‌పోర్ట్స్ చట్టం - 1967ను చదవాలని హితవు చెప్పారు.

## ఓవర్‌లోడ్‌పై ఆంక్షలు

>> జివిడబ్ల్యూ దాటకుండా లోడ్ చేయాలి. నిబంధనలు ఉల్లంఘించిన యజమానులు, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని రవాణా శాఖ స్పష్టం చేసింది. అనుమతించిన పరిమితికి మించిన ఖనిజాలకు రాయల్టీ అంగీకరించరాదని, ట్రాన్సిట్ రసీదు మంజూరు చేయరాదని, అలా చేయడం సుప్రీంకోర్టు, హైకోర్టు ఆదేశాలను ధిక్కరించడమే అవుతుందని రవాఖా శాఖ పేర్కొంది. ఈ నేపథ్యంలో డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్లు, జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అధికారులు తమ పరిధిలోని అన్ని కంపెనీలు, క్వారీలు, లోడింగ్ స్థావరాలు, మైనింగ్ శాఖ అధికారులకు వారి సిబ్బంది ద్వారా అందజేసి వ్రాతపూర్వక అంగీకారం తీసుకోవాలని జిల్లా అధికారులకు సూచించింది. ఇందుకు సంబంధించిన నివేదికను వెంటనే రవాణా శాఖ కమిషనర్ కార్యాలయానికి సమర్పించాలని సూచించింది. లోడింగ్ ఇంచార్జులు, జిల్లాలలోని మైనింగ్ అధికారులు, రవాణా శాఖ అధికారులు ఈ ఆదేశాలను తప్పకుండా పాటించాలని రవాణా శాఖ స్పష్టం చేసింది.

## డబుల్ బెడ్ ఇళ్లు

>> తరలించాలని సిఎం సూచించారు. ప్రజల సందర్శన కోసం మూసీ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను నక్లెస్ రోడ్‌లో ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. మూసీ ప్రాజెక్ట్‌లో చేపట్టబోయే పనులు సెంటర్‌లో ప్రతిబింబించాలని, ఇక్కడ ప్రాజెక్ట్‌పైన ప్రజల అభిప్రాయాలను తీసుకోవాలని చెప్పారు. మూసీ నది పునరుజ్జీవంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. రాష్ట్ర అధికారులను కొరియా, జపాన్ వంటి దేశాలకు పంపి, అక్కడ ఇదే తరహాలో చేపట్టిన పనులపై అధ్యయనం చేయించారు. తెలంగాణ రైజింగ్ విజన్2047లోనూ మూసీ పునరుజ్జీవాన్ని చేర్చారు. నది పొడవునా వ్యాపార సముదాయాలు, వాహ్యాళి కేంద్రాలను అభివృద్ధి చేయాలని, మూసీలో నిత్యం మంచి నీరు ప్రవహించేలా చూడాలని వ్యూహం రచిస్తున్నారు. హెచ్ఎండిఎ పరిధిలో 55 కిలోమీటర్ల మేరకు మూసీ దిశ మార్చనుండగా, మొదటి దశలో 9 కిలోమీటర్ల పరిధిలో పనులు చేపట్టనున్నారు. మొదటి దశలో లంగర్‌హౌస్‌లోని బాపూఘాట్ వద్ద ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన మహాత్మా గాంధీ విగ్రహం నిర్మించనున్నారు. గాంధీ బోధనలు తెలిపే మ్యూజియం, వివిధ మతాల ప్రార్థనా మందిరాలు, మూసీని ఆనుకొని రవాణా సాగించేలా రహదారి నిర్మాణం వంటివి మొదటి దశ పనుల్లో ఉన్నాయి.

## రాష్ట్రంలో గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్లు

>> బంధ ఉత్పత్తుల అమ్మకాలపై 100 శాతం ఎస్జీఎస్టీని 5 ఏళ్ల పాటు రీయింబర్స్ చేయనుంది. అదే ఎలక్ట్రోలైజర్, హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ పరిశ్రమల శ్ర ఉత్పత్తుల అమ్మకాలపై ఏడేళ్ల పాటు 100 శాతం ఎస్జీఎస్టీ తిరిగి చెల్లింపు చేస్తుంది. ఇదే సమయంలో గ్రీన్ హైడ్రోజన్ పరిశ్రమలకు 10 యేళ్ల పాటు, ఎలక్ట్రోలైజర్ పరిశ్రమలకు 5 ఏళ్ల పాటు 100 శాతం విద్యుత్ పన్ను మాఫీ చేయనుంది. గ్రీన్ హైడ్రోజన్ పరిశ్రమశ్రలు రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థల నుంచి కొనుగోలు చేసే ప్రతి యూనిట్ కరెంటుకు రూ.3 చొప్పున 20 యేళ్ల పాటు బిల్లులను తిరిగి చెల్లిస్తుంది. అలాగే గ్రీన్ హైడ్రోజన్ పరిశ్రమల ఏర్పాటుకు కొనుగోలు చేసే స్థలాలకు 100 శాతం స్టాంప్ డ్యూటీని చెల్లించాలని ప్రతిపాదించింది. ఎలక్ట్రోలైజర్ పరిశ్రమలకు ఐదేళ్ల పాటు యూనిట్ విద్యుత్‌కు ఒక రూపాయి చొప్పున ఈ రాయితీ వర్తిస్తుంది.

## కేంద్ర కేబినెట్ ప్రక్షాళన దిశగా కసరత్తులు

**న్యూఢిల్లీ,జూన్ 26:** ప్రధాని నరేంద్ర మోడీ ఆధ్వర్యంలోని మంత్రివర్గంలో కీలక మార్పులు జరగబోతున్నట్లు సమాచారం. ఈ వారమే మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ చేపట్టబోతున్నట్లు తెలుస్తోంది. ఈ అంశంపై వివరించేందుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కేంద్ర హోం మంత్రి అమిత్ షా కలిశారు. మరోవైపు బీజేపీలోనూ సంస్థాగత నిర్మాణంలో మార్పులు జరగనున్నాయి. కేంద్రం మంత్రివర్గంతోపాటు బీజేపీ కేంద్ర పదవుల్లోనూ మార్పులు చోటు చేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీనిపై బిజెపి జాతీయాధ్యక్షుడు నితిన్ నబీన్ చర్చలు, సంప్రదింపులు జరుపుతున్నారు. తన కొత్త టీంను ఎన్నుకునే పనిలో ఉన్నారు. బిజెపిలో పదవుల నియామకం, మార్పులు వంటివి ఈ నెలాఖరులోపు పూర్తవుతాయి. మంత్రివర్గంలో మార్పులు, చేర్పుల గురించి కొందరు కేంద్ర మంత్రులతో కూడా నితిన్ నబిన్ ఇదివరకే మాట్లాడినట్లు తెలుస్తోంది. ఉత్తరప్రదేశ్, బీజేపీ కార్యవర్గాన్ని కూడా ఇటీవల మార్చిన సంగతి తెలిసిందే. రాబోయే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని యూబీ బీజేపీ కార్యవర్గంలో మార్పులు చేశారు. ఇదే సమయంలో కేంద్ర మంత్రివర్గ పునర్వ్యస్థీకరణకు సంబంధించి తగిన ఏర్పాట్లు జరుగుతున్నాయి. కొందరు మంత్రులకు ఇటీవల పార్టీ పరమైన బాధ్యతల్ని కూడా అధిష్టానం అప్పగించింది. ఇటీవలే కేంద్ర మంత్రి జార్జ్ కురియన్ తన పదవికి రాజీనామాచేశారు. ఇటీవలే కొందరు కొత్తగా ఎంపీలుగా రాజ్యసభలోకి అడుగుపెట్టారు. వీరిలో కొందరికి కేంద్ర మంత్రి పదవులు దక్కే అవకాశాలున్నాయి. ఈ అంశంపై మోడీ, అమిత్ షా సహా బీజేపీ నాయకత్వం పూర్తి గోప్యత పాటిస్తోంది.

# కొత్త సిఎస్‌గా సంజయ్ జాజు

>> నిర్వర్తించారు. ఆ తర్వాత 2018-2023 వరకు భారత ప్రభుత్వ అదనపు కార్యదర్శిగా పనిచేశారు. ఆ తర్వాత కొంతకాలం సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ కార్యదర్శిగా పనిచేశారు. మొన్నటి వరకు నార్త్ ఈస్ట్ రీజియన్ డెవలప్‌మెంట్ మంత్రిత్వ శాఖ కార్యదర్శిగా పనిచేసిన విషయం తెలిసందే. తెలంగాణ ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు కేంద్ర ప్రభుత్వం... కేంద్ర సర్వీసుల్లో ఉన్న సంజయ్ జాజును తిరిగి మాతృ రాష్ట్ర కేడర్‌కు (తెలంగాణకు) పంపుతూ మూడు రోజుల క్రితం కీలక నిర్ణయం తీసుకుంది.ప్రస్తుతం సిఎస్‌గా ఉన్న కె. రామకృష్ణారావు పదవీకాలం ఈ నెల 30తో ముగియనుంది. ఈ నేపథ్యంలో సంజయ్ జాజును రాష్ట్ర తదుపరి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. జులై 1 నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు,సంజయ్ జాజు 2029 ఫిబ్రవరి వరకు సర్వీసులో ఉండనున్నారు.పరిశ్రమలు, ఐటీ శాఖ ప్రత్యేక సిఎస్‌గా సంజయ్‌జాజుకు అదనపు బాధ్యతలు అప్పగించారు. సిఎంఒలోని స్పీడ్ విభాగం సిఇఒగా, పరిశ్రమలుపెట్టుబడుల విభాగం ప్రత్యేక కార్యదర్శిగా సంజయ్ జాజుకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈమేరకు ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారు.

**సిఎం ముఖ్యకార్యదర్శిగా ఎన్ శ్రీధర్**

తెలంగాణ రాష్ట్ర పాలనా విభాగంలో ప్రభుత్వం పెద్ద ఎత్తున మార్పులు చేర్పులు చేపట్టింది. పరిపాలనను మరింత వేగవంతం చేసే దిశగా కీలక నిర్ణయం తీసుకుంటూ ఒకేసారి 13 మంది ఐఎఎస్ అధికారులను బదిలీ చేస్తూ శుక్రవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ తాజా బదిలీలలో భాగంగా ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శిగా సీనియర్ ఐఎఎస్ అధికారి ఎన్. శ్రీధర్‌ను నియమించారు (ఇప్పటి వరకు గనుల శాఖ ముఖ్యకార్యదర్శి). అలాగే ఇప్పటివరకు సిఎంఒలో సేవలందించిన అజిత్‌రెడ్డిని అక్కడి నుంచి బదిలీ చేసి, ఇన్వెస్ట్ తెలంగాణ సిఇఒగా కొత్త బాధ్యతలను అప్పగించారు. జిఎడి ప్రధాన కార్యదర్శిగా అహ్మద్ నదీమ్ నియమితులయ్యారు.

ఈ క్రమంలోనే పలువురు సీనియర్ అధికారులకు అదనపు బాధ్యతలను కూడా కేటాయించింది. విపత్తు నిర్వహణ శాఖ ముఖ్య కార్యదర్శిగా రాహుల్ బొజ్జా (సెలవుల నుంచి తిరిగి వచ్చిన నేపథ్యంలో) నియమితులు కాగా.. ఆయనకు బిసి సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శిగా అదనపు బాధ్యతలను అప్పగించారు. అటవీశాఖ ముఖ్య కార్యదర్శిగా శైలజా రామయ్యర్‌ను నియమించగా.. దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. చేనేత, హస్తకళల ప్రత్యేక కార్యదర్శిగా ఉన్న సవ్యసాచి ఘోష్‌కు ఆ శాఖలోనే మరికొన్ని అదనపు బాధ్యతలను కేటాయించగా.. అదే శాఖకు జాయింట్ సెక్రటరీగా కాత్యాయనీ దేవిని నియమించారు. గనులశాఖ ముఖ్య కార్యదర్శిగా రఘునందన్‌రావుకు అదనపు బాధ్యతలు అప్పగించారు. అలాగే.. హెచ్ఎండీఏ జాయింట్ కమిషనర్‌గా కె. చంద్రకళను, తెలంగాణ రెడ్‌కో చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ముషారఫ్ అలీని నియమించారు. ఆర్అండ్‌బీ స్పెషల్ సెక్రటరీగా గంగాధర్‌కు బాధ్యతలు అప్పగించారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కొత్త కమిషనర్‌గా టి.వెంకన్నను నియమించారు. రాష్ట్ర పర్యాటక రంగ అభివృద్ధికి అత్యంత కీలకమైన టూరిజం డైరెక్టర్‌గా కె.విద్యాసాగర్‌ను నియమించారు.

**సిఎం ముఖ్య సలహాదారుగా కె. రామకృష్ణారావు నియామకం**

తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. జూన్ 30న పదవీ విరమణ చేయనున్న సీనియర్ ఐఎఎస్ అధికారి కె. రామకృష్ణారావును ముఖ్యమంత్రికి అడ్వైజర్ అండ్ ఎక్స్ ఆఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీగా నియమించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జిఒఆర్టీ నెం. 912 జారీ చేసింది. పరిపాలనలో ఆయనకున్న సుదీర్ఘ అనుభవాన్ని వినియోగించుకునేందుకు రిటైర్మెంట్ రోజే ప్రభుత్వం ఈ కీలక బాధ్యతలను అప్పగించింది. ఈ నియామకానికి సంబంధించిన నిబంధనలు, షరతులను విడిగా జారీ చేస్తామని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

# ఐటి, ఫార్మాలో ప్రపంచ గుర్తింపు

## జిడిపిలో ఎంఎస్‌ఎంఇల వాటా పెరగాలి : డి.సిఎం భట్టి

**హైదరాబాద్, జూన్ 26, ప్రభాతవార్త :** పారిశ్రామిక వృద్ధి అంటే కేవలం పెట్టుబడుల గణాంకాలు మాత్రమే కాదని, ప్రజల జీవనోపాధి అని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఇండస్ట్రియల్ ఇన్నోవేషన్ అండ్ టెక్నాలజీ ఎక్స్ పో 2026 ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం, పరిశ్రమల మధ్య ఎఫ్‌టిసిసిఐ ఒక బలమైన వారధిగా పనిచేస్తోందన్నారు. పారిశ్రామిక ప్రదర్శన కేవలం యంత్రాలు, ఉత్పత్తుల ప్రదర్శన మాత్రమే కాదని, ఆలోచనలు పంచుకునే ఒక అద్భుత వేదిక అని వెల్లడించారు. ఇక్కడ చిన్న వ్యాపారులకు కొత్త కస్టమర్లు, తయారీదారులకు సరికొత్త సాంకేతికత, స్టార్టప్‌లకు తొలి కొనుగోలుదారులు లభించే అవకాశం ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత పెట్టుబడిదారుల నమ్మకాన్ని చూరగొని పటిష్టంగా వృద్ధి చెందిందని తెలిపారు. హైదరాబాద్ ఐటీ, ఫార్మా, లైఫ్ సైన్సెస్ రంగాల్లో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందని అన్నారు. జిడిపిలో పారిశ్రామిక రంగం, ముఖ్యంగా ఎంఎస్ఎంఇల వాటా పెరగాల్సిన అవసరం ఉందన్నారు. ఉపాధి కల్పనలో, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో మాన్యుఫ్యాక్చరింగ్ రంగం కీలకమన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కేవలం పెద్ద కంపెనీలకే కాకుండా చిన్న పరిశ్రమలకు, మహిళా, గ్రామీణ పారిశ్రామికవేత్తలకు అందాలనేదే తమ సంకల్పమని చెప్పారు. ఇందుకోసం ప్రతి శుక్రవారం ఎంఎస్ఎంఈ సంఘాలు, పారిశ్రామిక రంగ ప్రతినిధులతో చర్చల కోసం కేటాయిస్తానని హామీ ఇచ్చారు. ఈ ఎక్స్‌పోలో ఎలక్ట్రిక్ మొబిలిటీ, పునరుత్పాదక ఇంధనం, రోబోటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, స్మార్ట్ మాన్యుఫ్యాక్చరింగ్ వంటి భవిష్యత్ సాంకేతికతలపై దృష్టి పెట్టడం మంచి పరిణామమన్నారు. తమ ప్రభుత్వం ఎలక్ట్రిక్ వాహనాల అన్ని కేటగిరీలపై 100 శాతం రోడ్ టాక్స్, రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయింపు ఇచ్చిందని వెల్లడించారు. కేవలం ఇవిలను వాడటమే కాకుండా వాటి సప్లై చైన్ టెక్నాలజీని ఇక్కడే అభివృద్ధి చేయడమే ప్రధానమన్నారు. 2035 నాటికి 34 గిగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తిని సాధించడమే లక్ష్యంగా కలిగి ఉన్నామని పేర్కొన్నారు. పంప్ స్టోరేజ్ ప్రాజెక్టుల విధానాన్ని 1970లోనే నాగార్జునసాగర్ ప్రాజెక్టులో ప్రయోగాత్మకంగా ప్రారంభించి, సాంకేతికతలో తెలంగాణ ఎప్పుడూ ముందే ఉంటుందనేది రుజువు అయిందని తెలిపారు. రెండున్నరేళ్లలో పీక్ డిమాండ్ 15,000 మెగావాట్ల నుంచి 18,500 మెగావాట్లకు పెరిగినప్పటికీ, రాష్ట్రంలో ఎక్కడా పవర్ కట్స్ లేకుండా నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నామని స్పష్టం చేశారు. 2047 నాటికి తెలంగాణ ఆర్థిక వ్యవస్థను 3 ట్రిలియన్ డాలర్లకు చేర్చడమే ప్రధాన లక్ష్యంగా పేర్కొన్నారు. ఇందుకోసం ప్రభుత్వ పెట్టుబడులతో పాటు, పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ మోడల్‌ను ప్రోత్సహించడానికి సిద్ధంగా ఉన్నామని ఆయన చెప్పారు. ఫ్యూచర్ సిటీ, మూసీ పునరుజ్జీవనం, రీజనల్ రింగ్ రోడ్ వంటి ప్రాజెక్టులతో తెలంగాణ ముఖచిత్రం మారబోతోందని స్పష్టం చేశారు. పారిశ్రామికవేత్తలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు.

## రైతుల కోసం పాలం తెలుగు

>> ముఖ్యంగా మారుమూల గ్రామాల్లో ఉండే రైతులకు సైతం సులభంగా అర్థం కావాలనే ఉద్దేశంతోనే తెలుగులోనే ఉత్తర ప్రత్యుత్తరాలు జరపాలని అధికారులను ఆదేశించింది. రాష్ట్రంలో మెజారిటీ జనాభా వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తోంది. రైతు కమిషన్ వద్దకు వచ్చే అర్జీలు, ఫిర్యాదులు, వినతులు ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల నుంచే వస్తుంటాయి. అయితే, వీటికి కమిషన్ అధికారులు ఇచ్చే ఆదేశాలు లేదా ప్రభుత్వ శాఖల మధ్య జరిగే సుదీర్ఘ ఉత్తరప్రత్యుత్తరాలు ఇంగ్లీషులో ఉండటం వల్ల సామాన్య రైతులకు అవి అర్థం కావడం లేదు. తమ సమస్యపై అధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకున్నారో తెలియక రైతులు అయోమయానికి గురవుతున్నారు. ఈ సమస్యను తొలగించేందుకు కమిషన్ చైర్మన్ మాతృభాషకే ప్రాధాన్యం ఇవ్వాలని నిశ్చయించారు. రైతు కమిషన్ కార్యకలాపాల్లో ఇంగ్లీషు భాష వాడకాన్ని దాదాపుగా తగ్గిస్తూ, కేవలం కేంద్ర ప్రభుత్వ శాఖలకు, జాతీయ స్థాయి సంస్థలకు రాసే లేఖలు, నివేదికలకు మాత్రమే ఇంగ్లీషును పరిమితం చేయనున్నారు. రాష్ట్ర పరిధిలోని వివిధ శాఖల అధికారులు, రైతులు, స్థానిక సంస్థలతో జరిపే సమాచార మార్పిడి అంతా నూటికి నూరు శాతం తెలుగులోనే ఉండాలని చైర్మన్ స్పష్టం చేశారు. రైతులకు సంబంధించిన జీవోలు, కమిషన్ సిఫార్సుల సారాంశాన్ని కూడా సరళమైన తెలుగులోకి అనువదించి అందుబాటులో ఉంచబోతున్నట్లు సమాచారం. ఈ నిర్ణయాన్ని తక్షణమే అమలు చేయాలని కమిషన్లోని ఉన్నతాధికారుల నుంచి క్షేత్రస్థాయి సిబ్బంది వరకు చైర్మన్ ఖచ్చితమైన ఆదేశాలిచ్చారు. ఇప్పటివరకు కొనసాగుతున్న ఇంగ్లీషు అధికారిక పరిభాషను పక్కనపెట్టి, సామాన్యుడికితెలిసేలా సరళమైన తెలుగుపదాలతో ఉత్తరప్రత్యుత్తరాలు సాగించాలని సూచించారు.

## హీరాగోల్డ్ గోల్‌మాల్:
## రూ. 159 కోట్ల ఆస్తులు వేలం వేసిన ఇడి

**హైదరాబాద్, జూన్ 26, ప్రభాతవార్త:** దేశ వ్యాప్తంగా లక్షలాది మందిని బంగారం, వజ్రాల పేరిట నిండా ముంచి ఐదు వేల కోట్ల రూపాయలకు పైగా వసూలు చేసి బిచాణా ఎత్తేసిన హీరా గోల్డ్ గోల్‌మాల్ వ్యవహారంలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ సంస్థకు సంబంధించి కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ (ఇడి) జప్తు చేసిన ఆస్తుల్లో 159 కోట్ల రూపాయల ఆస్తులను శుక్రవారం నాడు వేలం వేశారు. సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం నిబంధనల మేరకు హైదరాబాద్ సహా పలుచోట్ల వున్న హీరా గోల్డ్ అధినేత నౌహేరా షేక్‌కు సంబంధించిన ఈ ఆస్తులను ఇడి ఇప్పటికే జప్తు చేయడం తెలిసిందే.

వాస్తవంగా హీరా గోల్డ్ కేసులో దాని అధినేత్రి నౌహేరా షేక్‌కు చెందిన 500 కోట్ల రూపాయల ఆస్తులను ఇడి ఇప్పటి వరకు జప్తు చేయగా ఇందులో 300 కోట్ల రూపాయల ఆస్తులను ఇంతకు ముందే వేలం వేయగా తాజాగా మరో 159 కోట్ల రూపాయల విలువచేసే 23 ఆస్తులను బహిరంగంగా వేలంలో విక్రయించారు. కాగా నౌహేరా షేక్‌కు సంబంధించి ఇతర ప్రాంతాలలో వున్న ఆస్తులను జప్తు చేసి నష్టపోయిన బాధితులకు అందించాలని ఇడి భావిస్తోంది. కొన్నిచోట్ల లిటిగేషన్లు వుండడంతో వాటి జప్తు సాధ్యమవడం లేదు. దీనిపై న్యాయ నిపుణులతో ఇడి అధికారులు మాట్లాడుతున్నారు.

## వారం - వర్జ్యం

27-06-2026, శనివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
నిజ జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, ఆరుద్ర కార్తె
త్రయోదశి రా.12.44, అనూరాధ రా.10.11
వర్జ్యం : తె.4.28-ఉ.6.16
దు.తె.5.37-ఉ.7.17
శుభసమయం : ఉ.8.00-9.00
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం:** కుటుంబ బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తారు. శ్రమకు అదృష్టం తోడవుతుంది. అనుకూల ఫలితాలు.

**వృషభం:** కోర్టుకేసులు పరిష్కారమవుతాయి. రాజకీయరంగం లోని వారికి ప్రభుత్వం నుండి ఆహ్వానాలు అందుతాయి.

**మిథునం:** చిన్ననాటి మిత్రుల ద్వారా కీలక సమాచారం అందుకుంటారు. నష్టం రావల్సిన చోట నష్టం రాదు.

**కర్కాటకం:** సంగీత, సాహిత్యాలపై ఆసక్తి చూపుతారు. పారిశ్రామిక వర్గాల వారికి అన్ని విధాల ప్రోత్సాహం లభిస్తుంది.

**సింహం:** పొదుపు పథకాల పట్ల ఎక్కువ ఆకర్షితులవుతారు. నూతన యత్నాలలో పురోగతి సాధిస్తారు. బంధువుల కలయిక.

**కన్య :** కీలక వ్యవహారాలలో అవరోధాలు ఏర్పడినా పూర్తి చేస్తారు. వ్యాపారాలలో స్వల్ప మార్పులువుంటాయి.వాహనసౌఖ్యం.

**తుల:** ఉద్యోగులకు విధి నిర్వహణలో బాధ్యతలు పెరుగుతాయి. పారిశ్రామిక రంగాలలోని వారు సామరస్యం వహించాలి.

**వృశ్చికం:** ఆహార నియమాలలో జాగ్రత్త అవసరం. దానధర్మాలు చేస్తారు. శుభ కార్యాలను విజయవంతంగా పూర్తిచేస్తారు.


**ధనుస్సు:** మీ పేరును పలుకుబడిని, హోదాను ఉపయోగించి కీలకమైన కార్యక్రమాలలో విజయం సాధిస్తారు.

**మకరం:** ఎంతటి వారికైనా మాటల చాతుర్యంతో ఆకట్టుకుంటారు. చేపట్టిన కార్యక్రమాలు సకాలంలో పూర్తి చేస్తారు.

**కుంభం:** దీర్ఘకాలిక సమస్యలు తీరుతాయి. శత్రువులను సైతం మిత్రులుగా మార్చుకుంటారు. కొత్త పరిచయాలు.

**మీనం:** తగాదాలు, వివాదాలకు దూరంగా వుండండి. ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. వేదాంతధోరణి అలవరచుకుంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్




'అత్యవసర పరిస్థితి 50 సంవత్సరాలు పూర్తి' సందర్భంగా శుక్రవారం న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర పర్యాటక మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ పాల్గొన్న దృశ్యం

# పుంజుకొంటున్న రుతుపవనాలు

>> తెలిపింది. ముఖ్యంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కేరళ, కర్ణాటక, తమిళనాడులో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. వాతావరణ శాఖ అంచనా ప్రకారం, రాబోయే మూడు నుంచి నాలుగు రోజుల్లో గుజరాత్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లోని మిగిలిన ప్రాంతాలు, ఝార్ఖండ్, బిహార్, ఉత్తర్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లోకి నైరుతి రుతుపవనాలు మరింత విస్తరించే అవకాశముంది. దీంతో దేశవ్యాప్తంగా వర్షాల తీవ్రత పెరగనుంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే రోజుల్లో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండి తెలిపింది. ఉరుములు, మెరుపులు, గంటకు 40-60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించింది. కర్ణాటకలో మరింత బలమైన గాలులు వీచే అవకాశముండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

రాబోయే మూడు నుంచి నాలుగు రోజుల్లో నైరుతి రుతుపవనాలు గుజరాత్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, బీహార్‌లోని మరిన్ని ప్రాంతాలకు, అలాగే ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్‌లోని కొన్ని ప్రాంతాలకు విస్తరించడానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని ఐఎమ్‌డి తెలిపింది. రుతుపవనాల ఉత్తరపు అంచు ప్రస్తుతం గుజరాత్, మధ్యప్రదేశ్, బీహార్‌లోని కొన్ని ప్రాంతాల గుండా ప్రయాణించి నేపాల్‌లోకి ప్రవేశిస్తోంది. ఇది రుతుపవన వర్షాలు క్రమంగా ఉత్తర భారతదేశం వైపు పురోగమిస్తున్నాయని సూచిస్తోంది.

**వర్షాలపై ఎల్‌నినో ప్రభావం?:**

నైరుతి రుతుపవనాలు మళ్లీ పుంజుకోవడం సానుకూల పరిణామమే అయినప్పటికీ, ఈ యేడాది ఎల్‌నినో ప్రభావం కారణంగా సీజన్ మొత్తం వర్షపాతంపై కొంత ప్రభావం ఉండే అవకాశం ఉంది. ప్రస్తుతం ఐఎండి అంచనా ప్రకారం ఈ సీజన్‌లో సాధారణ సగటు వర్షపాతంలో దాదాపు 90 శాతం మాత్రమే నమోదయ్యే అవకాశం ఉంది. అయితే వర్షాలకు కీలకమైన జులై, ఆగస్టు నెలల్లో పరిస్థితులు మెరుగుపడితే మొత్తం సీజన్ వర్షపాతం కూడా పెరిగే అవకాశముందని వాతావరణ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## తెలంగాణలో 17 జిల్లాల్లో లోటు

>> వారీ వర్షపాత డేటా ప్రకారం, 33 జిల్లాలకు గాను 17 జిల్లాల్లో ఈ సీజన్‌లో వర్షపాతం లోటుగా లేదా భారీ లోటుగా నమోదవుతూనే ఉంది. ఈ నెల 1 నుంచి 25 మధ్య కురిసిన వర్షపాతాన్ని విశ్లేషించిన నివేదిక ప్రకారం, తెలంగాణలో సాధారణంగా కురవాల్సిన 105.4 మిల్లీమీటర్లకు బదులుగా 88.3 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైంది. మూడు జిల్లాలు రంగారెడ్డి, నల్గొండ, నాగర్‌కర్నూల్‌లో మాత్రమే అధిక వర్షపాతం నమోదైంది. రంగారెడ్డిలో 131.6 మిల్లీమీటర్లు (సాధారణ 82.7 మిల్లీమీటర్ల; 59 శాతం అదనపు), నల్గొండలో 97.4 మిల్లీమీటర్ల (74.2 మిల్లీమీటర్ల సాధారణం; 31 శాతం అదనపు), నాగర్‌కర్నూల్‌లో 92.3 మిల్లీమీటర్ల (71.7 మిల్లీమీటర్ల సాధారణం; 29 శాతం మిగులు) నమోదైంది. 13 జిల్లాలు మాత్రమే సాధారణ కేటగిరీలోకి వచ్చాయి. వీటిలో హైదరాబాద్‌లో ఈ సీజన్‌లో ఇప్పటివరకు 102.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది, సాధారణ 90.9 మిల్లీమీటర్ల వర్షపాతం, కాలానుగుణ సగటు కంటే 12 శాతం ఎక్కువ. ఇతర జిల్లాలు మహబూబ్‌నగర్, ములుగు, సూర్యాపేట, సంగారెడ్డి, ఖమ్మం, వికారాబాద్, నారాయణపేట, కొత్తగూడెం, పెద్దపల్లి, భూపాలపల్లి, వనపర్తి, మెదక్. సిద్దిపేట, హన్మకొండ వరుసగా 62 మరియు 76 శాతం వర్షపాతంతో పెద్ద లోటు కేటగిరీలో ఉన్నాయి. 59 శాతం లోటుతో వరంగల్ అంచున ఉంది. ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, జగిత్యాల, మహబూబాబాద్, మల్కాజిగిరి, భువనగిరి, సిరిసిల్ల, కామారెడ్డి, ఆసిఫాబాద్, మంచిర్యాల, గద్వాల్‌లోనూ వర్షపాతం తక్కువగా నమోదైందని సొసైటీ గణాంకాలు చెబుతున్నాయి. గురువారం నిర్మల్‌లో రాష్ట్రంలో అత్యధికంగా 22.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది, ఇది సాధారణ వర్షపాతం కంటే దాదాపు ఐదు రెట్లు 4.5 మిమీ. నల్గొండ, రంగారెడ్డి, సంగారెడ్డి, మెదక్, సూర్యాపేటలో పగటిపూట సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదవగా, జయశంకర్ భూపాలపల్లి, వరంగల్, హన్మకొండ, ములుగు, పెద్దపల్లి సహా పలు జిల్లాల్లో స్వల్పంగా లేదా కురవలేదు.

# డ్రగ్స్‌పై కలిసి పోరాడుదాం
## సిఎం రేవంత్‌రెడ్డి పిలుపు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్26:** మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యవంతమైన సమాజం నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కోరారు. యువతలో సానుకూల ఆలోచనలు, విలువలు పెంపొందించి మాదక ద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణాకు వ్యతిరేకంగా అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా ఒక సందేశంలో పేర్కొన్నారు. మాదక ద్రవ్యాలు వ్యక్తి జీవితాన్నే కాకుండా కుటుంబాలను విచ్ఛిన్నం చేస్తాయని, తద్వారా సమాజంపై ప్రతికూల ప్రభావం చూపడంతో పాటు శాంతిభద్రతలకు సంబంధించిన సమస్యలకు దారితీస్తాయని అన్నారు. మాదక ద్రవ్యాల నియంత్రణ అక్రమ రవాణాను అరికట్టేందుకు అవగాహన, అప్రమత్తత, సామాజిక బాధ్యత ఎంతో అవసరమని పేర్కొన్నారు.డ్రగ్ ఫ్రీ తెలంగాణ లక్ష్య సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై సహకరించాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు.

# అమెరికా, ఇరాన్ మధ్య మళ్లీ ఉద్రిక్తత!

>> న్నారు. అయితే అమెరికా బలగాలు మిగిలిన మూడు డ్రోన్లను కూల్చివేశాయని చెప్పారు.ఈ దాడి ఇటీవల కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందానికి స్పష్టమైన ఉల్లంఘన అని ట్రంప్ విమర్శించారు. దాడికి గురైన నౌక పేరు లేదా ఘటన జరిగిన ఖచ్చితమైన సమయాన్ని మాత్రం ఆయన వెల్లడించలేదు.ఇదిలా ఉండగా, ఒమన్ తీరానికి సమీపంలో ఓ వాణిజ్య నౌక గుర్తు తెలియని ప్రక్షేపక దాడికి గురైనట్లు యునైటెడ్ కింగ్‌డమ్ సముద్ర భద్రతా సంస్థ యూకేఎంటీఓ వెల్లడించింది. నౌక కుడివైపు భాగంలో దాడి జరగడంతో బ్రిడ్జ్‌కు నష్టం వాటిల్లిందని తెలిపింది. అయితే ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని పేర్కొంది.ప్రస్తుతం అమెరికాఇరాన్ మధ్య శాశ్వతంగా యుద్ధానికి ముగింపు పలికే దిశగా చర్చలు కొనసాగుతున్నాయి. హార్మూజ్ జలసంధి గుండా నౌకల రాకపోకలు, ఇరాన్ అధిక శుద్ధి చేసిన యురేనియం నిల్వల భవిష్యత్తు వంటి కీలక అంశాలపై ఇరు దేశాలు చర్చిస్తున్నాయి. ఈ నెల ప్రారంభంలో కుదిరిన తాత్కాలిక ఒప్పందం ప్రకారం 60 రోజుల్లో తుది నిర్ణయానికి రావాల్సి ఉంది.

## కొత్తగా ఏడు బుల్లెట్‌ట్రైన్ కారిడార్లు

>> కిలోమీటర్ల వేగంతో ప్రయాణించేలా రూపొందించనున్నారు. సాధారణ సేవల్లో గంటకు 320 కిలోమీటర్ల వేగంతో నడిచేలా ప్రణాళిక సిద్ధం చేశారు. భవిష్యత్తులో దేశంలోని అన్ని కొత్త బుల్లెట్ ట్రైన్ మార్గాల్లో ఇవే ప్రధాన హైస్పీడ్ రైళ్లుగా మారనున్నాయి. ముంబై - పుణె,పుణె - హైదరాబాద్, హైదరాబాద్ - బెంగళూరు, హైదరాబాద్ - చెన్నై, చెన్నై - బెంగళూరు, ఢిల్లీ - వారణాసి, వారణాసి - సిలిగురి కారిడార్లు ప్రకటించింది. ఈ బుల్లెట్ ట్రైన్ కారిడార్లు అందుబాటులోకి వస్తే ప్రధాన నగరాల మధ్య ప్రయాణ సమయం భారీగా తగ్గుతుంది.ముంబై - అహ్మదాబాద్: 1 గంట 57 నిమిషాలు, ముంబై - పుణె: 48 నిమిషాలు, బెంగళూరు - చెన్నై: 73 నిమిషాలు, బెంగళూరు - హైదరాబాద్: 2 గంటల 10 నిమిషాలు, పుణె - హైదరాబాద్: 2 గంటల 8 నిమిషాలు, ఢిల్లీ - లక్నో: 2 గంటలు, ఢిల్లీ - వారణాసి 3 గంటల 15 నిమిషాలు తగ్గుతుందని ప్రకటించింది. ఇక దేశంలోని తొలి 508 కిలోమీటర్ల ముంబై-అహ్మదాబాద్ హైస్పీడ్ రైల్ కారిడార్ నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఈ ప్రాజెక్టులో భాగంగా గుజరాత్‌లోని సూరత్‌వాపి మధ్య 97 కిలోమీటర్ల విభాగంలో 2027 ఆగస్టు నాటికి బుల్లెట్ ట్రైన్ సేవలు ప్రారంభించాలని హైస్పీడ్ రైల్వే కారిడార్ సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. బి35 బుల్లెట్ ట్రైన్ల అభివృద్ధితో భారత్‌లోనే అత్యాధునిక హైస్పీడ్ రైళ్ల తయారీకి ఊతం లభించనుంది. భవిష్యత్తులో దేశవ్యాప్తంగా ప్రతిపాదిత బుల్లెట్ ట్రైన్ కారిడార్లలో వేగవంతమైన, స్వదేశీ సాంకేతికతతో రూపొందిన రైలు సేవలు అందుబాటులోకి రావడంతో రవాణా రంగంలో కొత్త అధ్యాయం ప్రారంభం కానుంది.

## పామాయిల్ హబ్‌గా తెలంగాణ

### వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, జూన్ 26, ప్రభాతవార్త :** పామాయిల్ హబ్‌గారాష్ట్రం మారనుందని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈ సాగు తెలంగాణ రైతాంగానికి వరంగా మారిందన్నారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజక వర్గం వేంసూర్ మండలం కల్లూరు గూడెం వద్ద కొత్తగా నిర్మాణం చేస్తున్న పామాయిల్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులను శుక్ర వారం పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ పామాయిల్ సాగు విస్తరణలో దేశంలోనే మొదటి స్థానంలో రాష్ట్రం నిలిచిందన్నారు. రాష్ట్రం లోని కొత్తగూడెం జిల్లాలో రెండు పామాయిల్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీలు, సిద్ది పేట జిల్లా నర్మేట్టలో పామాయిల్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీ రైతులకు అందుబాటులో ఉన్నాయన్నారు. అలాగే ఖమ్మం జిల్లా కల్లూరుగూడెం, కొణి జర్ల, గద్వాల జిల్లా బీచ్ పల్లి, ములుగు జిల్లా ఇంచర్ల, పెద్దపల్లి వనపర్తి జిల్లాల్లో పామాయిల్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీలు నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయని వివరించారు. వీటి నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసి ఆగస్టు మాసంలో రైతులకు అందుబాటులోకి తెచ్చేందుకు వీలుగా చర్యలు తీసుకో వాలన్నారు. రాష్ట్రంలో రైతు భరోసా, రైతు బీమా పథకం, ఉచిత విద్యుత్ సరఫరాతో పామాయిల్ సాగుచేసే రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. 10 లక్షల ఎకరాల్లో పామాయిల్ సాగు విస్తరణ చేస్తే రాష్ట్రం లో గ్రీన్‌కవర్ పెరగటంతో పాటు, రాష్ట్ర ఆర్థిక ప్రగతిలో ముఖ్య భూమిక వహించనుందని చెపాౖరు. ప్రత్యామ్నాయ పంటల సాగులో భాగంగా రైతులు పామాయిల్ సాగు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. దేశ వ్యాప్తంగా 36 శాతం సాగు విస్తరణతో దేశంలోనే తెలంగాణ గుర్తింపు తెచ్చుకుందని చెప్పారు.



## కెటిఆర్‌తో బాల్క సుమన్ భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 26:** దాదాపు నెలరోజుల పాటు జైల్లో ఉన్న చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత బాల్క సుమన్ గురు వారం సాయంత్రం చంచల్‌గూడ జైలు నుంచి బెయిల్‌పై విడుదలైన సంగతి తెలిసిందే. జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత శుక్రవారం ఆయన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. సింగరేణి బొగ్గు గనులకు సంబంధించి తీవ్ర వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో ఆయనపై కేసు నమోదయింది. ఈ క్రమంలోనే ఆయ నను అరెస్ట్ చేశారు. ఈ కేసుల వల్ల ఆయన ఏకంగా 27 రోజులపాటు జైల్లో గడపాల్సి వచ్చింది. కేటీఆర్‌ను కలిసిన సందర్భంగా... తన జైలు అనుభ వాలు, తదుపరి న్యాయ పోరాటం గురించి చర్చించారు. ఈ కష్టకాలంలో పార్టీ తనకు అండగా నిలిచి నందుకు కేటీఆర్‌కు థాంక్స్ చెప్పారు. బాల్క సుమన్‌ను కేటీఆర్ ఆత్మీయంగా హత్తుకుని, ధైర్యం చెప్పారు.

## అటవీ శాఖలో కీలక మార్పులు

### హెచ్‌ఒఎఫ్‌ఎఫ్ సువర్ణ పదవీవిరమణ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 26:** తెలంగాణ అటవీ శాఖలో ప్రభుత్వం కీలక మార్పులు చేపట్టింది. రాష్ట్ర హెడ్ ఆఫ్ ఫారెస్ట్ ఫోర్స్ (హెచ్‌ఓఎఫ్ఎఫ్) డా. సి. సువర్ణ ఈనెల 30న పదవీ విరమణ చేయ నున్నారు. ఈ నేపథ్యంలో సువర్ణను ప్రభుత్వ సేవల నుంచి రిలీవ్ చేయా లని రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. డా.సి.సువర్ణ పదవీ విరమణతో.. ఆ స్థానంలో సీనియర్ ఐఎఫ్ఎస్ అధికారి వినయ్ కుమార్‌కు హెచ్‌ఓఎఫ్ఎఫ్(బ్నీసీసీ) పూర్తి అదనపు బాధ్యతలను అప్పగిం చింది. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు వినయ్‌కుమార్ ఈ బాధ్యతలను కొనసాగించనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వం జీఓ ఆర్‌టీ నెం. 915ను విడుదల చేసింది. రాష్ట్ర అటవీ శాఖ పరిపాలనా వ్యవహారాలు నిరంతరాయంగా కొనసాగేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

## చికిత్స పొందుతూ చర్లపల్లిజైలు ఖైదీ మృతి

**హైదరాబాద్ (సికిందరాబాద్), జూన్ 26, ప్రభాతవార్త:** గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చర్లపల్లి జైలు ఖైదీ మృతిచెందాడు. అత్యాచారం కేసులో 10 ఏళ్ల జైలు శిక్ష అనుభవిస్తున్న ఖైదీని కొంతకాలం క్రితం నిర్మల్ జైలు నుంచి చర్లపల్లికి బదిలీ చేశారు. ఖైదీ సోన్న అడెల్లు కార్డియోజెనిక్ షాక్తో మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు.ఛాతీ, ఒళ్లు నొప్పులతో అనారోగ్యానికి ఖిగురైన అతడికి పలుమార్లు గాంధీ ఆస్పత్రిలో చికిత్స అందించారు. ఈనెల 24న గుండెపోటు రావడంతో ఆస్పత్రిలో చేర్పించారు. ఈ క్రమంలో పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో డయాలసిస్ కూడా చేశారు. చికిత్స పొందు తూ గురువారం మధ్యాహ్నం ఖైదీ మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు మృతుడి కుటుంబసభ్యులకు జైలు అధికారులు సమాచారం.

## లండన్‌లో తెలంగాణ విద్యార్థి అనుమానాస్పద మృతి

**హైదరాబాద్, జూన్ 26, ప్రభాతవార్త:** లండన్‌లో కామారెడ్డి జిల్లా రాజంపేట మండలం తలమడ్ల గ్రామానికి చెందిన సావుసాని శ్రీనాథ్‌రెడ్డి (25) లండన్‌లో రెండు రోజుల క్రితం అనుమానస్పదంగా మృతి చెందాడు. ఉన్నత చదువుల కోసం తెలంగాణకు చెందిన ఆ యువకుడు ప్రాణాలు కోల్పోయాడంతో తలమడ్ల గ్రామంలో విషాదం నెలకొంది. శ్రీనాథ్ గతేడాదే లండన్‌లో చదువుకోవడానికి వెళ్లినట్లు బంధువులు తెలిపారు. శ్రీనాథ్ తలితండ్రులు మధుసూదన్ రెడ్డి, మంజుల కుమారుడి మరణవార్త తెలియడంతో హృద విదారకంగా విలపించారు. శ్రీనాథ్ రెడ్డి లండన్ లోని లీసెస్టర్ యూని వర్సిటీలో ఎంఎస్ రెండో సంవత్సరం చదువుతు న్నాడు .రెండు రోజుల క్రితం స్నేహితుడి పుట్టినరోజు వేడుకలకు వెళ్లిన శ్రీనాథ్ రాత్రి అక్కడే నిద్రించాడు. తెల్లవారేసరికి విగతజీవిగా పడి ఉన్నట్లు స్నేహితులు అక్కడే ఉన్న శ్రీనాథ్ బంధువులకు సమాచారం అందించగా వారు ఘటనా స్థలానికి చేరుకొని తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లిన తమ కుమారుడు ఇక తిరిగిరాడని శాశ్వతంగా ఈ భూమిపై నుంచి వెళ్లిపోవడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరవుతున్నారు. శ్రీనాథ్ మృతదేహాన్ని సాధ్యమైనంత త్వరగా స్వగ్రామానికి తీసుకువచ్చేలా ఏర్పాట్లు చేయాలని మంజుల మధుసూదన్‌రెడ్డి దంపతులు రాష్ట్ర ప్రభుత్వానికి విన్నపం చేశారు.



## పదవీవిరమణ చేసిన అధికారులకు కీలక పదవులు

### అప్పుడు కెసిఆర్, ఇప్పుడు రేవంత్ అదేబాట

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 26:** పదవీ విరమణ చేసిన వెంటనే కె. రామకృష్ణా రావును సీఎం సలహాదారుగా నియామకం చేయడంతో పాటు ఆయనకు ఇచ్చే జీతభత్యాలు.. ఇతర సేవా నిబంధనలు, కండీషన్లను త్వరలోనే జారీ చేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం తేల్చి చెప్పింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కూడా సీనియర్ ఐఎఎస్, ఐపీఎస్ అధికారులకు పదవీ విరమణ తర్వాత కీలక బాధ్యతలను అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ అప్పగించారు. ఇలా రిటైర్ అయిన సీనియర్ అధికారులకు కొత్త బాధ్యతలు అప్పగించే సాంప్రదాయాన్ని కేసీఆర్ తీసుకొచ్చా రు. తెలంగాణ ఏర్పడిన తర్వాత మొదటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన డాక్టర్ రాజీవ్ శర్మ.. 2016 డిసెంబర్‌లో పదవీ విరమణ చేశారు. ఆ వెంటనే.. డాక్టర్ రాజీవ్ శర్మను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారుగా కేసీఆర్ నియమించారు. ఈ క్రమంలోనే ఆయనకు కేబినెట్ హోదాను కూడా కల్పించారు. కేసీఆర్‌కు అత్యంత నమ్మకస్తుడైన ఐఏఎస్ అధికారిగా పేరు తెచ్చుకున్న సోమేష్ కుమార్‌కు కూడా కేసీఆర్ పదవి ఇచ్చారు. క్యాట్ ఆర్డర్ వివాదంలో తెలంగాణ హైకోర్టు తీర్పు కారణంగా ఆయన 2023 జనవరిలో తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పదవి నుంచి తప్పుకోవాల్సి వచ్చింది. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు వెళ్లిన సోమేష్ కుమార్.. ఆ తర్వాత స్వచ్ఛంద పదవీవిరమణ (వీఆర్ఎస్) తీసుకు న్నారు. ఈ క్రమంలోనే సోమేష్ కుమార్ వీఆర్ఎస్ తీసుకున్న వెంటనే 2023 మేలో ఆయనను సీఎం ముఖ్య సలహాదారుగా నియమించారు. సోమేష్ కుమార్‌కు కేబినెట్ హోదా ఇచ్చి 3 ఏళ్ల కాలపరిమితితో ఆ పదవిలో నియమించారు. రాజీవ్ శర్మ తర్వాత తెలంగాణ సీఎస్‌గా పనిచేసిన ఎస్‌కే జోషి కూడా పదవీ విరమణ చేసిన వెంటనే కేసీఆర్ ప్రభుత్వంలో నీటిపారుదల శాఖ సలహాదారుగా నియమితులు అయ్యారు. ఇక కేవలం ఐఏఎస్ అధికారులే కాకుండా.. ఐపీఎస్ అధికారులకు కూడా రిటైర్మెంట్ తర్వాత పదవులు దక్కాయి. తెలంగాణ తొలి డీజీపీగా పనిచేసిన అనురాగ్ శర్మ.. పదవీ విరమణ చేసిన వెంటనే ఆయనను హోంశాఖ సలహాదారుగా కేసీఆర్ ప్రభుత్వం నియమించింది. ప్రభుత్వాలు మారినా లేక పరిపాలనలో వేగం పెంచాలన్నా.. సీనియర్ అధికారుల సుదీర్ఘ అనుభవం, కీలక శాఖలైన ఆర్థిక, శాంతిభద్రతలు, నీటిపారుదలపై వారికి ఉన్న పట్టు రాష్ట్ర ప్రభుత్వానికి ఎంతో అవసరం ఉంటుంది. అందుకే వారు రిటైర్మెంట్ అయిన తర్వాత కూడా.. ప్రభుత్వ అవసరాల మేరకు వారికి ప్రత్యేక పదవులు ఇస్తూ ఉంటారు.

## ఎఐజి ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకున్న ఎపి సిఎం చంద్రబాబు

### నేడు ఎపిలో వెలిగొండ ప్రాజెక్టు పనుల పురోగతి పరిశీలన



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 26:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హైదరా బాద్‌లోని గచ్చిబౌలిలో గల ప్రముఖ ఏఐజీ హాస్పిటల్‌కు విచ్చేశారు. సాధారణ వైద్య పరీక్షల నిమిత్తం హాస్పిటల్‌కు చేరుకున్నారు. 10 రోజుల వ్యవధిలో చంద్రబాబు ఏఐజీ హాస్పిటల్‌కు రావడం ఇది రెండవ సారి కావడంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది. సింగపూర్ పర్యటనకు వెళ్లొచ్చిన తర్వాత ఇదే ఎఐజి ఆసుపత్రిలో ఆయన వైద్య పరీక్షలు చేయించుకున్నారు. శుక్రవారం ఎఐజి ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకునే ముందు కంటి పరీక్షల కోసం ఎల్‌వి ప్రసాద్ ఆసుపత్రికి వెళ్లారు. తర్వాత నేరుగా ఎఐజి ఆసుపత్రిలో 9వ ఫ్లోర్‌లో మాజీ సిఎస్(ఏపీ) విజయానంద్ ఆనారోగ్య రీత్యా చికిత్స తీసుకుంటున్నారు. ఆయనను సిఎం చంద్రబాబు నాయుడు పరామర్శించారు. తర్వాత ఆయన నేరుగా వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఆయన వెంట అధికారులు మాత్రమే ఉన్నారు. కుటుంబ సభ్యులు ఎవ్వరూ లేరు. వైద్య పరీక్షల తర్వాత ఆయన జూబ్లీహిల్స్ లోని తన నివాసానికి వెళ్లారు.కాగా శనివారం ఉదయం ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లనున్నారు. కాగా ఆయన హైదరాబాద్ నుంచి నేరుగా మార్కాపురం జిల్లాకు ప్రత్యేక విమానంలో వెళ్లనున్నారు. అక్కడ దోర్నాల మండలం గంటవానిపల్లెలో వెలిగొండ ప్రాజెక్టు పనుల పురోగతిని పరిశీలించనున్నారు. ప్రాజెక్టు నిర్వా సితులు, రైతులతో సిఎం భేటీ కానున్నారు. నిర్వా సితులకు రూ.300 కోట్ల పరిహారాన్ని అందిం చనున్నారు. దీంతో 2,351 నిర్వాసిత కుటు ంబాలకు లబ్ధి కలగనుంది. గత ప్రభుత్వంలో కేవలం 96 కుటుంబాలకు పరిహారం అంద జేయడంతో పనులూ నత్తనడకన సాగాయి. కూట మి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వెలిగొండ పూర్తిపై ఫోకస్ పెట్టింది. శరవేగంగా పనులు. 24 నెలల్లోనే నష్టపరిహారం, పునరావాస పనులకు రూ.903 కోట్ల అదనపు బడ్జెట్‌ను ప్రభుత్వం విడుదల చేసింది. రూ.759 కోట్ల మేర పనులు పూర్త అయ్యాయి. ప్రాజెక్టు పూర్తి కావొస్తుండటం, పరిహారం అందిస్తుండటంతో రైతులు,నిర్వాసితులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వెలిగొండ పనుల పురోగతిని పరిశీలించిన తర్వాత సాయంత్రం ఉండవల్లి నివాసానికి చేరుకుంటారు.

## గోల్డ్‌మాన్ సూర్యభాయ్‌పై చీటింగ్ కేసు

**హైదరాబాద్, జూన్ 20, ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాల్లో గోల్డ్‌మాన్‌గా పేరొం దిన పాతబస్తీకి చెందిన సూర్య అలియాస్ సూర్యభాయ్‌పై చీటింగ్ కేసు నమోదయింది. తక్కువ ధరకు బంగారం ఇప్పిస్తానని నమ్మించి అమాయకుల నుంచి 30 లక్షల రూపాయలకు పైగా తీసుకుని వారిని మోసం చేసినందుకు అతనిపై ఈ కేసు నమోదయ్యింది. గోల్డ్ మ్యాన్ సూర్య గురించి తెలిసిందే. ఇంతకు ముందు శంషాబాద్ విమా నాశ్రయంలో భారీగా బంగారు నగలు ధరించి ఢిల్లీకి వెళ్లిన సమయంలో ఢిల్లీ విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారులు అతన్ని నిలువరించి వా కబు చేయగా అతని ఒంటిపై వున్న నగల్లో చాలా వరకు గిల్టు నగలుగా తేలింది. అయితే కొంతమేర అసలు నగలు వుంటే వాటిని కస్టమ్స్ అ ధికారులు జప్తు చేసి రసీదు చూపించి తీసుకు వెళ్లాలని కోరడం విదితమే.ఇక తాజా విషయానికి వస్తే హిమాయత్‌నగర్‌కు చెందిన 30 మంది నుంచి సూర్య 30 లక్షల రూపాయలకు పైగా తీసుకున్నాడు. తక్కువ ధరకు బంగారం ఇప్పిస్తానని వారిని నమ్మించాడు. తనకు సిఎం రేవంత్‌రెడ్డి తెలుసునని, సిఎం కార్యాలయంలో చాలా మంది తెలుసునని బుకాయించాడు. అయితే డబ్బులు తీసుకుని నెలలె గడిచినా వారికి బంగారం ఇవ్వక పోవడంతో వారంతా పాతబస్తీ లోని సూర్య ఇంటికి శుక్రవారం వెళ్లి నిలదీశారు. ఈ క్రమంలో సూర్య వారిని నమ్మించేందుకు తన వ ద్ద వున్న రెండు సెల్‌ఫోన్లను చూపించి వీటి విలువ 10 లక్షల రూపాయలని వారికి ఇచ్చేశాడు. మరో 20 లక్షల రూపాయలకు చెక్కు ఇచ్చాడు. దీని తరువాత బాధితులు అక్కడి నుంచి వెళ్లిపోగా సూర్య నేరుగా అత్తాపూర్ పోలీసులకు ఫోన్ చేసి తన ఇంటి వద్దకు కొందరు వచ్చి తనపై దాడిచేసి సెల్‌ఫోన్లను లాక్కుని వెళ్లారని ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలో దిగిన పోలీసులు సూర్య ఇంటికి వెళ్లిన వారిని అత్తాపూర్ పోలీసు స్టేషన్‌కు తీసుకువచ్చి విచారించగా అసలు విషయం రట్టయ్యింది. దీంతో పోలీసులు మొదట జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి సూర్య గోల్‌మాల్‌పై నారాయణగూడ పోలీసు లకు ఫిర్యాదు చేయాలని అత్తాపూర్ పోలీసులు బాధితులను కోరారు. దీంతోపాటు తమ వద్ద నమోదైన జీరో ఎఫ్ఐ ఆర్‌ను నారాయణగూడ పోలీసు స్టేషన్‌కు బదలీ చేశారు.

## ఎన్యూమరేషన్ ఫారాలు ఉర్దూలోనూ ప్రచురించాలి

### మైనార్టీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వినతి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 26:** రాష్ట్రంలో ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా బీఎల్‌ఓలు ఓటర్లకు పంపిణీ చేస్తున్న ఎన్యూమరేషన్ ఫారాలను ఉర్దూ భాషలో కూడా అందుబాటులో ఉంచాలని మైనార్టీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యాకూబ్ పాషా శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో తెలుగుతో పాటు ఉర్దూ కూడా అధికారిక ద్వితీయ భాష అయినప్పటికీ, ఎన్నికల కమిషన్ ఎన్యూమరేషన్ ఫారాలను ఉర్దూలో ముద్రించకపోవడం లక్షలాది ఉర్దూ మాట్లాడే ఓటర్లకు ఇబ్బందులు కలిగిస్తోందని అన్నారు. ప్రస్తుతం హైదరా బాద్‌లో ఆంగ్ల భాషలో, రాష్ట్రంలోని మిగతా ప్రాంతాల్లో తెలుగులో మాత్రమే ఫారాలను అందిస్తున్నట్లు సమా చారం ఉందని పేర్కొన్నారు. ఉర్దూ మాతృభాషగా ఉన్న వృద్ధులు, నిరక్షరా స్యులు, సాధారణ ప్రజలు ఫారాలను సరిగ్గా అర్థం చేసుకుని పూరించడంలో ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

## వన్యప్రాణులను వేటాడుతున్న ముఠా అరెస్టు

### కామారెడ్డి పోలీసుల ఆపరేషన్ కవచ్

### నాటు తుపాకులు, పేలుడు పదార్థాలు స్వాధీనం

**హైదరాబాద్, జూన్ 26, ప్రభాతవార్త:** వన్యప్రాణులను వేటాడుతూ వాటి మాంసం సహా ఇతర అవయవాలను అమ్ముకుంటూ సొమ్ము చేసు కుంటున్న ఎనిమిది మంది సభ్యుల వేటగాళ్ల ముఠాను కామారెడ్డి జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. ఆపరేషన్ కవచ్‌లో భాగంగా వన్యప్రాణుల ను వేటాడుతున్న వేటగాళ్లపై నిఘా వుంచి పట్టుకోగా ఈ సందర్భంగా వారి వద్ద నుంచి ఐదు నాటు తుపాకులతో పాటు ఒక ఎయిర్ గన్ సహా కొంత పేలుడు పదార్థాలను, రెండు ద్విచక్ర వాహనాలను జప్తు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను జిల్లా ఎస్‌పి రాజేష్ చంద్ర శుక్రవార ం మీడియాకు వెల్లడించారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని పలు ప్రాంతాలలో కొంతకాలంగా వన్యప్రాణులను వేటాడుతున్న స్మగ్లర్లపై పోలీ సులు నిఘా వుంచారు. ఇక్కడి నుంచి పలురకాల వన్యప్రాణులను కొందరు వేటగాళ్లు చంపి వాటి మాంసంతో పాటు ఇతర అవయవాలను వే రే ప్రాంతాలకు తరలించి అమ్ముతున్న ఘటనలు పెరగడంతో ఆపరేషన్ కవచ్ పేరిట వారిపై నిఘా వుంచారు. ఈ క్రమంలో గాంధారి పోలీసు స్టేషన్ పరిధిలో అటవీ ప్రాంతంలో రహదారిపై బుధవారం రాత్రి గస్తీ పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా రెండు ద్విచక్ర వాహనాలపై ఆయుధాలతో వచ్చిన ఐదు గురు వ్యక్తులు పోలీసులను చూసి పారిపోయారు.

పోలీసులు వీరిని వెంబడించి పట్టుకోగా ఐదుగురి పేర్లు విస్లావత్ అరుణ్, విస్లావత్ గోపిచంద్, అంగోత్ లక్ష్మణ్, విస్లావత్ వాసు, విస్లావత్ గణేష్‌లుగా తేలింది. వీరి వద్ద రెండు నాటు తుపాకులు, స్వల్పస్థా యి తీవ్రత కలిగిన పేలుడు పదార్థాలు, ఇనుప చెర్రలు పట్టుబడ్డాయి. వీరిని వెంటనే జిల్లా పోలీసు కేంద్రానికి తరలించి విచారించగా మరిన్ని విషయాలు వెలుగు చూశాయి. వీరికి మరో ముగ్గురు నాటు తుపాకులతో పాటు వన్యప్రాణులను వేటాడేందుకు కావలసిన పేలుడు పదార్థాలను అందిస్తున్నట్లు తేలింది. వీరు సదాశివనగర్‌లో ఓ కోళ్ల ఫారంలో వున్నట్లు తేలడంతో గురువారం ఉదయం జిల్లా పోలీసులు అక్కడ దాడిచేశారు. ఈ సందర్భంగా సలావత్ చందర్, అంగోత్ ధర్మ నాయక్, అస్లాం చావుస్‌లు పట్టుబడ్డారు. వీరి వద్ద మరో మూడు నాటు తుపాకులతో పాటు ఎయిర్ గన్, జంతువులను వేటాడేందుకు వేట కొడవళ్లు, పదునైన కత్తులు, పేలుడు పదార్థాలు లభించాయి. పట్టుబడ్డ ఎనిమిది మంది వేటగా ళ్లను కోర్టులో హాజరుపరిచి జిల్లా జైలుకు తరలించారు. కాగా జిల్లాలో వన్యప్రాణుల వేటపై కఠిన నిఘా వుందని జిల్లా ఎస్‌పి రాజేష్ చంద్ర తెలిపారు. వేటగాళ్లను వెంటాడి పట్టుకుంటామని ఆయన తెలిపారు. తాజాగా పట్టుబడ్డ ముఠాకు ఎవరితో సంబంధం వుందనే కోణంలో విచార ణ చేస్తామని ఆయన వెల్లడించారు. ఈ ముఠాను పట్టుకున్న పోలీసులను ఆయన అభినందించారు. ఈ సమావేశంలో ఎల్లారెడ్డి డిఎస్‌పి సహా ఇతర అధికారులు పాల్గొన్నారు.




వన్యప్రాణులను వేటాడుతున్న ముఠా అరెస్టు వివరాలను వెల్లడిస్తున్న కామారెడ్డి జిల్లా ఎస్‌పి రాజేష్‌చంద్ర.

## డ్రగ్స్‌కు నో చెప్పండి.. ఆరోగ్యకరమైన జీవితానికి ఎస్ చెప్పండి

### గవర్నర్ శివప్రతాప్‌శుక్లా

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 26:** అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా నిరోధక దినోత్సవం సందర్భంగా తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ప్రజలకు పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తులు, కుటుంబాలు, సమాజానికి తీవ్ర హానికరమని గవర్నర్ పేర్కొన్నారు. ముఖ్యంగా యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండేలా ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడం ద్వారా మాదకద్రవ్యాల వ్యసనాన్ని నివారించవచ్చని తెలిపారు. మాదక ద్రవ్యాలకు నో చెప్పి ఆరోగ్యకరమైన జీవితానికి ఎస్ చెప్పాలన్నారు. డ్రగ్‌ఫ్రీ తెలంగాణ, డ్రగ్‌ఫ్రీ ఇండియా సాధనలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని గవర్నర్ పిలుపునిచ్చారు

## విహెచ్‌కు అస్వస్థత.. ఆస్పత్రిలో చేరిక

**హైదరాబాద్, జూన్ 26, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వి.హను మంతరావు మూత్రపిండాల సమస్యతో అస్వస్థతకు గురై గురువారం రాత్రి ఖైరతాబాద్‌లోని ఏసియన్ ఇన్‌స్టిటిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ యూనిట్ ఆస్ప త్రిలో చికిత్స కోసం చేరారు. తిరుమలలో దైవదర్శనం చేసుకొని హైదరా బాద్‌కు చేరిన హనుమంతరావు తీవ్రఅస్వస్థతకు గురైనట్లు ఆయన సన్నిహి తులు తెలిపారు. మూత్రం ఆగిపోవడంతో ఆయనను గురువారం రాత్రి ఏడు న్నరకు ఆస్పత్రికి తీసుకొని రాగా ఆయనను పరీక్షించిన డాక్టర్ కిడ్నీలో స్టోన్ ఉందని దానిని ఆపరేషన్‌తో తొలగించాల్సి ఉంటుందని కుటుంబసభ్యులకు తెలిపారు. డాక్టర్ సలహా ప్రకారం ఆపరేషన్‌కు కుటుంబసభ్యులు సమ్మతి తెలపడంతో ఆయనకు సోమవారం ఆపరేషన్ చేసేందుకు వైద్యనిపుణులు నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.

## యాదాద్రి ఇఒ భవానీశంకర్ పదవీకాలం పొడిగింపు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 26:** యాదాద్రి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం ఈవోగా భవానీ శంకర్ పదవీకాలం మరో ఏడాదిపాటు పొడిగించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2019వ బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి భవానీశంకర్ పదవీకాలం ఈ నెల 30వ తేదీన ముగియనుంది. ఈ నేపథ్యంలో ఆయన పదవీకాలాన్ని ఏడాదిపాటు పొడిగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు సీఎస్ రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు.



సిఆర్‌పిఎఫ్ బలగాలు జప్తు చేసిన మావోయిస్టుల డంప్

## ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టుల డంప్ స్వాధీనం

### 24 లక్షల నగదుసహా ఆయుధాలు, పేలుడు పదార్థాలు లభ్యం

**హైదరాబాద్, జూన్ 26, ప్రభాతవార్త:** ఛత్తీస్ఘడ్ నక్సలైట్ల ఏరివేతకు కేంద్రం చేబట్టిన ఆపరేషన్ కగార్ ముగిసినప్పటికీ మావోయిస్టుల కోస ం అటవీ ప్రాంతంలో వారు దాచివుంచిన డంప్‌లు, మందు పాతరలు, పేలుడు పదార్థాల కోసం కేంద్ర బలగాల వేట కొనసాగుతూనే వుంది. ఈ క్రమంలో ఛత్తీస్ఘడ్‌లోని నారాయణ్‌పూర్ జిల్లా టెకా అటవీ ప్రాంతంలో నక్సలైట్ల కదలికలపై సమాచారం అందుకున్న సిఆర్‌పిఎఫ్ బలగా లు గురువారం ఉదయం నుంచి ముమ్మరంగా కూంబింగ్ చేబట్టారు. సిఆర్‌పిఎఫ్ పోలీసులకు తోడుగా జిల్లా సాయుధ పోలీసులు కూడా కూం బింగ్‌లో పాల్గొన్నారు. అయితే పోలీసుల రాకను గమనించి నక్సలైట్లు వెళ్లిపోగా పోలీసు జాగిలాలు ఒకచోట అదేపనిగా అరుస్తూ వుండడంతో అనుమానం వచ్చి పోలీసులు సోదాచేయగా మావోయిస్టుల డంప్ కనిపించింది. ఇందులో 24 లక్షల రూపా యల నగదుతోపాటు తుపాకులు, మందుగుండు సామాగ్రి లభ్యమయ్యింది. వీటిని సిఆర్‌పిఎఫ్ బలగాలు తమ స్థావరానికి తరలించారు. దీనిపై కేంద్ర హోంశాఖతోపాటు ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర పోలీ సులకు సమాచారం అందించారు.

## జులై 5 నుంచి లా సెట్ కౌన్సెలింగ్

### 16 నుంచి 19 వరకు వెబ్‌ఆప్షన్లు

### లా సెట్ నోటిఫికేషన్ జారీ

**హైదరాబాద్, జూన్ 26, ప్రభాతవార్త:** రాష్ట్రంలో మూడేళ్లు, ఐదేళ్ల లా కోర్సు లో ప్రవేశాల కోసం నిర్వహించిన టీజీ లాసెట్‌కి సంబంధించిన కౌన్సెలింగ్ నోటిఫికేషన్ శుక్రవారం విడుదల చేశారు. జులై 5 నుంచి కౌన్సెలింగ్‌ను ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను నోటిఫికేషన్‌లో టిజి సెట్స్ అడ్మిషన్స్ కన్వీనర్ ప్రొఫెసర్ పాండురంగారెడ్డి జారీ చేశారు. మూడు సంవత్సరాలు, ఐదు సంవత్సరాల లా కోర్సులకు సంబంధించిన ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, స్కాన్ చేసిన సర్టిఫికేట్ల అప్‌లోడింగ్ ప్రక్రియ జులై 5 నుంచి జులై 10 వరకు కొనసాగుతుంది. ప్రత్యేక కేటగిరీ అభ్యర్థులకు హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ ప్రవేశాల డైరెక్టరేట్ వేదికగా భౌతిక ధృవీకరణ ప్రక్రియ జులై 6 నుంచి 9 వరకు నిర్వహించనున్నారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ అనంతరం కౌన్సెలింగ్‌కి అర్హులైన అభ్యర్థుల జాబితాను జులై 15న ప్రకటిస్తారు. జులై 16 నుంచి 19 వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. జులై 20న మొదటి విడత వెబ్ ఆప్షన్లకు ఎడిట్ సౌకర్యం కల్పించారు. జులై 24న మొదటి విడత సీట్ల కేటాయింపు చేయనున్నారు. సీటు పొందిన అభ్యర్థులు జులై 25 నుంచి 28 వరకు ట్యూషన్ ఫీజు చెల్లించి ఆయా కాలేజీల్లో చేరాల్సి ఉంటుందని నోటిఫికేషన్‌లో స్పష్టం చేశారు. లాసెట్, పీజీ లాసెట్ పరీక్షను మే 18న రాష్ట్రంలో 71 కేంద్రాల్లో నిర్వహించారు. పరీక్షలకు 66,864 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 54,374 మంది పరీక్షకు హాజరయ్యారు. వారిలో 39,673 మంది(72.96శాతం) అర్హత సాధించారు.

## లొంగిపోయిన బండి భగీరథ్

### చర్లపల్లి జైలుకు తరలింపు

**హైదరాబాద్, జూన్ 26, ప్రభాతవార్త:** మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో అరెస్టయి చర్లపల్లి జైల్లో రిమాండులో వున్న బండి భగీరథ్ వారం రోజుల మధ్యంతర బెయిల్ ముగియడంతో లొంగిపోయాడు. ఈ నెల 20 వ తేదీన భగీరథ్‌కు ఇంజనీరింగ్ పరీక్షల నేపథ్యంలో మల్కాజిగిరి ఫోక్సో కోర్టు ఐదు రోజుల మధ్యంతర బెయిల్ మంజూరు చేయడం తెలిసిందే. అనంతరం అదేరోజు భగీరథ్ చర్లపల్లి జైలు నుంచి విడుదలయ్యాడు. బెయిల్ గడువు ముగియడంతో లొంగుబాటుపై పోలీసులకు అతను సమాచారం అందించాడు. దీనిపై స్పందించిన పోలీ సులు కోర్టులో లొంగిపోవాలని సూచించారు. దీని తరువాత గురువారం సాయంత్రం మేడ్చల్ కోర్టులో తన న్యాయవాదులతో కలిసి భగీరథ్ లొంగిపోయాడు. అనంతరం అతన్ని పోలీసులు చర్లపల్లి జైలుకు తరలించారు. గత నెల 16వ తేదీన భగీరథ్‌ను పేట్ బషీరాబాద్ పోలీసు స్టేషన్‌లో నమోదైన ఫోక్సో కేసులో అరెస్టు చేయడం తెలిసిందే. అంతకు పది రోజుల ముందు భగీరథ్‌పై ఫోక్సో కేసు నమోదుకాగా అతను పో లీసుల విచారణకు రాకుండా హైకోర్టులో ముందస్తు బెయిల్‌కు ప్రయత్నించగా అక్కడ పిటిషన్ డిస్మిస్ అవడం విదితమే. దీని తరువాత భగీర థ్‌ను పేట్ బషీరాబాద్ పోలీసులు గండిపేట్ వద్ద అరెస్టు చేసి జైలుకు తరలించారు. ఈ కేసులో భగీరథ్‌ను పోలీసులు మూడు రోజుల పాటు కస్టడీలోకి తీసుకుని విచారించారు. భగీరథ్ దాఖలు చేసిన రెగ్యులర్ బెయిల్ పిటిషన్‌ను మల్కాజిగిరి పోక్సో కోర్టు డిస్మిస్ చేసింది.

## సింగపూర్ కేంద్రంగా సైబర్ నేరాలు

### తెలంగాణలో మ్యూల్ ఖాతాలు నిర్వహిస్తున్న నలుగురి అరెస్టు

**హైదరాబాద్, జూన్ 26, ప్రభాతవార్త:** సింగపూర్ కేంద్రంగా సైబర్ నేరాలకు పాల్పడుతున్న ఓ ముఠాకు తెలంగాణలో మ్యూల్ ఖాతాలు అం దిస్తూ సహకరిస్తున్న నలుగురిని సిటీ సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా నిందితుల నుంచి కేవలం ఒక సెల్‌ఫోన్ మాత్ర మే పట్టుబడింది. దీనికి సంబంధించిన వివరాలను సైబర్ క్రైం డిసిపి అరవింద్ బాబు శుక్రవారం మీడియాకు వెల్లడించారు. హైదరాబాద్‌కు చె ందిన ఓ వ్యక్తిని గత ఫిబ్రవరి నెలలో మ్యాట్రిమోనియల్ టీం పేరిట సైబర్ నేరగాళ్లు యువతి తరహాలో మాట్లాడి బురిడి కొట్టించి ఇన్వెస్ట్‌మెం ట్ పేరిట కోటి 46 లక్షల రూపాయలను కాజేశారు. తాము సూచించిన కంపెనీల్లో పెట్టుబడులు పెడితే దండిగా లాభాలు వస్తాయని నమ్మించి న వీరు ఆ తరువాత బాధితుడి ఫోన్‌కు స్పందించడం మానేశారు. దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించగా దీనిపై సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేబట్టారు.

కాగా ఈ కేసులో సింగపూర్ కేంద్రంగా బడా సైబర్ క్రైం జరుగుతున్నట్లు తేలింది. అక్కడి ముఠా కు తెలంగాణలో పలు ప్రాంతాలలో మ్యూల్ ఖాతాలు అందిస్తున్న నలుగురు వున్నట్లు తేలింది. బాధితుడి నుంచి కాజేసిన కోటీ 46 లక్షల రూ పాయలు ఇండియన్ ఓవర్‌సీస్ సహా పలు బ్యాంకుల నుంచి అనేక ఖాతాలకు మళ్లించినట్లు తేలడంతో మ్యూల్ ఖాతాలు కలిగిన వారిపై ఆరా తీయగా సిద్దిపేట్‌కు చెందిన చొక్కాల సంపత్ (29), సికింద్రాబాద్‌కు చెందిన హెచ్చు నరేష్ (37), ఎండ్ల సురేష్ (43), వడ్కల మహేష్ (33) ల గోల్‌మాల్ రట్టయ్యింది.

ఈ నలుగురు సింగపూర్ నేరగాళ్లకు కమీషన్ తీసుకుని మ్యూల్ ఖాతాలను అందించినట్లు తేలింది. ఇందులో 46. 65 లక్షల రూపాయలు హైదరాబాద్‌లోని పలు బ్యాంకుల నుంచి లావాదేవీలు జరిగినట్లు తేలింది. ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకు నుంచి 35 లక్షల రూపాయలు బదిలీ అయినట్లు తేలింది. ఈ కేసులో చొక్కాల సంపత్ కీలక నిందితుడుగా తేలింది. ఇతను 30 శాతం కమీషన్‌పై నేరం చేయగా హెచ్చు నరేష్ 15 శాతంపై, ఎండ్ల సురేష్ పది శాతం, మహేష్ 10 శాతంపై ఖాతాలు అందించినట్లు తేలింది. కమీషన్ ద్వారా అం దిన డబ్బులను నిందితులు తమ అవసరాలకు వాడుకున్నారు. వీరి వద్ద నేరం చేసేందుకు వాడిన సెల్‌ఫోన్‌ను జప్తు చేశారు. ఈ కేసులో సింగ పూర్‌లో వుండే ప్రధాన నేరగాళ్లతో పాటు భారత్‌లో వారికి సహకరించిన ఇతర నేరస్తుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

వార్త

మేధావి అంటే మరెవరో కాదు. ప్రతి చిన్న పెద్ద విషయాన్ని స్పష్టంగా చూడగలవాడే మేధావి.

- గోథ

# పాలకుల నిర్వాకానికి దర్పణం ధరలే

**అదుపులేకుండా పెరిగిపోతున్న ధరలు జనజీవనాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. బడుగు, పేద వర్గాలే కాదు మధ్యతరగతి ప్రజలు అల్లాడిపోతున్నారు. పరిమితిలేని ఆదాయం కలవారి గురించి చింతలేదు కానీ రెక్కాడితే కానీ డొక్కాడని ప్రజలు, నెలసరి జీతగాళ్లు, పరిమిత ఆదాయం గలవారి పరిస్థితి అయోమయంగా తయారయింది. ఇతర మార్గాల్లో ఆదాయం ఉంటే తప్ప సంసారాన్ని నడపలేని పరిస్థితులు దాపురించాయి. ఎన్ని సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినా అన్ని వర్గాలకు సంబంధించిన ఈ ధరల పెరుగుదల సమస్యను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తులో మూల్యం చెల్లించక తప్పదు. గతంలో ఉల్లిగడ్డల ధరలు పెరగడంతో అధికారాన్ని కోల్పోయిన కేంద్ర ప్రభుత్వ పెద్దలను చూశాం. పాలకులు ఇప్పటికైనా కళ్లు తెరవాలి. ఇలాగే నిర్లక్ష్యం చేస్తే ఎన్ని సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టినా, ఉద్యోగుల జీతభత్యాలు ఏ రీతిలో పెంచినా ఆశించిన ఫలితాలు రాకపోగా పేదరికం మరింత పెరుగుతుంది.**

అదుపు ఆజ్ఞా లేకుండా పెరిగిపోతున్న ధరలను నియంత్రిస్తాం, నల్లబజారుదారులపై ఉక్కుపాదం మోపుతాం అంటూ ఎవరు అధికారంలో ఉన్నా చెప్పే మాటలే చెప్తున్నారు తప్ప ఆచరణలో మాత్రం చేయలేకపోతున్నారు. స్వరం మారుతున్నదేతప్ప పాట మాత్రం పాతదే అన్నట్లుగా ఉంది పాలకుల ధోరణి. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ధరల విషయంలో ఆవేదన, ఆందోళన వ్యక్తం చేసి రోడ్లపైకి వచ్చి ఉద్యమాలు చేపట్టిన నేతలే అధికారంలోకి రావడంతోనే మారిపోతున్నారు. ఇటీవల అదుపు లేకుండా పెరిగిపోతున్న నిత్యావసర ధరలతో సామాన్యులు విలవిల్లాడిపోతున్నారు. ఒక్కరోజు ఉన్న ధర మరుసటి రోజు ఉండడం లేదు. ఒక పట్టణంలో ఉన్న ధర మరో నగరంలో ఉండడం లేదు. ఇక ధరలు కొండెక్కడానికి గల కారణాలు, కారకులు ఎవరో, ఎవరికి చెప్పుకోవాలో, ఎవరు చర్యలు తీసుకుంటారో దిక్కుతోచక సన్నజనంతోపాటు మధ్యతరగతి ప్రజలు కొట్టుమిట్టాడుతున్నారు. పోని ఉత్పత్తి చేస్తున్న రైతుకు గిట్టుబాటు ధర వస్తున్నదంటే అదీ లేదు. అక్కడ పెట్టుబడులు పెరిగిపోతున్నాయి. పండించిన పంటలకు ధరలు తగ్గిపోతున్నాయి. గిట్టుబాటు ధరలు రాక అన్నదాతలు అన్నానికి జరక్కా, అప్పులు చెల్లించలేక, ఆత్మాభిమానం చంపులేక ప్రాణత్యాగం చేస్తున్నారు. రైతుల వద్ద పంటలు ఉన్నప్పుడు వాటి ధరలు విపరీతంగా పడిపోతున్నాయి. వారి వద్ద నుంచి ప్రైవేట్ వ్యక్తుల గోదాముల్లోకి చేరుకోగానే ఒక్కసారిగా పెరిగిపోతున్నాయి. ఇదంతా ఒక పక్కా వ్యూహం ప్రకారం కృత్రిమ కొరత సృష్టించి ఇష్టానుసారంగా ధరలను పెంచుకుంటున్నారు. ఇదేదో ఇప్పటికిప్పుడు కొత్తగా వచ్చిందని చెప్పడం లేదు. ఎప్పటి నుంచో జరుగుతున్నది. రాను రాను పెరిగిపోతున్నది. ఇందులో కొందరు దళారులు, వ్యాపారస్తులు కీలకపాత్ర వహిస్తారన్న విషయం అధికారులతోసహా అందరికి తెలిసిందే. కొందరు దళారులు కమిషన్ల రూపంలో కోట్లాది రూపాయలు భోంచేస్తున్నారు. చట్టప్రకారం లైసెన్సులు పొందినా, నిబంధనలను అతిక్రమించిఅటు రైతులను, ఇటు వినియోగదారులను దోపిడీచేస్తున్నారు. ఇలా దోపిడీకి గురికాకుండా నివారించి రైతులకు గిట్టుబాటు ధర ఇప్పించి వినియోగదారులకు సరసమైన ధరలకు నిత్యావసర వస్తువులను అందించడంలో కీలకపాత్ర వహించాల్సిన మార్కెట్ కమిటీలు రైతులు, వినియోగదారులకు భక్షక కంపెనీలుగా తయారయ్యాయి. దళారులను అదుపు చేయలేకపోగా కొన్ని చోట్ల వారితోనే కుమ్మక్కైపోతున్నారు. అనేక సందర్భాల్లో ఈ విషయాలు వెలుగుచూశాయి. రైతులు ఉద్యమించారు. ధర్నా చేశారు. కొన్ని చోట్లదాడులు కూడా చేశారు. అయినా ఏమాత్రం ఫలితంఉండడం లేదు. ఇందుకు ప్రధాన కారణం

దామెర్ల సాయిబాబ

ప్రజాస్వామ్యం, ప్రజాస్వామ్యం అంటూ వేదికలు ఎక్కిఅరిచే పెద్దలే మార్కెట్ కమిటీల విషయంలో ఇదే ప్రజాస్వామ్యాన్ని భూస్థాపితం చేయడమే. నామినేషన్ పద్ధతి ఎవరు ఎప్పుడు ప్రవేశపెట్టారో కానీ, రైతుల పాలిట శాపాలుగా పరిణమించాయి. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎంపిక కావాల్సిన రైతు ప్రతినిధులకు బదులు బంధుమిత్రులనో, లేక తమ తోకలుగా, బాకాలుగా ఉన్న రాజకీయ కార్యకర్తలను ఈ కమిటీల్లో నేతలు నియమించుకుంటున్నారు. ఇలా మార్కెట్ కమిటీలు రాజకీయ పునరా వాస కేంద్రాలుగా రూపాంతరం చెందాయి. ఇందులో ప్రజలచే తిరస్కరించబడినవారు, ఎన్ని

## ఒక్క మాట

కల్లో పోటీ చేసే సత్తా లేనివారు, ప్రజాసేవ అంటే ఏమిటో తెలియని వారిని సైతం ఈ కమిటీల్లో చేర్పిస్తున్నారు. పాలకుల దయాదాక్షిణ్యాలమీద ఎంపిక అయిన పాలక మండళ్ల ఉనికి నామ మాత్రమే కాదు దళారుల సంక్షేమ ధ్యేయంగా పనిచేసే పరి స్థితులు ఏర్పడ్డాయి. పాలక మండళ్లకు ఎసి గదులు, కార్లు లాంటి సౌకర్యాలు కల్పించుకొనేందుకు మార్కెట్ కమిటీ నిధులు వెచ్చించే పెద్దలు రైతులు అహర్నిశలు కష్టపడి పండించి మార్కెట్లోకి తెచ్చిన పంటను వర్షం నుండి కాపాడుకునేందుకు టార్పాలియన్లు ఇవ్వలేకపోవడం పరిశీలిస్తే పరిస్థితి అర్థమవుతుంది. ధరల నిర్ణయంలో దళారులదే కీలక పాత్రగా మారిపోయింది. అవసరం అనుకుంటే పోటీగా ఇతర ప్రాంతాల నుంచిసరుకులు రప్పించి స్థానిక రైతుల ఉత్పత్తులను దెబ్బతీస్తున్నారు. కొందరు రైతుల పేరుతోనే గ్రామాల్లో సరుకును నిల్వ చేసి కృత్రిమ కొరత సృష్టించి ధరలు పెరిగిన తర్వాత మార్కెట్లోకి దించుతున్నారు. ఇలా ఇష్టం వచ్చిన రీతిలో ఇష్టానుసారంగా ధరలు పెరిగిపోతున్నాయి. ఈ భాగోతమంతా బహిరంగంగా జరుగుతున్నా కోట్లాది మంది రైతులు అల్లాడుతున్నా పాలకులు హెచ్చరికలు, ప్రకటనలు సమీక్షలు, సమావేశాలతో కాలం గడుపుతున్నారే తప్ప ఏమీ చేయలేకపోతున్నారు. పరిస్థితి ఇంత ఘోరంగా ఉన్నా మార్కెట్ కమిటీల్లో తమ అనుచరులను ఎలా నియమించుకోవాలి? ప్రత్యర్థులను ఎలా తొలగించాలి? అనే ఆలోచించి, చర్చించి చట్టాలు తెచ్చేందుకు ప్రయత్నాలు చేశారేతప్ప ఈ కమిటీలు ప్రజలకు ఎలా ఉపయోగపడుతు న్నాయి? రైతులకు ఎలా సేవలు అందిస్తున్నాయనే విషయంలో ఆలోచించడం లేదనే చెప్పొచ్చు. వ్యాపారులు లాభాల కోసమేవ్యాపారాలు చేస్తున్నారనేది వాస్తవం. అలాగే కమిషన్ల కోసమే దళారీ వ్యవస్థ ఉన్నదనేది కూడా నిజం. అలా వారు వ్యవహరించడాన్ని తప్పుపట్టలేం. కానీ నెలనెలా వేలాది రూపాయలు జీతభత్యాల రూపేణ ప్రజాధనాన్ని భోంచేస్తున్నా అధికారులను ఏమనుకోవాలి? కేవలం కొందరు అధికారుల అవినీతి, నిర్లక్ష్యం, అసమర్థత, ఆశ్రిత పక్షపాతం కారణంగా వీటన్నింటికి మించి రాజకీయ జోక్యంతోనే ఈపరిస్థితులు దాపురిస్తున్నాయి. ధరలు అదుపు తప్పు తున్నప్పుడు ప్రభుత్వం జోక్యం చేసుకొని ఇతరప్రాంతాల నుంచి సరుకులు తెప్పించి వినియోగదారులకు అందుబాటులో ఉంచి ధరలను నియంత్రించేందుకు గతంలో ఎన్నోసార్లు ప్రయత్నాలు చేశారు. ఇప్పుడు అలాంటి ప్రయత్నాలేమి జరగడం లేదు. గతంలో ఉల్లిగడ్డల ధరలు అందుబాటులో లేనంతగా పెరగడంతో ప్రభుత్వమే ఇతర రాష్ట్రాలనుంచి కొనుగోలుచేసి వినియోగదారులకు అందుబాటులోకి తీసుకు వచ్చింది. దీంతోధరలు తగ్గాయి. అలానే కందిపప్పు విషయంలోకానీ ఇతర పప్పు ధాన్యాల విషయంలో అప్పటి పాలకులు తీసుకున్న చర్యల కారణంగా ధరలను నియంత్రించగలిగారు. గతంలో ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఇలాంటి పరిస్థితే వస్తే విజిలెన్స్ ఎన్ఫోర్స్ మెంట్ అధికారులతో ఒక్కసారిగా ఉమ్మడి రాష్ట్రంలో దాడులు నిర్వహించారు. కోట్లాది రూపాయల విలువైన అక్రమ నిల్వలను స్వాధీనం చేసుకున్నారు. అవన్నీ మార్కెట్లోకి రావడంతో ధరలు దిగి వచ్చాయి. ఏదిఏమైనా ధరలనియంత్రణ విషయంలో పాల కులు వ్యవహరిస్తున్న తీరుసర్వత్రా విమర్శలకు గురవుతున్న ది. అదుపులేకుండా పెరిగిపోతున్న ధరలు జనజీవనాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. బడుగు, పేద వర్గాలే కాదు మధ్యతరగతి ప్రజలు అల్లాడిపోతున్నారు. పరిమితిలేని ఆదాయం కలవారి గురించి చింతలేదు కానీ రెక్కాడితేకానీ డొక్కాడని ప్రజలు, నెలసరి జీతగాళ్లు, పరిమిత ఆదాయంగలవారి పరిస్థితి అయోమయంగా తయారయింది. ఇతర మార్గాల్లో ఆదాయం ఉంటే తప్ప సంసారాన్ని నడపలేని పరిస్థితులు దాపురించాయి. ఎన్ని సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినా అన్నివర్గాలకు సంబంధించిన ఈధరల పెరుగుదల సమస్యను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తులో మూల్యం చెల్లించక తప్పదు. గతంలో ఉల్లిగడ్డల ధరలు పెరగడంతో అధికారాన్ని కోల్పోయిన కేంద్ర ప్రభుత్వ పెద్దలను చూశాం. పాలకులు ఇప్పటికైనా కళ్లు తెరవాలి. ఇలాగే నిర్లక్ష్యం చేస్తే ఎన్ని సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టినా, ఉద్యోగుల జీతభత్యాలు ఏ రీతిలో పెంచినా ఆశించిన ఫలితాలు రాకపోగా పేదరికం మరింత పెరుగుతుంది. ●

## వెనిజులా విలవిల

సహజ వనరులకు సంపన్నమైన 'వెనెజులా' ఒక్కసారిగా ప్రకృతి కళ్లెర్ర చేసి ఒకే ఒక నిమిషంలో 235 మందిని పొట్టన పెట్టుకుంది. ఎన్నో ఆర్థిక రాజకీయ, సామాజిక సంక్షోభంతో అతలాకుతలమవుతున్న ఆ దేశానికి నిన్నటి తాజా భూకంప విలయం సృష్టించిన విధ్వంస నష్టం తక్కువేమీ కాదు. లాటిన్ అమెరికాలో అత్యంత ధనిక దేశంగా పేర్కొనబడే వెనెజులాను అన్ని సమస్యలు ఒకేసారి చుట్టుముట్టేస్తున్నాయి. ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, పేదరికం, భారీ వలసలు ఆ దేశాన్ని ఇబ్బందుల్లో ముంచెత్తాయి. కోలుకోవడానికి చాలా సమయం పడుతుంది. ప్రపంచంలోనే అత్యధిక చమురు నిల్వలున్న ఈ దేశం గత యేడాది ఆ దేశ అధ్యక్షుడిని అమెరికా బందీ చేయడంతో తీరని నష్టం పొందింది. తాత్కాలిక పాలనలో ఏమాత్రం కుదుర్చుకున్నట్లు లేదు. తీరా ఈ ఉత్పాతం పెను భూకంపంతో వెనెజులా చిగురుటాకులా వణికిపోయింది. నిమిషం వ్యత్యాసంలో రెండు భారీ భూ ప్రకంపనల 'డబ్లెట్' తో దేశమంతా ఒక్కసారిగా అల్లాడిపోయింది. కరాకస్, లా గువైరాల్లో భారీ విధ్వంసమే జరిగింది. భారీ భవనాలెన్నో కుప్ప కూలాయి. విద్యుత్ కమ్యూనికేషన్ వ్యవస్థలు నామ రూపాల్లేకుండా పోయాయి. భూకంప తీవ్రత మానవ నష్టం భారీగానే జరిగింది. ఉత్తర వెనెజులాలో గురువారం రెక్టర్ స్కేలుపై 7.2, 7.5 తీవ్రతలతో రెండు శక్తివంతమైన భూకంపాలు నమోదయ్యాయి. కూలిన భవన శిధిలాల్లో వేల మంది ఉండి ఉండచ్చునని ఒక అంచనా. కానీ శిధిలాలు తొలగిస్తే తప్ప ఎంత ప్రాణ నష్టం వాటిల్లిందో చెప్పలేని పరిస్థితి. ఒక ప్రకృతి విపత్తు ఎంతటి మానవ విషాదంగా మారుతుందో ఈ భూకంప దుర్ఘటనలు వివరిస్తాయి. ప్రపంచవ్యాప్తంగా చూస్తే ముందుగా కాలిఫోర్నియా, తర్వాత వెనెజులా, ఆ తర్వాత జపాన్‌లో వరుస భూకంపాలు రావడం నిజంగా ఆశ్చర్యకరమే. వెనెజులా భూకంపం గురించి గూగుల్ కాస్త ముందుగానే అప్రమత్తం చేసింది. ఆండ్రాయిడ్ యూజర్లకు హెచ్చరిక సంకేతాలు పంపింది. అయినా తక్షణ అప్రమత్తత చేసుకోగల వ్యవస్థలను వెనెజులా అభివృద్ధి చేసుకోలేకపోయినందున ప్రాణనష్టం తగ్గించు కోలేకపోయింది. ప్రకృతి విపత్తులను అడ్డుకోవడం మానవ సాధ్యం కాదు. కానీ వాటి ప్రభావాన్ని తగ్గించు కునే విధంగా మానవాళిని సిద్ధం చేయడంలో వెనెజులా వెనుకబడింది. ఈ విషాద తీవ్రత, అప్రమత్తత లేని భూకంప వాతావరణం వెరసి వెనెజులాను ఇప్పట్లో కోలుకోలేని పరిస్థితులు తెచ్చి పెట్టాయి. నాణ్యమైన మౌలిక సదుపాయాలున్న చోట్ల ప్రకృతి విపత్తులను మానవ విపత్తులుగా మారకుండా గణనీయంగా తగ్గించుకోవడం ఎంతో అవసరం. ఎన్నో చమురు బావుల్ని, సంపదను తనలో ఇముడ్చుకున్న వెనెజులాలో భూకంప నిరోధక నిర్మాణ నిబంధనలంటూ ఏమీ లేవు. ఎప్పటికప్పుడు పాత భవనాల భద్రతా అంచనాలు, నూతన భవనాల నిర్మాణంలో ఆధునిక నిర్మాణ వ్యవస్థలను బలోపేతం చేయడంలో అక్కడి పాలనా వ్యవస్థకు ఇంకా అలవాటుకాలేదు. ఈనాటి భూకంపం చాలా రోజుల తర్వాత వచ్చినందున భూకంప సమీక్ష అప్రమత్తత కష్టమైనదే. వెనెజులా భూకంపం ప్రమాదనంతర చర్యలు, విపత్తు నిర్వహణా సామర్థ్యాల విషయమై ప్రపంచానికే ఓ హెచ్చరిక కాగలదు. ప్రపంచ వ్యాప్తంగా జపాన్,చిలీ, వంటి భూకంప ప్రభావిత దేశాలు, కఠిన నిర్మాణ ప్రమాణాలు, ముందస్తు హెచ్చరికల ప్రమాణాలు, ప్రకృతి విపత్తులనెదుర్కోవడంలో ప్రజలకు అవగాహన, సిబ్బందికి శిక్షణ వంటివన్నీ ఆయా దేశాలను స్వయం సిద్ధం చేస్తాయి. కానీ మిగిలిన దేశాల్లో ఈ వ్యవస్థలు లోపభూయిష్టంగా ఉన్నాయి. ఇప్పటికే వెనెజులా ఎదుర్కొంటున్న తీవ్ర ఆర్థిక ఇబ్బందులు, సరైన పాలనాలేమి వంటి అంశాలు ఆ దేశాన్ని తిరోగమనంలోకి నెట్టుతున్నాయి. భూకంప ప్రభావంతో ఎంతో మంది నిరాశ్రయులయ్యారు. జూన్ 25న తెల్లవారుఝామున 3.34 నిమిషాలకు వెనెజులాలో భూకంపం జరిగింది. కాస్త అటూ ఇటూలో మూడు ఖండాల్లో భూకంపాలు రావడానికి ఏమాత్రం సంబంధం లేదు. మొత్తంగా వెనెజులాకే ఎక్కువ నష్టం సంభవించింది. గతం కన్నా నయం 'భూకంపం చెప్పి రాదనే' పరిస్థితి నుంచి ఈసారి వెనెజులాలో భూకంపం వస్తోందని గూగుల్ ఆ దేశంలోని లక్షలాది ఆండ్రాయిడ్ ఫోన్లలో భూకంప హెచ్చరికలను ముందే మోగించింది. కానీ వారిలో సంసిద్ధత కనుపించలేదు. దాని బాధ్యత పాలక ప్రభుత్వాలు రూపొందించే ప్రణాళికలు, వ్యవస్థ లదే. గూగుల్ ఆండ్రాయిల్ ఎర్త్ క్వేక్, అలర్ట్ సిస్టమ్ ఉండటం తక్షణ స్పందనతో ప్రజల్ని తనకున్న వనరుల మేరకు భూకంప హెచ్చరికలు పంపడం ఆధునిక యుగంలో ఆహ్వానించదగినదే. గూగుల్ తపని తాను చేసింది. స్వల్ప సమయంలో భూమి కంపించడంతో ఎవరూ ఏమాత్రం జాగ్రత్త పడలేకపోయారు. ఇంతవరకు గతం ప్రస్తుతంలోకి వస్తే వెనెజులా ప్రభుత్వం ఏవిధంగా భూకంప పర్యవసానాలను గట్టెక్కించగలదో వేచి చూడాలి. దెబ్బతిన్న ఇల్లు ఆసుపత్రుల పునర్నిర్మాణం కోసం రూ.1890 కోట్లతో ప్రత్యేక ఫండ్‌ను ఆ దేశ తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగేజ్ ప్రకటించారు. వెనెజులాలో గత వందేళ్లలో సంభవించిన అతిపెద్ద భూకంపం ఇదే. సమీపంలోని బ్రెజిల్, కొలంబియా సహా మరికొన్ని దేశాల్లో భూకంపనలు వ్యాపించాయి. అక్కడ పెద్ద నష్టమేమీ లేదు. భూప్రకంపనలతో వేలాది మంది చనిపోయి ఉండొచ్చునని అధికారులు అంచనా వేశారు. ఏదిఏమైనా వెనెజులాలకు రాకూడని కష్టం వచ్చింది. ఇప్పుడు బాధితులకు సత్వర సేవలను ఆధునిక విధానంలో అందించడమొక్కటే ఆ దేశ లక్ష్యంగా కనపడుతోంది.



మనుషులందరూ వృద్ధులుగా మారతారు. కాని మంచివారుగా మారటం అరుదు.

స్వీడెన్ బర్గ్



శారీరక సామర్థ్యం ద్వారా మనకు బలం రాదు. అణచిపెట్టలేనంతటి ఆత్మబలం ద్వారానే అది లభిస్తుంది.

మహాత్మా గాంధీ

# ఉపాధి కల్పనకు మూలస్తంభాలు ఎంఎస్ఎంఈలు

డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి

సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలు ఏ దేశ ఆర్థిక వ్యవస్థకు, దాని సమగ్ర అభివృద్ధికి వెన్నెముక వంటివి. ఇవి స్థానిక, జాతీయ ఆర్థిక వ్యవస్థలకు, ముఖ్యంగా శ్రామిక పేదలు, మహిళలు, యువత, బలహీన వర్గాల వారి సుస్థిర జీవనోపాధులకు దోహదపడతాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న మొత్తం వ్యాపారాలలో 90శాతం, ఉపాధిలో 60-70 శాతం, ప్రపంచ జీడీపీలో 50 శాతం వాటా ఎంఎస్ఎంఈలదే. ఎంఎస్ఎంఈలు ఆర్థిక వ్యవస్థలను పరివర్తన చెందిస్తున్నాయి, ఉద్యోగ కల్పన, ఆదాయాన్ని ప్రోత్సహించడం, సమానమైన ఆర్థిక వృద్ధిని ప్రోత్సహిస్తున్నాయి. ఐక్యరాజ్యసమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించడంలో ఎంఎస్ఎంఈల పాత్రపై అవగాహన పెంచేందుకు, 2017 నుండి ప్రతి ఏటా జూన్ 27వ తేదీని 'ప్రపంచ ఎంఎస్ఎంఈ దినోత్సవం'గా ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం ప్రకటించింది. దేశ ఆర్థిక వ్యవస్థకు, స్థానిక ఉపాధి కల్పనకు, గ్రామీణ లేదా వెనుకబడిన ప్రాంతాల్లో పారిశ్రామికీకరణకు ఎంఎస్ఎంఈలు మూలస్తంభాలుగా నిలుస్తున్నాయి. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల వర్గీకరణ వాటి ఉత్పత్తి, పెట్టుబడి, వార్షిక టర్నోవర్‌లపై ఆధారపడి ఉంటాయి. మైక్రో ఎంటర్‌ప్రైజ్, పరిశ్రమ అనగా ఒక కోటిలోపు పెట్టుబడితో 5 కోట్ల లోపు వార్షిక టర్నోవర్ నమోదు చేయబడుతుంది. చిన్న లేదా స్మాల్ ఎంటర్‌ప్రైజ్ విభాగంలో పెట్టుబడి 10 కోట్ల వరకు ఉంటూ వార్షిక టర్నోవర్ 50కోట్ల వరకుఉంటుంది. మధ్యతరహా లేదా మీడియం పరిశ్రమలో 50 కోట్ల వరకు పెట్టుబడులు, 250కోట్ల వరకు వార్షిక టర్నోవర్ ఉంటుంది. ఎంఎస్ఎంఈలు ఆవిష్కరణ, ఉద్యోగ కల్పన, సుస్థిర అభివృద్ధికి శక్తివంతమైన చోదక శక్తులుగా ఉపకరిస్తున్నాయి.



ఎంఎస్ఎంఈలు సాంకేతికత, డిజిటల్ మౌలిక సదుపాయాలు, సరసమైన ఆర్థిక సహాయం, మార్కెట్ అవకాశాలు, ప్రభుత్వాలు భాగస్వామ్యాలకు ప్రాప్యతను విస్తరించడం ద్వారా సమ్మిళిత వృద్ధిని నడిపిస్తాయి. స్థితిస్థాప కతను బలోపేతం చేస్తాయి. పారిశ్రామిక అభివృద్ధికి దోహదపడతాయి. డిజిటల్ టెక్నాలజీలు, ఏఐ, గ్రీన్ ఇన్నోవేషన్‌లో వేగవంతమైన పురోగతులు, ఎంఎస్ఎంఈలకు ఉత్పాదకతను పెంచుకోవడానికి అపూర్వమైన అవకాశాలను అందిస్తున్నాయి. నైపుణ్య శిక్షణ, ఆవిష్కరణ, మరింత న్యాయమైన నిబంధనలు ఎంఎస్ఎంఈలను ప్రోత్సహించడానికి ఉత్తమ మార్గాలు. నేటి ఎంఎస్ఎంఈలు రాజకీయ అస్థిరత, యుద్ధాలు, ఘర్షణలు, వాతావరణ మార్పులు, డిజిటల్ మార్పుల వంటి సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. తగినంత రుణ సౌకర్యాలు లేకపోవడం, పేలవమైన మౌలిక సదుపాయాలు కఠినమైన పరిస్థితులలో పనిచేయడం వంటి కారణాల వల్ల ఎంఎస్ఎంఈలు సజావుగా నడవడం మరింత కష్టతరం అవుతోంది. ప్రపంచ ఎంఎస్ఎంఈల దినోత్సవం 2026ఇతివృత్తం ఆవిష్కరణ, సుస్థిర పారిశ్రామిక అభివృద్ధిద్వారా ఎంఎస్ఎంఈలకు సాధికారత కల్పించడం ఏఐ ఆధారిత భవిష్యత్తులో మానవ కేంద్రీకృత వ్యవస్థాపకత. ఐక్యరాజ్యసమితికి అనుబంధంగా ఉన్న హ్యూమన్‌సెంటర్డ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఫోరమ్ ఎంఎస్ఎంఈల భవిష్యత్ తరం" అనే సమాంతర ఇతివృత్తంతో నడుస్తోంది. దీని ప్రభావం ఈ రంగంలోని తదుపరి తరానికి నిర్వచనం ఇవ్వబోయే మహిళా సీఈఓలు, యువ వ్యవస్థాపకులు సూక్ష్మసంస్థలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. భారతదేశంలో, ప్రభుత్వం పారిశ్రామిక సంస్థలు ఈ రోజును చిన్న వ్యాపారాల కోసం విధాన సంస్కరణలు, ఆర్థిక చేరిక ప్రయత్నాలు డిజిటల్ పరివర్తన కార్యక్రమాలను ప్రముఖంగా ప్రస్తావించడానికి ఉపయోగిస్తాయి. భారతదేశంలో 7.4 కోట్లకు పైగా ఎంఎస్ఎంఈలు ఉన్నాయి. ఇవి 32కోట్లకు పైగా ప్రజలకు ఉపాధి కల్పిస్తూ, జాతీయ జీడీపీకి సుమారు 31.1శాతం వాటాను అందిస్తున్నాయి. ఈ సంస్థలు మొత్తం ఎగుమతులలో సుమారు 48.6 శాతం వాటాను కూడా అందిస్తున్నాయి. ●

# ప్రజావాక్కు

### మరో అవకాశం ఇవ్వండి

**దేశవ్యాప్తంగా** గత ఆదివారం జరిగిన నీట్ యూజీ రీ టెస్ట్‌కి కొంత మంది విద్యార్థులు ట్రాఫిక్ జామ్స్, రైళ్ల ఆలస్యంగా రావడం, సీటీబస్‌లు సమయానికి రాకపోవడం తదితర కారణాల వల్ల నీట్ యూజీ పరీక్ష రాయలేకపోయారు. వారిలోచాలామంది పరీక్షాకేంద్రాలకు నాలుగు నుంచి ఐదు నిమిషాలు మాత్రమే ఆలస్యంగా చేరుకున్నారు. ఇవన్నీ క్షమించదగిన విషయాలే. ఎందుకంటే ఇవన్నీ విద్యార్థుల అదుపులో లేని కారణాలు. మధ్యప్రదేశ్‌లో తండ్రి బైకు పంక్చర్ కావడంతో రెండు నిమిషాలు ఆలస్యంగా వచ్చిన బిడ్డను సెంటర్‌లోకి రానివ్వలేదు. జగిత్యాలలో తమ బిడ్డనులోనికి పంపాలని సెక్యూరిటీ సిబ్బందికాళ్ళమీద పడిందోమాతృమూర్తి. క్రమశిక్షణ పేరుతో సమయపాలన వంటి సాంకేతిక అంశాలలో వ్యవస్థ కూరుకుపోవడంలో అర్థం లేదు. అందువల్ల అటువంటి విద్యార్థులకు కరుణతో మళ్లీ నీట్ పరీక్ష రాయడానికి అవకాశం కల్పించాలి.

- దాసం వెంకటరెడ్డి, బెంగుళూరు

### సహ చట్టాన్ని నీరుగారుస్తున్న అధికారులు

ప్రజాసేవకులైన అధికారుల పనితీరు, పాలనలో పారదర్శకత, జవాబుదారీ తనం పౌరులు తెలుసుకునేందుకు సమాచార హక్కు చట్టం 2005 లో తీసుకురాబడింది. ఎందుకంటే అధికారులు తీసుకుంటున్న లక్షలు లక్షల జీతాలు ప్రజలు పన్నులుగా చెల్లించిన డబ్బేకనుక. అందువలన అది దుర్వినియోగం అవుతుందా సద్వినియోగం అవుతుందా అని తెలుసుకోవలసిన అవసరం సామాన్యుడికి సైతం ఉంది. ఐతే అధికారులు మాత్రం అవకాశం వచ్చినపుడల్లా ఈ చట్టాన్ని దుర్వినియోగ పరుస్తున్నారు. ఒకసారి పబ్లిక్ ఇన్ఫర్మేషన్ అధికారినీ సమాచారం కోరితే నిర్ణీత సమయంలో కోరిన సమాచారం ఇవ్వడులేదు.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### బయోమెట్రిక్ అమలు చేయాలి

ప్రభుత్వ ఉద్యోగులు సమయపాలన లేకుండా విధి నిర్వహణలో సేవల పట్ల ప్రజలను ఇబ్బందిపెడుతూ వారికి నచ్చిన సమయానికి విచ్చేసి మరల తొందరగా వెళుతున్నారు. కావున అధికారులు ఉద్యోగులకు ఉదయం, సాయంత్రంబయోమెట్రిక్ విధానాన్ని అమలు కఠినతరం చేస్తేనేమారుమూల ప్రజలకు మేలుచేసే అవకాశం ఉంది.

-మోతె శివకుమార్, రంగారెడ్డి జిల్లా

### ప్రత్యేక వైద్య సదుపాయాలు కల్పించాలి

ప్రజారోగ్య పరిరక్షణలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలు, జిల్లా ఆసుపత్రులు కీలక పాత్ర పోషిస్తాయి. గ్రామీణ, పట్టణ పేద ప్రజలకు ఇవే మొదటి వైద్య సేవలకేంద్రాలుగా నిలుస్తాయి. అయితే పెరుగుతున్న జనాభా, కొత్త వ్యాధులు, వైద్య సేవలపై పెరుగుతున్న డిమాండ్ నేపథ్యంలో ఈ ఆసుపత్రుల సామర్థ్యాన్ని మరింత మెరుగుపరచాల్సిన అవసరం ఏర్పడింది. అనేక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోవైద్యులు, నర్సులు, సాంకేతిక సిబ్బంది కొరత కనిపిస్తోంది. అవసరమైన మందులు, పరీక్షా పరికరాలు, అత్యవసర చికిత్స సదుపాయాలు కూడా కొన్నిప్రాంతాల్లో తగిన స్థాయిలో లేవు. ఫలితంగా చిన్నవ్యాధులకే ప్రజలు పెద్ద నగరాల్లోని ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది. దీనివల్ల ప్రభుత్వ వైద్య వ్యవస్థపై అదనపు భారం పడుతోంది. జిల్లా ఆసుపత్రుల్లో ఆధునిక నిర్ధారణ పరికరాలు, ప్రత్యేక వైద్య సేవలు, ఐసీయూ సదుపాయాలు, తగినపడకల సంఖ్యను పెంచడం అవసరం.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### అప్పుడలా ఇప్పుడిలా

ఒకప్పుడు ఎక్కడో దూర ప్రాంతంలో ఉన్న మాత్రులకి, చుట్టాలకి ఫోను చేసి మాట్లాడాలంటే ట్రంక్ కాల్ బుక్ చేసుకుని గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చేది. ఇప్పుడు చేతిలో ఉండే సెల్‌ఫోనుతో క్షణాల్లో ప్రపంచంలో ఎక్కడున్న వారితోనైనా మాట్లాడవచ్చు. వీడియోకాల్ అయితే ఎదురుగ ఉన్న మనిషితో మాట్లాడుతున్నట్లు ఉంటుంది. గతంలో బజారుకి వెళ్లి వస్తువు కొనాలంటే జేబులో డబ్బులు ఉండాల్సిందే. అదే ఇప్పుడు షోరూంలో ఎంత ఖరీదు వస్తువు అయినా రోడ్డు పక్కన బండి మీద అమ్మే కూరగాయలు అయినా జేబులో నయాపైసా లేకపోయినా ఫోన్ పే చేసి కొనుక్కోవచ్చు. ఇదంతా అభివృద్ధే. అయితే ఈ అభివృద్ధి పుష్కరకాలంలో సాధించింది కాదు.

- మిథునం, హైదరాబాద్

### గురుకులాల్లో కుల వివక్షత?

తెలంగాణా రాష్ట్రంలో ఉన్న వివిధ గురుకులలలో కుల వివక్షత విపరీతంగా ఉంది. టీచింగ్, నాన్ టీచింగ్ ఎస్సి, ఎస్టీ, వికలాంగుల సిబ్బంది పై వివక్షత ఉంది. కనుక ప్రభుత్వం ప్రతి గురుకుల ప్రిన్సిపాల్‌లకు వివక్షత లేకుండా చూసే విధంగా ఆదేశాలు జారీ చేయాలి. కుల వివక్షతపై ప్రతి జిల్లా కేంద్రంలో ఎస్సి, ఎస్టీ అట్రాసిటీ చట్టం 1989 పై అవగాహనా చైతన్య కార్యక్రమం నిర్వహించడం అవసరం.

- కదురు శ్రీనివాస్, వరంగల్


గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి | ఎడిట్ పేజీకి..
ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# సమాజంలో పెరుగుతున్న 'వృద్ధాప్య' సవాళ్లు

డి చంద్రభాను

ప్రపంచంలోనే అత్యధిక యువత ఉన్న దేశం మనదే. ఇదే మన బలం అని ఇన్నాళ్లూ చెబుతూ వచ్చాం. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత్ కీలక శక్తిగా ఎదుగుతుందని ఆశలు వ్యక్తమవుతున్నాయి. కానీ ఈ పరిస్థితి ఎప్పటికీ అలాగే ఉండదు. దేశంలో జననాల రేటు తగ్గుతోంది. వృద్ధుల సంఖ్య పెరుగుతోంది. ఇంకా పూర్తిగా అభివృద్ధి చెందిన దేశంగా మారకముందే, వృద్ధాప్య సమాజం సవాళ్లను ఎదుర్కోవాల్సి వచ్చే పరిస్థితి కనిపిస్తోంది. ఇదే మన ముందున్న అసలు సమస్య. ప్రస్తుతం దేశ జనాభాలో దాదాపు 68 శాతం మంది 15 నుంచి 64 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్నవారే. ప్రపంచంలోని చాలా దేశాలతో పోలిస్తే ఇది మనకు లభించిన అరుదైన అవకాశం. కానీ ఈ అవకాశానికి కూడా ఒక గడువు ఉంది. ఐక్యరాజ్యసమితి అంచనాల ప్రకారం 2050 నాటికి 60 ఏళ్లు దాటిన భారతీయుల సంఖ్య 34 కోట్లకు చేరే అవకాశం ఉంది. అంటే నేటి అమెరికా మొత్తం జనాభాతో సమానమైన వృద్ధ జనాభా ఒక్క భారత్‌లోనే ఉండబోతోంది. మరోవైపు, దేశంలో మొత్తం సంతానోత్పత్తి రేటు ఇప్పటికే జనాభా స్థిరత్వానికి అవసరమైన 2.1 స్థాయి కంటే దిగువకు పడిపోయింది. కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వంటి అనేక రాష్ట్రాల్లో ఈ సంఖ్య మరింత తక్కువగా ఉంది. అంటే నేడు యువ దేశంగా కనిపిస్తున్న మనం, రేపు వృద్ధుల సంఖ్య వేగంగా పెరిగే దేశంగా మారబోతున్నాం. వృద్ధాప్యం అసలు సమస్య కాదు. ప్రపంచంలోని ప్రతి దేశం ఏదో ఒక దశలో ఈ పరిస్థితిని ఎదుర్కొంటుంది. అసలు ప్రమాదం వేరే. ధనిక దేశంగా మారకముందే వృద్ధాప్య సమాజంగా మారడమే మన ముందున్న సవాలు. జపాన్, దక్షిణ కొరియా, తైవాన్, చైనా వంటి దేశాలు మాత్రం ముందుగా తమ ఆర్థిక బలాన్ని పెంచుకున్నాయి. ప్రజల ఆదాయాలు పెరిగాయి. ఆరోగ్య, సామాజిక భద్రతా వ్యవస్థలను బలోపేతం చేసుకున్నాయి. ఆతర్వాతే అక్కడ వృద్ధుల సంఖ్య పెరిగింది. మన పరిస్థితి మాత్రం భిన్నంగా ఉంది. ఇంకా మనం అభివృద్ధిచెందుతున్న దేశంగానే ఉన్నాం. తలసరి ఆదాయం ఇప్పటికీ అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే చాలా తక్కువ. యువ నిరుద్యోగం ఇప్పటికీ పెద్ద సమస్యగానే ఉంది. వివిధ అంచనాల ప్రకారం యువతలో నిరుద్యోగం 15శాతానికి మించి ఉంది. చదువుకున్న వారికి తగిన ఉద్యోగాలు దొరకడం లేదు. మహిళల ఉద్యోగాల్లో భాగస్వామ్యం కూడా 40శాతం కంటే తక్కువగానే ఉంది. కోట్లాది మంది ఇప్పటికీ అసంఘటిత రంగంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. అంటే మనం ఇంకా పూర్తిగా ఎదగకముందే కొత్త సవాళ్లు మన ముందుకువస్తున్నాయి. అందుకే సంపన్న దేశంగా ఎదగకముందే వృద్ధాప్య సమాజంగా మారడం, అభివృద్ధి చెందుతున్న దేశాలు ఎదుర్కొనే అత్యంత క్లిష్టమైన సమస్యల్లో ఒకటిగా నిపుణులు భావిస్తున్నారు. అయితే జనాభా పరిమాణమే దేశ బలాన్ని నిర్ణయించే రోజులు



క్రమంగా ముగుస్తున్నాయి. ఒకప్పుడు ఎక్కువ జనాభా అంటే ఎక్కువ శ్రామిక శక్తి, ఎక్కువ ఉత్పత్తి సామర్థ్యం అనిభావించేవారు. కానీ కృత్రిమ మేధస్సు, రోబోటిక్స్, ఆటోమేషన్ వేగంగా విస్తరిస్తున్న ఈ కాలంలో, కేవలం ఎక్కువ మంది యువత ఉండటం మాత్రమే సరిపోదు. అధిక నైపుణ్యాలు, ఉత్పాదకత, సాంకేతిక సామర్థ్యాలే దేశాల మధ్య పోటీలో అసలు తేడాను నిర్ణయిస్తున్నాయి. అంటే మన దేశానికి లభించిన జనాభా ప్రయోజనం శాశ్వతం కాదు. దాన్ని ఉపయోగించుకోవాల్సిన సమయం కూడా అపరిమి తం కాదు. రాబోయే రోజుల్లో వృద్ధుల సంఖ్య పెరగడం కేవలం సామాజిక సవాలు మాత్రమే కాదు. అదే పరిస్థితి కొత్త వ్యాపారాలు, కొత్త ఉద్యోగాలు, కొత్త సేవలకు కూడా మార్గం చూపవచ్చు. రాబోయే దశాబ్దాల్లో ఆరోగ్య సేవలు, వృద్ధుల సంరక్షణ, బీమా, ప్రత్యేక గృహాలు, సహాయక పరికరాలు, ఇంటి వద్దే వైద్య సేవలు వంటి రంగాల్లో భారీ డిమాండ్ ఏర్పడే అవకాశం ఉంది. జపాన్, ఐరోపా దేశాలు ఇప్పటికే ఈ రంగాలను కొత్త వృద్ధి అవకాశాలుగా మార్చుకున్నాయి. మన దేశంలో మాత్రం ఈ అంశంపై ఇంకాపెద్దగా చర్చ మొదలుకాలేదు. వృద్ధాప్యాన్ని కేవలం సమస్యగా కాకుండా, కొత్త ఆర్థిక అవకాశంగా కూడా చూడాల్సిన అవసరం ఉంది. ఇప్పుడున్న పరిస్థితిని చూసి మనకు ఇంకా చాలా సమయం ఉందని అనుకోవడం ప్రమాదకరం. మహిళలకు మరిన్ని ఉద్యోగ అవకాశాలు కల్పించడం, యువతకు నైపుణ్యాలను పెంచడం, ఆరోగ్య రంగాన్ని బలోపేతం చేయడం, వృద్ధుల సంరక్షణకు ప్రత్యేక వ్యవస్థలను ఏర్పాటు చేయడం వంటి అంశాలపై ఇప్పటి నుంచే దృష్టి పెట్టాలి. అదే సమయంలో కృత్రిమ మేధస్సు, రోబోటిక్స్, ఆటోమేషన్ వంటి సాంకేతికతలను ఉపయోగించి ఉత్పాదకతను పెంచాల్సిన అవసరం కూడా ఉంది. ఎందుకంటే భవిష్యత్తులో దేశాల బలాన్ని నిర్ణయించేది జనాభా సంఖ్య కాదు. ఆ జనాభా ఎంత సమర్థంగా పనిచేస్తుందన్నదే అసలు విషయం. దశాబ్దాలుగా మనం యువ జనాభాను ఒక వరంగా భావిస్తున్నాం. కానీ వరాలు కూడా శాశ్వతంకావు. అవకాశాలకు కూడా ఒక గడువుఉంటుంది. చైనా తన యువ జనాభాను ఉపయోగించుకుని ప్రపంచ తయారీ కేంద్రంగా ఎదిగింది. ఇప్పుడు అదే దేశం వృద్ధాప్య సమాజం సవాళ్లను ఎదుర్కొంటోంది. మన దేశానికి కూడా ఇప్పుడు ఒక అరుదైన అవకాశం లభించింది. కానీ అలాంటి అవకాశాలు ఎప్పటికీ ఎదురుచూడవు. మరోవైపు, జనాభా మార్పులు దేశ వ్యాప్తంగా ఒకేలా ఉండవు. దక్షిణ భారతదేశంలోని అనేక రాష్ట్రాలు ఇప్పటికే తక్కువ జననాలరేటుతో వేగంగా వృద్ధాప్య సమాజాలుగా మారుతుండగా, కొన్ని ఉత్తర రాష్ట్రా లు ఇంకా యువజనాభాతో ఉన్నాయి. ఈ అసమానతలు భవిష్యత్తులో దేశంలోనే కొత్త ఆర్థిక, సామాజిక, వలస సవాళ్లకు దారితీసే అవకాశంఉంది. అందుకే దేశమంతటికీ ఒకే విధానం సరిపోదు. రాష్ట్రాల పరిస్థితులను బట్టి వేర్వేరువ్యూహాలు అవసరం. ప్రస్తుతం మన ముందున్న అసలు ప్రశ్న జనాభా ఎంత ఉందనేదికాదు. ప్రపంచంలోనే అతిపెద్ద యువ జనాభా కలిగిన దేశంగా ఉన్నమనం, ఈ అవకాశాన్ని సంపదగా మార్చుకోగలమా లేదా అనేదే తేల్చుకోవాల్సిన విషయం. నేడు మనకు వరంగా కనిపిస్తున్న ఈఅవకాశం, రేపు మనం కోల్పోయిన అవకాశంగా చరిత్రలో మిగిలిపోవచ్చు. ●

# ముదిరిన అయోధ్య విరాళాల వివాదం







## ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్‌రాయ్, మరో సభ్యుని రాజీనామా

### బ్యాంకుల పాత్రపైనా 'సిట్'దర్యాప్తు

### ఎఫ్ఐఆర్‌లోని 8 మంది నిందితుల అరెస్టు

### దోషులను వదిలేది లేదు: సిఎం ఆదిత్యనాథ్

**అయోధ్య, జూన్ 26:** అయోధ్య రామమందిరానికి సంబంధించిన నిధుల దుర్వినియోగం వ్యవహారంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. 'శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్' అధిపతి చంపత్ రాయ్, ట్రస్ట్ సభ్యుడు అనిల్ మిశ్రా తమ పదవుల నుంచి తప్పుకున్నారు. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వ సమాచారశాఖ డైరెక్టర్ అందించిన సమాచారం ప్రకారం, ట్రస్ట్‌కు చెందిన ఈ ఇద్దరు కీలక సభ్యులు తమ పదవులకు రాజీనామా చేశారు. నైతిక కారణాలతోనే వారు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. కోట్లాది మంది భక్తులను దిగ్భ్రాంతికి గురిచేసిన రామమందిర విరాళాల వివాదం నేపథ్యంలో ఈ పరిణామం చోటు చేసుకుంది. ఆలయ సిబ్బంది, బ్యాంకు అధికారులతో కుమ్మక్కై వందల కోట్ల రూపాయల విలువైన కానుకలు, విలువైన వస్తువులను దుర్వినియోగం చేశారని నివేదికలు వెల్లడించాయి. ఆలయ రోజువారీ కార్యకలాపాలు, శ్రీరాముడికి సమర్పించే కానుకల (చడావా) నిర్వహణను పర్యవేక్షించే బాధ్యత ట్రస్ట్‌పై ఉన్నందున, ఆలయంలో జరిగిన తీవ్రమైన అక్రమాలకు సంబంధించి బాధ్యతను నిర్ధారించే చర్యలో భాగమే ఇది. రామమందిరంలో భక్తులు సమర్పించిన విరాళాల నిర్వహణలో లోపాలను ఎత్తిచూపుతూ సిట్ (ప్రత్యేక దర్యాప్తు బృందం) సమర్పించిన ప్రాథమిక నివేదిక తర్వాత, అధికారులను తొలగించాలనే డిమాండ్, వారిపై పెరుగుతున్న ఒత్తిడి నేపథ్యంలో ఈ రాజీనామా మాలు జరిగాయి. ఆలయ నిధులను అక్రమంగా తరలించడానికి కుమ్మక్కయ్యారని ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆలయ సిబ్బంది, లెక్కింపు సిబ్బంది, మాజీ బ్యాంకు అధికారులతో సహా ఎనిమిది మంది వ్యక్తులపై గురువారం రాత్రి ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న నిందితులందరినీ అరెస్టు చేసి జైలుకు తరలించారు. అరెస్టు అయిన వారిలో అవినాష్ శుక్లా, అనుకల్ప్ మిశ్రా, లవ్‌కుశ్ మిశ్రా, మనీష్ కుమార్ యాదవ్, కరుణేష్ పాండే, రామశంకర్ మిశ్రా, సుభాష్ శ్రీవాస్తవ, రామశంకర్ యాదవ్ (అలియాస్ తిన్ను) ఉన్నారు.

**పలువురు బ్యాంకు అధికారుల పాత్రపైనా సిట్ దర్యాప్తు:** రామ మందిర విరాళాల వివాదంలో నగదు, కానుకలను దుర్వినియోగం చేశారనే ఆరోపణలపై ఆలయ సహాయకుడు, మాజీ బ్యాంకు సిబ్బంది, నగదు లెక్కింపులో పాల్గొన్న వారితో సహా ఎనిమిది మంది పేర్లను ఎఫ్ఐఆర్‌లో చేర్చడంతో, ఈ దొంగతనంలో 'కుమ్మక్కు' అయినందుకు పలువురు బ్యాంకింగ్ అధికారులు విచారణను ఎదుర్కొనే అవకాశం ఉంది. అరెస్ట్ అయిన ఎనిమిది మంది నిందితులను ప్రస్తుతం విచారిస్తున్నారు. విచారణ సమయంలో, తిను, సుభాష్ ఈ దొంగతనం జరిగిన తీరు గురించి, అలాగే ఇందులో మరికొంత మంది ప్రమేయం గురించి సంచలన విషయాలు వెల్లడించినట్లు తెలిసింది. ఆలయ కానుకల దుర్వినియోగానికి మధ్యవర్తులుగా లేదా మాధ్యమాలుగా వ్యవహరించిన పలువురు ప్రభుత్వ బ్యాంకు అధికారుల పేర్లను కూడా వారు వెల్లడించినట్లు సమాచారం. ఈ నిధుల దుర్వినియోగం రాకెట్‌లో ఒకరు కాదు, పలువురు బ్యాంకింగ్ అధికారులు పాలు పంచుకున్నట్లు తేలింది. వారి అనుమానాస్పద ప్రవర్తనపై ప్రస్తుతం విచారణ జరుగుతోంది. ఆలయ దొంగతనం ప్రణాళిక, అమలులో తిన్ను యాదవ్, సుభాష్ శ్రీవాస్తవ కీలక పాత్ర పోషించినట్లు విచారణలో తేలింది. సుభాష్ ఈ ఆపరేషన్‌లో ఇతరులను చేర్చుకుని, ఆలయంలో నగదు కానుకలను లెక్కించే సిబ్బందికి విధులను కేటాయించారని ఆరోపణలు ఉన్నాయి. టెంపుల్ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ మాజీ డ్రైవర్ అయిన తిన్ను, ఈ దొంగతనం వివాదంలో ప్రధాన వ్యక్తిగా వెలుగులోకి రాగా, అరెస్టయిన ఎనిమిది మందిలో సుభాష్ మాజీ బ్యాంకింగ్ ఉద్యోగిగా ఉన్నాడు. ఆలయంలో నగదు లెక్కింపు సిబ్బందిని పర్యవేక్షి ంచింది సుభాషేనని, విరాళాలను దుర్వినియోగం చేయడంలో అతనే కీలక పాత్ర పోషించాడని ఆరోపణలు ఉన్నాయి. ఈ నేర విధానానికి సంబంధించి, ప్రజల కంట పడకుండా ఉండేందుకు మొదట నగదు కట్టలను బాత్రూమ్‌లో దాచి, ఆ తర్వాత రాత్రివేళ ఆలయ ప్రాంగణం నుండి బయటకు తరలించినట్లు సమాచారం.ఆ తర్వాత, దొంగిలించిన డబ్బును వేర్వేరు ప్రాంతాల్లో వేరు చేసి, మోసగాళ్ల ఖాతాలకు మళ్లించారు. ఈ ముఠా గత 23 యేళ్లుగా ఈ కార్యకలాపాలు సాగిస్తున్నట్లు భావిస్తున్నారు.

**దోషులను వదిలేదిలేదు: సిఎం యోగి**

రామమందిర విరాళాల వివాదంలో దోషులుగా తేలిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ శుక్రవారం మరోసారి స్పష్టం చేశారు. ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ప్రాథమిక నివేదిక సమర్పించిన వెంటనే చర్యలు మొదలయ్యాయని, దోషులు చట్టం ముందు నిలబడేలా చూస్తామని హామీ ఇచ్చారు. జూన్ 19న అయోధ్యలో పర్యటించినప్పుడు దర్యాప్తు తర్వాత చర్యలు తీసుకుంటానని తాను చెప్పానని, ఆ 'శిక్షా ప్రక్రియ' ఇప్పటికే మొదలైందని సిఎం పేర్కొన్నారు.

## ఆపరేషన్ సిందూర్ అమరుల పేర్లను ప్రకటించిన భారత్

**న్యూఢిల్లీ,జూన్ 26:** జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన భయంకర ఉగ్రదాడికి ప్రతికారంగా భారత సైన్యం పాకిస్థాన్ గుండెల్లో దడ పుట్టేలా జరిపిన మెగా కౌంటర్ ఆపరేషన్ ఆపరేషన్ సిందూర్. ఈ భీకర ఆపరేషన్‌లో భారత సైన్యానికి చెందిన ఐదుగురు, ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌కు చెందిన ఒక సర్జెంట్ వీరమరణం పొందారు ప్రభుత్వం నప్రకటించింది.సుబేదార్ మేజర్ పవన్ కుమార్ -హెడ్‌క్వార్టర్స్ 10 ఇన్‌ఫాంట్రీ బ్రిగేడ్. రైఫిల్‌మ్యాన్ సునీల్ కుమార్ - 4వ బెటాలియన్, జమ్మూకశ్మీర్ లైట్ ఇన్‌ఫాంట్రీ రెజిమెంట్. లాన్స్ నాయక్ దినేష్ కుమార్ - 5 ఫీల్డ్‌రెజిమెంట్. అగ్నివీర్ మూడ్ మురళీ నాయక్ -851 లైట్ రెజిమెంట్ (మన తెలుగు రాష్ట్రానికి చెందిన వీరుడు కావడం విశేషం). హవల్దార్ సునీల్ కుమార్ సింగ్ - 237 ఫీల్డ్ వర్క్‌షాప్. సర్జెంట్ సురేంద్ర కుమార్ - 39 వింగ్, భారత వైమానికదళం. ఆపరేషన్ సిందూర్‌లో శత్రువుల స్థావరాలను ధ్వంసం చేస్తూ అసాధారణ ధైర్యసాహసాలు ప్రదర్శించినందుకు గానూ రైఫిల్‌మ్యాన్ సునీల్ కుమార్‌కు మరణానంతరం దేశపుమూడవ అత్యున్నత సైనిక పురస్కారమైన వీరచక్రను కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. స్కై ఆపరేషన్స్‌లో కీలక పాత్ర పోషించిన ఐఎఎఫ్ సర్జెంట్ సురేంద్ర కుమార్‌కు మరణానంతరం వాయుసేన మెడల్‌తో గౌరవించింది.



## 'సర్‌' కు యేడాది!

### 6 కోట్ల ఓట్లు తొలగింపు

### కొనసాగుతున్న ప్రక్రియ

### డిసెంబర్‌కి ముగింపు

**న్యూఢిల్లీ, జూన్ 26:** ఓటర్ల జాబితాల 'ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ ద్వారా ఇప్పటివరకు దాదాపు ఆరు కోట్ల మంది ఓటర్ల పేర్లు తొలగించబడ్డాయి. ఈ ప్రక్రియ మొదలై జూన్ 26నాటికి యేడాది పూర్తయింది. ప్రతి పక్షం, ఎన్నికల సంఘం మధ్య వివాదానికి కారణమైన ఈ ప్రక్రియ, సుప్రీంకోర్టు దీని రాజ్యాంగబద్ధతను సమర్థించడంతో 19 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో కొనసాగుతోంది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు, గత ఏడాది జూన్ 24న బీహార్‌లో ఈ ఎస్ఐఆర్ పైలట్ ప్రక్రియ ప్రారంభమైంది. బీహార్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియ తర్వాత, అక్కడి ఓటర్ల జాబితా నుండి దాదాపు 65 లక్షల పేర్లు తొలగించబడ్డాయి. అయితే, పత్రాలు లేవనే కారణంతో పౌరుల ఓటు హక్కును తొలగించేందుకు ఎన్నికల సంఘం బిజెపి ఆదేశాల మేరకు పనిచేస్తోందని ప్రతిపక్షాలు ఆరోపించాయి. ఎస్ఐఆర్ ప్రక్రియ[illegible]చేపట్టడంలో ఎన్నికల సంఘం (ఇసి) వ్యవహరించిన తీరు రాజ్యాంగబద్ధమేనని మార్చిలో సుప్రీంకోర్టు ఏకగ్రీవంగా తీర్పునిచ్చింది. ఎస్ఐఆర్ సమయంలో పేర్లు తొలగించబడిన వ్యక్తులు పశ్చిమ బెంగాల్, బీహార్‌లలో రాష్ట్ర సంక్షేమ పథకాల ప్రయోజనాలను పొందలేకపోతున్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల తర్వాత, ఓటర్ల జాబితా ప్రక్షాళన డేటాను సామాజిక భద్రతా పథకాలతో అనుసంధానిస్తున్నట్లు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించాయి. అర్హులైన పౌరులెవరూ జాబితాలో లేకుండా పోకూడదని, అనర్హులు ఎవరూ చేరకూడదని నిర్ధారించే ప్రక్రియగా పేర్కొంటూ, ఎస్ఐఆర్ ఇప్పుడు ఎన్‌సిఇఆర్‌టి సామాజిక శాస్త్ర పాఠ్య పుస్తకంలో కూడా చోటు దక్కించుకుంది.

గత యేడాది అక్టోబర్ 27న ప్రకటించిన ఈ ప్రక్రియ రెండవ దశలో ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, కేరళ, పుదుచ్చేరి, అండమాన్ నికోబార్ దీవులు, లక్షద్వీప్, గుజరాత్, మధ్యప్రదేశ్, గోవా రాష్ట్రాల్లో మొత్తం ఓటర్ల జాబితాలో 10.2 శాతం పేర్లు తొలగించబడ్డాయి.

వీటితోపాటు కేంద్రపాలిత ప్రాంతాలలో ఓటర్ల జాబితా ప్రక్షాళనకు ముందు మొత్తం ఓటర్ల సంఖ్య 50.99 కోట్లకు పైగా ఉండేది. ఈ ప్రక్రియ తర్వాత, ఓటర్ల సంఖ్య 45.81 కోట్లకు చేరింది. అంటే 5.18 కోట్లకు పైగా తగ్గుదలనమోదైంది. శాతం పరంగా చూస్తే, ఓటర్ల జాబితాలో 10.2 శాతం మేర తగ్గింపు జరిగింది. ఓటర్ల జాబితాల నుండి మొత్తం 66,88,636 మంది మరణించిన ఓటర్ల పేర్లను తొలగించారు. ఇందులో అత్యధికంగా ఉత్తరప్రదేశ్ నుండి 25.47లక్షల మంది, ఆ తర్వాతి స్థానంలో ఎన్నికలు జరగనున్న పశ్చిమ బెంగాల్ నుండి 24.16లక్షలమంది ఉన్నారు. అదనంగా, ఎస్ఐఆర్ ప్రక్రియలో వచ్చిన అభ్యంతరాలు, వాటి పరిష్కారం ఆధారంగా మరో 63.16 లక్షల పేర్లను తొలగించారు. 12రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు సంబంధించిన తుది ఓటర్ల జాబితాలు వేర్వేరు తేదీలలో విడుదలయ్యాయి, వీటిలో ఉత్తరప్రదేశ్ చివరిగా తన డేటాను విడుదల చేసింది.

36.73 కోట్ల మంది ఓటర్లతో కూడిన ఎస్ఐఆర్ ప్రక్రియ మూడవ దశ మే 14న ప్రారంభమైంది. ఈ యేడాది చివరలో ముగుస్తుంది. ఈ దశ ఆంధ్రప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్, హర్యానా, జార్ఖండ్, కర్ణాటక, మహారాష్ట్ర, మణిపూర్, మేఘాలయ, మిజోరాం, నాగాలాండ్, ఒడిశా, పంజాబ్,సిక్కిం, త్రిపుర, తెలంగాణ, ఉత్తరాఖండ్ అనే 16రాష్ట్రాలు, ఢిల్లీ, చండీగఢ్, దాద్రా- నగర్ హవేలీ, డామన్- దయ్యూ అనే మూడు కేంద్ర పాలిత ప్రాంతాలలో అమలు చేయబడుతోంది.



వెనిజులాలో భూకంపంధాటికి మట్టిలో కూరుకుపోయిన కార్లు

## వెనిజులా భూకంపంలో 600 దాటిన మృతులు

### వేలాదిమంది గల్లంతు


### తక్షణ సాయం అందించిన భారత్

**కారకాస్, జూన్ 26:** వెనిజులాలో సంభవించిన రెండుభారీ భూకంపాలు దేశాన్ని తీవ్ర విషాదంలోకి నెట్టాయి. రిక్టర్ స్కేలుపై 7.2, 7.5 తీవ్రతతో సంభవించిన భూకంపాల కారణంగా ఇప్పటివరకు 600మందిపైగా మృతి చెందగా, 4,300 మందికి పైగా గాయపడ్డారు. వేలాది మంది శిథిలాల కింద చిక్కుకుపోయినట్లు అధికారులు తెలిపారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని వెల్లడించారు. అనధికారిక లెక్కలప్రకారం లక్షమందికిపైగా ఈజంట భూకంపాలకారణంగా గల్లంతయినట్లు ప్రత్యక్ష సాక్షులు చెపుతున్నారు. వెనిజులా ఆరోగ్య మంత్రి కార్లోస్ అల్వారాడో మాట్లాడుతూ, ఆసుపత్రులకు చేరుకునేలోపే వందలాది మంది ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. శిథిలాల కింద ఇంకా ఎంతో మంది చిక్కుకుపోయి ఉండటంతో సహాయక చర్యలు యుద్ధ ప్రాతిపదికన కొనసాగుతున్నాయని తెలిపారు.రాజధాని కారకాస్‌తో పాటు ఉత్తర తీర ప్రాంతాల్లో భవనాలు భారీగా కూలిపోయాయి. లా గువైరా ప్రాంతంలో అత్యధిక ప్రాణనష్టం సంభవించింది. అక్కడి ప్రధాన విమానాశ్రయం కూడా దెబ్బతినడంతో సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడింది. శిథిలాల కింద చిక్కుకున్న వారిని స్థానికులు తమ చేతులతోనే రక్షించే ప్రయత్నం చేస్తున్నారు. ప్రభుత్వం హామీ ఇచ్చిన భారీ యంత్రాలు ఇంకా చేరలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తప్పిపోయిన తమ చిన్నారుల కోసం తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు.భూకంప ప్రభావంతో కారకాస్ నగరంలో విద్యుత్, మొబైల్ సేవలు నిలిచిపోయాయి. మెట్రో రైలు సేవలను నిలిపివేయగా, సహజ వాయువు సరఫరాను కూడా తాత్కాలికంగా నిలిపివేశారు. పాఠశాలలకు కొన్ని రోజుల పాటు సెలవులు ప్రకటించి, వాటిని సహాయ శిబిరాలుగా మార్చాలని ప్రభుత్వం నిర్ణయించింది.వెనిజులా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగెస్ దేశంలో అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. శిథిలాల కింద చిక్కుకున్న వారిని సజీవంగా రక్షించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సహాయక చర్యల కోసం భారీ నిర్మాణ యంత్రాలను అందించాలని పరిశ్రమలను కోరారు. భూకంప బాధితుల సహాయార్థం అమెరికా కొన్ని ఆర్థిక ఆంక్షలను తాత్కాలికంగా సడలించింది. భూకంప సహాయ కార్యక్రమాలకు సంబంధించిన లావాదేవీలకు అక్టోబర్ 23 వరకు అనుమతి ఇచ్చింది.అమెరికా, మెక్సికో, బ్రెజిల్, కెనడా, స్పెయిన్, పోర్చుగల్, ఖతార్, డొమినికన్ రిపబ్లిక్ తదితర దేశాలు సహాయక బృందాలు, వైద్య సిబ్బంది, ఔషధాలు, తాగునీటి శుద్ధి పరికరాలు, డ్రోన్లు, శునక దళాలను వెనిజులాకు పంపిస్తున్నట్లు ప్రకటించాయి.అమెరికా భూగర్భ సర్వే సంస్థ తెలిపిన వివరాల ప్రకారం, మొదటి భూకంపం కారకాస్‌కు పశ్చిమాన సముద్ర తీరానికి సమీపంలో సంభవించగా, కేవలం నిమిషం వ్యవధిలోనే రెండో భారీ భూకంపం అదే ప్రాంతాన్ని తాకింది. తక్కువ లోతులో సంభవించిన ఈ రెండు భూకంపాలు వరుసగా రావడంతో విధ్వంసం మరింత తీవ్రంగా మారిందని భూకంప నిపుణులు తెలిపారు.

భూకంపంతో అతలాకుతలమైన వెనుజులాకు ఆయా దేశాలు సాయం చేసేందుకు ముందుకు వస్తున్నాయి. ఈ క్రమంలో భారత్ కూడా లాటిన్ అమెరికా దేశానికి ఆపన్న హస్తం అందించేందుకు సిద్ధమైంది. ఇందుకోసం 'ఆపరేషన్ అమిస్టాడ్' కొనసాగుతోందని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ వెల్లడించారు.

ఇందులో భాగంగా సహాయక చర్యలకు అవసరమైన సామగ్రితో భారత సైన్యానికి చెందిన రెండు సి-17 విమానాలు బయలుదేరినట్లు చెప్పారు. భారత సైన్యానికి చెందిన ఫీల్డ్ హాస్పిటల్ యూ నిట్, అత్యవసర సమయాల్లో క్షతగాత్రులకు అవసరమైన ప్రాథమిక చికిత్స అందించే సామార్థ్య మున్న రెండు మొబైల్ ఆస్పత్రి టెంట్లు సహా 35 టన్నులకు పైగా సహాయక సామగ్రి, ఔషధాలు, వైద్య పరికరాలు పంపించినట్లు కేంద్ర మంత్రి వెల్లడించారు. క్లిష్ట సమయంలో వెనుజులా ప్రభుత్వానికి, అక్కడి పౌరులకు అవసరమైన సాయం చేసేందుకు భారత్ కట్టుబడి ఉందన్నారు. అమి స్టాడ్ అంటే స్పానిష్ భాషలో స్నేహం అని అర్థం.

## ఒక్క రాత్రే రష్యాపైకి 660 డ్రోన్లు: ఉక్రెయిన్ భీకర దాడి



**కీవ్, జూన్ 26:** ఉక్రెయిన్-రష్యా మధ్య ఉద్రిక్తతలు మరింత తీవ్రమవుతున్నాయి. తాజాగా మాస్కో ఆధీనంలో ఉన్న క్రిమియాతోపాటు రష్యా వ్యాప్తంగా 12 ప్రాంతాలపై కీవ్ వందల కొద్దీ డ్రోన్లతో విరుచుకుపడింది. ఒక్క రాత్రే 660 డ్రోన్లను ప్రయోగించింది. వీటన్నింటిని తాము సమర్థవంతంగా అడ్డుకున్నామన రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ శుక్రవారం వెల్లడించింది. రాజధాని మాస్కో సహా అజోవ్, నల్ల సముద్ర తీరంలోని నగరాలు, క్రిమియాను ఉక్రెయిన్ లక్ష్యంగా చేసుకుంది. తమ నగరంవైపు దూసు కొచ్చిన 47 డ్రోన్లను కూల్చివేసినట్లు మాస్కో మేయర్ వెల్లడించారు. అయితే, దీని వల్ల ఆస్తి, ప్రాణ నష్టం జరిగిందా? అనే వివరాలను ఆయన బయటపెట్టలేదు. నోవోమోస్కోవ్‌స్కీ ప్రాంతం లోని ఓ కెమికల్ ప్లాంట్, హైడ్రోఎలక్ట్రిక్ ప్లాంట్‌పై ఉక్రెయిన్ డ్రోన్లను ప్రయోగించగా అక్కడ భారీగా మంటలు చెలరేగినట్లు వార్తలు వస్తు న్నాయి. అయితే, దీనిపై రష్యా నుంచి అధికారిక ప్రకటన రాలేదు. ఈ దాడుల కారణంగా కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం వాటిల్లినట్లు తెలుస్తోంది. ఈ యుద్ధాన్ని ముగించేందుకు యేడాది కాలంగా అమెరికా చేపట్టిన శాంతి ప్రయత్నాలు ఎలాంటి పురోగతి సాధించలేదు. ఈ నేపథ్యంలోనే రష్యా సైనిక స్థావరాలు, విద్యుత్ మౌలిక సదుపాయాలే లక్ష్యంగా ఉక్రెయిన్ ఇటీవల కాలంలో తమ దాడులను ఉధృతం చేసింది. దీనిపై తాజాగా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఎక్స్ వేదికగా స్పందించారు. 'యుద్ధం ముగించేలా రష్యాపై ఒత్తిడి తెచ్చే లక్ష్యంగా 40 రోజుల పాటు కీలక ఆపరేషన్ చేపట్టనున్నాం' అని వెల్లడించారు.ఈ సమయంలో తమ చర్యలు అత్యంత ఉధృతంగా ఉంటాయని పేర్కొన్నారు. ఈ ప్రకటన వెలువడిన కొద్ది గంటలకే రష్యాపై కీవ్ డ్రోన్లతో విరుచుకుపడటం గమనార్హం.




## కౌటిల్యుడి అర్థశాస్త్రంలోనే సమానత్వ సిద్ధాంతం: చీఫ్‌జస్టిస్ సూర్యకాంత్

**న్యూఢిల్లీ,జూన్26:**ఆధునిక ప్రజాస్వామ్యానికి, చట్టబద్ధ పాలనకు పునాదిగా భావించే మాగ్నా కార్టాకన్నా శతాబ్దాల ముందే భారతదేశంలో సమానత్వ భావన పుట్టిందని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. కౌటిల్యుడు రచించిన అర్థశాస్త్రంలోనే దీని మూలాలు స్పష్టంగా ఉన్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఢిల్లీలో జరిగిన 14వ సెయింట్ పీటర్స్‌బర్గ్ అంతర్జాతీయ న్యాయఫోరమ్‌లో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.1215లో వచ్చిన మాగ్నా కార్టా రాజుతో సహా ప్రతిఒక్కరూ చట్టానికి లోబడి ఉండాలనే విప్లవాత్మక సూత్రాన్ని ప్రపంచానికి పరిచయం చేసిందని చెబుతారని, కానీ అంతకంటేముందే నాలుగో శతాబ్దంలోనే కౌటిల్యుడి అర్థశాస్త్రం సమానత్వ సిద్ధాంతాన్ని ప్రతిపాదించిందని తాను వ్యక్తిగతంగా విశ్వసిస్తున్నట్లు జస్టిస్ సూర్యకాంత్ తెలిపారు. అర్థశా మౌర్య చక్రవర్తి చంద్రగుప్తుని ప్రధాన సలహాదారుడైన కౌటిల్యుడు సంస్కృతంలో రచించారు. ఈ సందర్భంగా సీజేఐ మాట్లాడుతూ చట్టం సమానంగా అందుబాటులో ఉండటం అనేది కేవలం ఒకప్రక్రియగా మిగిలిపోకూడదని, అది ప్రజలకు వాస్తవ హక్కులను అందించాలని స్పష్టం చేశారు. చట్టపరమైన హామీలను వల్లెవేయడం కాదుభౌగోళిక, ఆర్థిక, సామాజిక అంతరాలను అధిగమించి వాటి ఫలాలను ప్రజలకు అందించడమే అసలైన సవాల్ అని ఆయన పేర్కొన్నారు.భారత రాజ్యాంగం కూడా పౌరులందరికీ చట్టం ముందు సమానత్వం, గౌరవంగా జీవించే హక్కు వంటి అనేక ప్రాథమిక హక్కులను అందించిందని గుర్తుచేశారు.

## కేతన్ విగ్గు ధరించేవాడు..బట్టతల నాకు నచ్చేదికాదు: సియా



**పూణె,జూన్ 26:** మహారాష్ట్రలోని పూనేకు చెందిన కేతన్ అగర్వాల్ హత్య కేసు విచారణలో అనేక ఆసక్తికర విషయాలు బయటపడుతున్నాయి. కేతన్ హత్యకు దారితీసిన పరిస్థితులపై ప్రధాన నిందితురాలు సియా గోయల్ భిన్నమైన సమాధానాలు ఇస్తోంది. తాజాగా పోలీసుల విచారణలో కొన్ని ఆసక్తికర విషయాల్ని తెలిపింది. కేతన్ అగర్వాల్‌ను పెళ్లి చేసుకోవడం తనకు ఇష్టం లేదని, ఇందుకు అతడు విగ్గు ధరించడమే కారణమని సియా తెలిపింది. కేతన్ చూడటానికి అంతగా బాగుండేవాడు కాదని, బట్టతల ఉందని, పైగా తను విగ్గు వాడటం తనకు నచ్చలేదని చెప్పింది. అతడికి జుట్టు బాగా ఊడిపోవడం వల్ల విగ్గు పెట్టుకున్నాడని, తనకు కాబోయే వాడు ఇలా విగ్గు ధరించడం తనకు అస్సలు ఇష్టం లేదని పోలీసులకు చెప్పింది. ఇదే సమయంలో పెళ్లిని ఆపేందుకు తాను ప్రయత్నిస్తుంటే ఇప్పుడు అంత సమయం లేదని, ఇప్పటికే పెళ్లిని ఆపే విషయంలో సమయం మించిపోయిందని కేతన్ తనతో అన్నట్లు సియా తెలిపింది. పెళ్లికి సంబంధించిన ఏర్పాట్లు చాలా దూరం వెళ్లిపోయాయని, దీంతో పెళ్లి ఆపడం సాధ్యం కాదనేలా అతడు చెప్పినట్లు సియా వివరించింది. మరోవైపు కేతన్ విగ్గు అంశంపై కేతన్ తండ్రి మీడియాతో మాట్లాడాడు. తన కొడుకు విగ్గు వాడటం గురించి వారి కుటుంబానికి ముందే చెప్పామన్నాడు. సియాకు ఏమాత్రం అసంతృప్తి, ఇబ్బంది ఉన్నా ఈ పెళ్లి ఆపాలని తాము కూడా భావించినట్లు చెప్పారు. ఇక, ప్రస్తుతానికి సియాకు ఆమె కుటుంబ సభ్యుల నుంచి పెద్దగా సహకారం లభించడం లేదు. ఆమె అరెస్ట్ అయిన తర్వాత నుంచి సియా కుటుంబ సభ్యులు ఎవరూ ఆమెను కలవలేదు. అయితే, సియా గోయల్ ప్రియుడు చేతన్ చౌదరి కుటుంబ సభ్యులు మాత్రం అతడిని తరచూ కలుస్తున్నారని విచారణ అధికారులు తెలిపారు. సియా తప్పు చేసి ఉంటే ఆమెను ఉరితీసినా తమకు ఏ అభ్యంతరం లేదని ఆమె తండ్రి మీడియాతో చెప్పారు. కేతన్ తండ్రి మాట్లాడుతూ సియా చేసిన నేరం రుజువైతే ఆమెను కూడా అలాగే, కొండపైనుంచి తోసి చంపేయాలని కోరాడు. కేతన్ హత్యపై మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ మాట్లాడారు. ఈ ఘటనపై విచారం వ్యక్తం చేశారు. పిల్లల్లో ఇలాంటి నేర ప్రవృత్తి సంబంధమైన ఆలోచనలకు దూరంగా పెంచాలని ఆయన సూచించారు.



## రూ.320 కోట్లుపన్నులు చెల్లించిన కింగ్ ఛార్లెస్

**లండన్,జూన్ 26:** బ్రిటన్ రాచకుటుంబ చరిత్రలో సరికొత్త అధ్యాయం మొదలైంది. రాజుగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తానుచెల్లించిన వ్యక్తిగత పన్నుల వివరాలను బహిరంగపరచి కింగ్‌చార్లెస్III సరికొత్త చరిత్ర సృష్టించారు. ఒక బ్రిటన్‌రాజు తన సొంత పన్ను వివరాలను ఇలాఅధికారికంగా ప్రకటించడం ఇదే తొలిసారి.బకింగ్‌హామ్ ప్యాలెస్ విడుదల చేసిన వార్షిక ఆర్థికనివేదికల ప్రకారం సెప్టెంబర్ 2022లో రాజుగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి కింగ్ చార్లెస్‌రూ.320కోట్లకుపైగా (30మిలియన్ పౌండ్లు) వ్యక్తిగత పన్నులు చెల్లించారు. 2024-25ఆర్థిక సంవత్సరంలోనే మూలధన లాభాల పన్నుల కింద రూ.140కోట్లుకట్టారు.యునైటెడ్ కింగ్‌డమ్‌లోనే అత్యధిక పన్ను చెల్లించే టాప్100 మంది వ్యక్తులజాబితాలో బ్రిటన్ రాజు నిలిచారు.

# సంక్షిప్త వార్తలు

## కనిష్కను కూల్చింది ఖలిస్థానీ ఉగ్రవాదులే: కెనడా



**ఒట్టావా, జూన్ 26:** ఖలిస్థానీ ఉగ్రవాదంపై మెతకవైఖరి అవలంబిస్తూ వారికి పరోక్షంగా మద్దతిస్తూ, ఆశ్రయమిస్తూ వచ్చిన కెనడా తన వైఖరిని మార్చుకుంటోందా? అవుననే సమాధానం వస్తోంది. ఎయిరిండియా కనిష్క విమాన ప్రమాదం జరిగి నాలుగు దశాబ్దాలు గడిచిన తర్వాత తొలిసారి.. 329 మంది ప్రాణాలను బలిగొన్న ఆ ఘటనలో ఖలిస్థానీ ఉగ్రవాదుల పాత్ర ఉందని అధికారికంగా అంగీకరించింది. ఇన్నాళ్లు ఖలిస్థానీ వేర్పాటువాదుల పేరును ఎన్నడూ ప్రస్తావించని ఆ దేశం.. ఇప్పుడు ఆ దారుణ మారణకాండకు వారే కారణమని స్పష్టం చేసింది. 1985 జూన్ 23న అట్లాంటిక్ మహాసముద్రంపై ఎయిరిండియా బోయింగ్ విమానం 'కనిష్క' కూలి అందులో ప్రయాణిస్తున్న వారంతా ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే.

## అజాన్‌పై నిషేధం విధించేందుకు డెన్మార్క్ కసరత్తు



**కోపెన్ హ్యాగన్,జూన్ 26:** డెన్మార్క్ ప్రభుత్వం దేశవ్యాప్తంగా మసీదుల నుంచి బహిరంగంగా విని పిం చే ఇస్లామిక్ ప్రార్థన పిలుపు అజా న్‌పై నిషేధం విధించే అంశాన్ని పరిశీలి స్తోంది. రాజ్యాంగం కల్పించిన మత స్వేచ్ఛ హక్కును ఉల్లంఘించకుండా దీనిని ఏ విధంగా అమలు చేయవచ్చనే అంశంపై న్యాయ సమీక్షకు ఆదేశించింది. ఈ విషయాన్ని దేశ ఇమ్మిగ్రేషన్ మంత్రి మోర్టెన్ బోడ్స్కోవ్ వెల్లడించారు. డెన్మార్క్ వీధుల్లో నడుస్తుంటే ఇస్లామాబాద్ శివారు ప్రాంతాల్లో ఉన్నామనే భావన కల గకూడదని ఆయన వ్యాఖ్యానించారు. డెన్మార్క్ పైకప్పుల వెలుపల అజాన్ వినిపించాల్సిన అవసరం లేదని, ఇక్కడ దానికి స్థానం లేదని ఆయన స్పష్టం చేశారు. దేశంలో ఇస్లాం ప్రభావం పెరుగుతోందని ఈ సందర్భంగా ఆయన తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

## రాహుల్‌గాంధీపై బిజెపి సోషల్‌మీడియా మీమ్స్ ప్రచారం




**న్యూఢిల్లీ,జూన్ 26:** దేశ రాజకీయాల్లో సోషల్ మీడియా వేదికగా మరో డిజిటల్ వార్ మొదలైంది. కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ లక్ష్యంగా భారతీయ జనతా పార్టీ దేశవ్యాప్తంగా ఒక భారీ మీమ్స్ క్యాంపెయిన్‌ను ప్రారంభించింది. రాహుల్ గాంధీ తరచూ వెళ్లే విదేశీ పర్యటనల సమయం, వాటి ఉద్దేశం, అలాగే ఆ ప్రయాణాలకు అయ్యే ఖర్చుల ఫండింగ్‌ను ప్రశ్నిస్తూ బీజేపీ శ్రేణులు సోషల్ మీడియాను ముం చెత్తుతు న్నాయి. ఈనెల 25 నుంచి ఊపం దుకున్న ఈ సమన్వయ డిజిటల్ ప్రచారంలో బీజేపీ జాతీయ విభాగంతో పాటు వివిధ రాష్ట్రాల ఐటీ సెల్స్, పార్టీ నాయకులు చురు గ్గా పాల్గొంటున్నారు.

## బంకిపూర్ అసెంబ్లీ ఉప ఎన్నికలో ప్రశాంత్‌కిషోర్ పోటీ



**పాట్నా,జూన్ 26:** ఎన్నికల వ్యూహకర్త, జన్ సురాజ్ పార్టీ అధినేత ప్రశాంత్ కిషోర్ తొలిసారి ఎన్నికల బరిలోకి దిగుతున్నారు. ఇటీవల నితిన్ నబిన్ రాజ్యసభకు వెళ్లడంతో బీహార్‌లోని బంకిపూర్ అసెంబ్లీస్థానం ఖాళీ అయింది. దీంతో త్వరలోనే ఈ స్థానానికి ఉపఎన్నిక జరగనుంది. ఈ ఉపఎన్నికలో స్వయంగా రంగంలోకి దిగాలని ప్రశాంత్ కిషోర్ భావిస్తున్నారు. గతేడాది జరిగిన అసెంబ్లీఎన్నికల్లో పోటీ చేయకుండా ప్రచారానికి పరిమితమయ్యారు. దీంతో పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో త్వరలో జరగబోయే ఉపఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు తాజాగా మీడియాకు తెలియజేశారు.

## గ్లోబల్ మార్కెట్‌లో ముడిచమురు ధరలు భారీ పతనం..

**న్యూఢిల్లీ,జూన్ 26:** అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు శుక్రవారం భారీగా తగ్గాయి. హర్మూజ్ జలసంధిలో చమురు సరఫరాపై ఆందోళనలు తగ్గడంతో బ్రెంట్, డబ్ల్యూటీఐ క్రూడ్ ధరలు దాదాపు రెండు శాతం మేర పడిపోయాయి. ఈ వారం మొత్తంగా రెండు బెంచ్‌మార్క్‌లు సుమారు ఏడు శాతం నష్టాలను నమోదు చేసే దిశగా సాగుతున్నాయి. ప్రారంభ ట్రేడింగ్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర రెండు శాతం తగ్గి 73.75 డాలర్లకు, అమెరికా వెస్ట్‌టెక్సాస్ ఇంటర్మీడియట్ ధర రెండు శాతం పడిపోయి 70.42 డాలర్లకు చేరింది.

# ‘సర్’ పర్యవేక్షణకు పార్లమెంట్‌వారీగా కంట్రోల్‌రూమ్ కోఆర్డినేటర్లు

## ఎస్ఐఆర్ కోఆర్డినేషన్ కమిటీ చైర్మన్‌గా పులిపాటి రాజేష్‌కుమార్

### పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, జూన్ 26, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పర్యవేక్షించడానికి, ఎస్ ఐఆర్ కోర్డినేషన్ కమిటీ చైర్మన్, కోఆర్డినేటర్‌తోపాటు పార్లమెంట్ నియోజక వర్గాల కంట్రోల్ రూమ్ కోఆర్డినేటర్లను నియమిస్తూ పిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ ఉత్తర్వులు జారీచేశారు. ఎలక్షన్ కమిషన్‌తో అనుసంధానం కోసం పిసిసి ఎలక్షన్ కమిషన్ కోఆర్డినేషన్ కమిటీ చైర్మన్‌గాపులిపాటి రాజేష్ కుమార్, కాంగ్రెస్ పార్టీ పరిపాలనాపరంగా గంప వేణుగోపాల్‌ను కోఆర్డినేటర్‌గా నియమించారు.

తెలంగాణలోని పదిహేడు పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా కంట్రోల్ రూమ్ కోఆర్డినేటర్లను నియమించడంతోపాటు కంట్రో ల్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. అదిలాబాద్ పార్లమెంట్ నియోజక వర్గానికి కోల్కొండ సంతోష్ పెద్దపల్లి కి శశి భూషణ్ కాచే, కరీంనగర్‌కు డాక్టర్ మద్దెల సంతోష్ కుమార్ నిజామాబాద్‌కు బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి,జహీరాబాద్ పార్లమెంట్‌కు డాక్టరు జూలూరు ధనలక్ష్మి, మెదక్ పార్లమెంట్ కోఆర్డినేటర్‌గా జీ.వి. వెన్నెల,మల్కాజిగిరికి సుబ్రహ్మణ్య పొన్నాడ, సికింద్రాబాద్‌కు ఎం. రాఘవేంద్ర రెడ్డి. హైదరాబాద్ అచ్యుత యాదవ్. చేవెళ్లకు ఎస్. జగదీశ్వర్ రావు,మహబూబ్నగర్ టి. రేవతి గౌడ్, నాగర్ కర్నూల్‌కు ఒబేదుల్లా కోత్వాల్, నల్గొండ కస్బా శ్రీనివాసరావు, భువనగిరి డాక్టర్ బైకినీ లింగం యాదవ్ వరంగల్ పీర్ ఇర్షద్ అహ్మద్ నాసిర్, మహబూబాబాద్, నూతి శ్రీకాంత్ గౌడ్, ఖమ్మం గోపిశెట్టి రాఘవేందర్‌లను నియమించారు.

ఈ కమిటీ సభ్యులు ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో బూత్ స్థాయి బిఎల్ఎ ల నుండి అసెంబ్లీ, పార్లమెంట్ నాయకులతో మాట్లాడుతూ ఏమన్నా సమస్యలు ఉంటే ఎలక్షన్ కమిషన్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారమయ్యేటట్టు చూడటం జరుగుతుంది. టిపిసిసిసి ఎలక్షన్ కమిషన్ కో ఆర్డినేషన్ కమిటీ చైర్మన్ పులిపాటి రాజేష్ కుమార్ ఈనెల రోజులు పార్లమెంట్ కోఆర్డినేటర్లతో సమన్వయం చేసుకొని అర్హులైన ఓటర్లను ఎవరిని కూడా జాబితా నుంచి తొలగించకుండా చూడాలని టిపిసిసి చీఫ్ తెలిపారు.

# రాష్ట్రంలో లార్జ్ ట్యాక్స్ పేయర్స్ యూనిట్ ఏర్పాటు

### వాణిజ్య పన్నుల శాఖలో సంస్కరణలు

**హైదరాబాద్, జూన్ 26, ప్రభాతవార్త:** పన్నుల వసూళ్లను మరింత పగడ్బందీగా పెంచేందుకు రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ పలు చర్యలు చేపట్టింది. వాణిజ్య పన్నుల శాఖ లో సంస్కరణలు చేపడుతూ అధికారులు పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఇందులో భాగంగా హైదరాబాద్‌లోని వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ కార్యాలయంలో ‘స్టేట్ లార్జ్ ట్యాక్స్ పేయర్స్ యూనిట్’ ను ఏర్పాటు చేసి తద్వారా పన్నుల వసూళ్లలో లీకులు లేకుండా చూడనున్నారు. పన్నుల వసూళ్లను మరింత సమర్ధంగా ప ర్యవేక్షించేందుకు, భారీగా పన్నులు చెల్లించేవారిపై ప్రత్యేక నిఘా ఉంచనుంది. అలాగే పేయర్స్ యూనిట్ ఏర్పాటుకు అనుగుణంగా వాణిజ్య పన్నుల శాఖను 19 డివిజన్లు, 121 సర్కిళ్లుగా పునర్వ్యవస్థీకరిస్తూ అధికారులు నప్రతిపాదనలకు కార్యారణను అమలు చేస్తున్నారు. డివిజన్ స్థాయిలో ప్రత్యేక పన్ను చెల్లింపుదారుల విభాగం ద్వారా అగ్రశ్రేణి పన్ను చెల్లింపుదారులను పర్యవేక్షిస్తున్నప్పటికీ, రాష్ట్రస్థాయిలో ఇలాంటి సమగ్రమైన వ్యవస్థ ఇప్పటివరకు లేదు. నిర్దిష్ట ప్రమాణాల ఆధారంగా పన్ను చెల్లింపుదారులను రాష్ట్రస్థాయి ఎల్‌టీయూ పరిధిలోకి తీసుకొస్తారు. ఈ విభాగానికి జాయింట్ కమిషనర్ లేదా అడిషనల్ కమిషనర్ హోదా గల అధికారి నేతృత్వం వహిస్తారు.

యేటా నిర్దేశిత మొత్తం కంటే ఎకువ ఎస్‌జీఎస్టీ రెవెన్యూ అందించే అగ్రశ్రేణి పన్ను చెల్లింపుదారులు ఈ యూనిట్ పరిధిలోకి రానున్నట్లు వాణిజ్య పన్నుల శాఖ ఉన్నతాధికారులు తెలిపారు. అన్ని రకాల జీఎస్టీ చట్టాల కింద ఏటా నిర్దేశిత పరిమితికి మించి రీఫండ్లు పొందే వ్యాపారులతోపాటు పెట్రోలియం ఉత్పత్తులు, మానవ వినియోగానికి ఉపయోగించే మద్యం వంటి నాన్‌జీఎస్టీ వస్తువుల వ్యాపారం చేస్తూ వ్యాట్ చట్టం కింద భారీగా పన్నులు చెల్లించే ప్రముఖులు కొత్త విభాగం పరిధిలోకి వస్తారు.

# కెసిఆర్ మౌనం.. గోడకు వేలాడుతున్న తుపాకీ


### జగన్ బంగీ జంప్‌పై కెటిఆర్ సరదా వ్యాఖ్యలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 26:** బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్ ను ఉద్దేశించి చేసిన సరదా వ్యాఖ్యలు ప్రస్తుతం ఆసక్తికరంగా మారాయి. ఒక టెలివిజన్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కేటీఆర్ మాట్లాడుతూ, గతంలో జగన్ చేసిన బంగీ జంప్ గురించి ప్రస్తావించారు. తనకు సాహసకృత్యాలంటే ఇష్టమని, భవిష్యత్తులో స్కైడైవింగ్ చేయాలని ఉందని, అయితే బంగీ జంప్ అంటే మాత్రం ఎంతో భయమని ఆయన వెల్లడించారు. కేవలం ఒకే తాడుపై ఆధారపడి కిందకు దూకడం చాలా భయానకంగా అనిపిస్తుందని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ క్రమంలోనే జగన్ చేసిన బంగీ జంప్ అంశాన్ని గుర్తుచేసుకుంటూ, ‘అది జగన్‌కు ఎలా సాధ్యమైందో నాకు అర్థం కావడం లేదు. ఆయన్ను కలిసినప్పుడు దీని గురించి తప్పకుండా అడుగుతాను“ అని నవ్వుతూ వ్యాఖ్యానించారు. ప్యారాచూట్ సహాయంతో చేసే స్కై డైవింగ్ కంటే బంగీజంప్ క్లిష్టమని ఆయన అభిప్రాయపడ్డారు.ఇదే ఇంటర్వ్యూలో తన తండ్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఇటీవలి మోనంపై కూడా కేటీఆర్ స్పందించారు. కేసీఆర్ మోనాన్ని ‘గోడకు వేలాడుతున్న తుపాకీ’తో ఆయన పోల్చారు. సమయం వచ్చినప్పుడు అది తప్పకుండా గర్జిస్తుందని, ప్రస్తుతం ఆయన మార్గదర్శకత్వంలోనే తామంతా ముందుకు సాగుతున్నామన్నారు.

# విద్యా శాఖ మంత్రిగా రేవంత్ ఫెయిల్

### బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి జీవన్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 26:** నిరుద్యోగులను సిఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆగం చేస్తోందని బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి ఆరోపించారు. పేద విద్యార్థులకు ఉన్నత విద్యను దూరం చేస్తోందని అన్నారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిల విడుదల చేయడం లేదని, బకాయిలు చెల్లించకుండా విద్యార్థుల భవిష్యత్తుతో రేవంత్ చెలగాటం ఆడుతున్నారని విమర్శించారు. జివో9 లోని 4 నిబంధనల అమలును హైకోర్టు నిలిపివేసిందని, విద్యార్థుల చదువుపై ప్రభుత్వానికి శ్రద్ధ లేదా? అని ప్రశ్నించారు. విద్యాశాఖ మంత్రిగా రేవంత్ ఫెయిల్ అని జీవన్ రెడ్డి మండిపడ్డారు. ఫీజు రీయింబర్స్ మెంట్ పథకాన్ని మాజీ సిఎం కెసిఆర్ కొనసాగించారని కొనియాడారు. 30 నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్ మెంట్ విడుదల చేయలేదని, విద్యార్థులు సర్టిఫికెట్లు కూడా పొందలేకపోతున్నారని జీవన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం రూ.10 వేల కోట్లు బకాయిలు పడ్డదని, ప్రభుత్వం ఫీజు చెల్లించకుండా జివో నెం.9ని తీసుకొచ్చారని ధ్వజమెత్తారు. విద్యార్థులకు ఆర్థిక స్థోమత లేకనే ఫీజు రీయింబర్స్ మెంట్ పథకమని, విద్యార్థులే ఫీజు చెల్లించుకుంటే ప్రభుత్వం ఎందుకు? అని ప్రశ్నించారు. ప్రభుత్వం ఫీజు చెల్లిస్తుందో..లేదో తెలియదు కానీ విద్యార్థులు మాత్రం ఫీజు చెల్లించాల్సి వస్తుందని, కెసిఆర్ పై కోపంతో పథకాలు నిలిపివేస్తే రాష్ట్రం నష్టపోతుందని, జివో నెం.9ని ప్రభుత్వం రద్దు చేయాలని జీవన్‌రెడ్డి కోరారు.



ప్రసంగిస్తున్న రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

# 30న తరగతుల బహిష్కరణ.. కలెక్టరేట్ల ముట్టడి

### ఫీజు రీయింబర్స్‌మెంట్ యధాతథంగా అమలుచేయాలి

**హైదరాబాద్, జూన్ 26, ప్రభాతవార్త:** ఫీజు రీయింబర్స్ మెంట్ పథకాన్ని యథాతథంగా కొనసాగించి, విద్యార్థులకు సంబంధించిన రూ.8 వేల కోట్ల ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 30న రాష్ట్రవ్యాప్తంగా కాలేజీల బహిష్కరణతోపాటు కలెక్టరేట్లు, ఆర్డీవో, ఎంఆర్వో కార్యాలయాల ముట్టడికి 14 బీసీ సంఘాలు పిలుపునిచ్చాయి. శుక్రవారం విద్యానగర్ బీసీ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. సమావేశంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ, ప్రభుత్వం ఫీజు బకాయిలు విడుదల చేయకపోవడంతో వేలాదిమంది విద్యార్థులు విద్యా సర్టిఫి కెట్లు పొందలేక ఉద్యోగాలు, ఉన్నత విద్య అవకాశాలను కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంజినీరింగ్ కౌన్సె లింగ్‌లో 18 యేళ్లగా అమలవుతున్న విధానాన్నే కొనసాగించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్. అరుణ్‌కుమార్, రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం వెంకటేష్ తదితర 14 బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# పిసిసి ఉపాధ్యక్షుడు జగదీశ్

# పాస్‌పోర్టు పౌరసత్వం కాకపోతే బిజెపి మెంబర్‌షిప్ పౌరసత్వమా?



**హైదరాబాద్, జూన్ 26, ప్రభాతవార్త:** పాస్‌పోర్టు పౌరసత్వం ధృవీకరణ కాకపోతే బిజెపి సభ్యత్వం భారతీయుడిగా గుర్తింపుకు ఉపయోగ పడుతోందా అని టిపిసిసి ఉపాధ్యక్షుడు సంగిశెట్టి జగదీశ్ ప్రశ్నించారు. శుక్రవారం గాంధీభవన్‌లో సంగిశెట్టి జగదీష్ మాట్లాడుతూ బిజెపి రాజకీయాధికారం కోసం రాముడి గుడి చందాలను కూడా చోరి చేస్తోందని దుయ్యబట్టారు. ఇప్పటి వరకు బిజెపి ఓటుచోరి, ఇవిఎంలో డాటాచోరి, సీటుచోరి, పార్టీ చోరి వంటి ఎత్తుగడలతో దేశంలో ప్రజా స్వామ్య వ్యవస్థను అపహాస్యం చేస్తూ వచ్చిందని ఇక బహుళపార్టీ వ్యవస్థను కూడా లేకుండా కేవలం ఏకపార్టీ వ్యవస్థను తీసుకొచ్చి నియంతృత్వంవైపు తీసుకెళ్ళుతుందని ఇది దేశానికి క్షేమం కాదని ఆయన వివరించారు. ప్రస్తుతం జరిగే సర్ ప్రాముఖ్యత అందరూ తెలుసుకోవాలనీ ఓటెతో మన భవిష్యత్ మనమే రాసుకొనే హక్కు రాజ్యాంగం మనకి కల్పించిందనీ ఆయన గుర్తుచేశారు. పాస్పోర్ట్ అనేది కూడా సిటిజెన్ షిప్ కాదు అంటున్నారూ బిజెపి మెంబెర్ షిప్ ఉంటేనే సిటిజెన్ గా కన్సిడర్ చేస్తారేమో అని ఎద్దేవా చేశారు. ఇతర రాష్ట్రాల లో సర్ పేరుతో బిజెపి ఎలా అధికారం లోకి వస్తుందో మనం చూసాం అని భయాందోళన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు 8 సార్లు సర్ ప్రక్రియ జరి గిందనీ ఆయన తెలి పారు. దేశంలో తెలం గాణ మా టార్గెట్ అని బిజెపి నేతలు మాట్లాడు తున్నారనీ ఓట్ అప్లై చే న ు కో వ టం తో పా టు 2002 నాడు ఎక్కడ ఓటు వేశారో ఆ వివరాలు బిఎల్ ఒలకు అందించాలని ఇది ప్రజాస్వామ్య ప్రక్రియ కాపాడుకొనే బాధ్యతగా మనం తీసుకోవాలని ఆయన కోరారు., అందరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలనీ అంబేద్కర్ రాసిన రాజ్యాంగంను పరిరక్షణ చేసుకొనాల్సి న అవసరం ఉందని తెలిపారు.

# అంగన్‌వాడీ నియామకాలను అడ్డుకోవడానికి మంత్రి సీతక్కపై అసత్య ప్రచారం

### కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు ఇందిరా శోభన

**హైదరాబాద్, జూన్ 26, ప్రభాతవార్త:** అంగన్వాడీ నియామకాల్లో ఇంటర్వ్యూల విధానంపై బిఆర్ఎస్ మహిళా నాయకులు చేస్తున్న అసత్య ప్రచారంపై కాంగ్రెస్ సీనియర్ నేత ఇందిరాశోభన్ తీవ్ర స్థాయిలో ధ్వజ మెత్తారు. కేవలం రాజకీయ లబ్ధి కోసమే, నియామకాలను అడ్డుకునే కుట్రతోనే మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ లేనిపోని విమర్శలు చేస్తున్నారని ఆమె మండిపడ్డారు. మంత్రి సీతక్కకు ప్రజల్లో వస్తున్న ఆదరణను తట్టులేక అక్కసుతో నిరాధారమైన ఆరోపణలు చేయడం నిజంగా సిగ్గుచేటన్నారు. మరోసారి సీతక్కపై ఇష్టానుసారంగా మాట్లాడితే తగిన బుద్ధి చెప్తామని ఆమె హెచ్చరించారు.అంగన్వాడీ అనేది కేవలం ఒక ఉద్యోగం కాదని, చిన్నారులు, గర్భిణీలు, బాలింతల ఆరోగ్యం, పోషకాహారం, ప్రాథమిక అభ్యాసం వంటి కీలక బాధ్యతలను నిర్వహించే గొప్ప సేవ అని ఇందిరాశోభన్ కొనియాడారు.

అభ్యర్థి వ్యవహారశైలి, మానసిక పరిపక్వత, పిల్లల పట్ల సున్నితత్వం వంటి అంశాలను తెలుసుకోవడానికే ప్రజా ప్రభుత్వం ఇంటర్వ్యూలను ప్రవేశపెట్టిందన్నారు. దేశంలోని పలు రాష్ట్రాల్లో ఈ విధానం ఇప్పటికే అమల్లో ఉందని ఆమె గుర్తు చేశారు. గతంలో కొన్నిచోట్ల చిన్నారుల పట్ల అనుచితంగా వ్యవహరించిన ఘటనలు పునరావృతం కాకుండా అడ్డుకోవడమే కాంగ్రెస్ సర్కార్ ప్రధాన ఉద్దేశమన్నారు. బిఆర్ఎస్ నాయకులు ప్రచారం చేస్తున్నట్లుగా ఇంటర్వ్యూల ఆధారంగా మాత్రమే నియామకాలు జరగవని, అభ్యర్థి సాధించే మొత్తం మార్కుల్లో 90 శాతం వారి విద్యార్హతలు, ఇతర సామాజిక అర్హతల ఆధారంగానే ఉంటాయని ఇందిరాశోభాన్ తెలిపారు. ఇంటర్వ్యూలలో ఏ ఒక్క అధికారి ఇష్టానుసారం మార్కులు వేయడానికి వీల్లేదని, జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఉండే ప్రత్యేక కమిటీ ఈ ఎంపికను పారదర్శకంగా నిర్వహిస్తుందన్నారు. అభ్యర్థుల నైపుణ్యాలను పరిశీలించి కేవలం 10 శాతం మార్కులు మాత్రమే ఈ కమిటీ కేటాయిస్తుందన్నారు. అభ్యర్థుల నైపుణ్యాన్ని ప్రత్యక్షంగా తెలుసుకోవడానికి ఇంటర్వ్యూలు పెడితే బీఆర్ఎస్ నాయకులు సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని ఇందిరాశోభన్ మండిపడ్డారు

# విజిలెన్స్ కమిషన్ ఇచ్చిన నివేదిక ఆధారంగా ‘ప్రైవేటు’ పైచర్యలు చేపట్టాలి

### ఫీజుల వసూళ్లపై ఉన్న శ్రద్ధ బోధన ప్రమాణాలు పాటించడంలో ఉండాలి:

### ఎమ్మెల్సీ విజయశాంతి డిమాండ్

**హైదరాబాద్, జూన్ 26, ప్రభాతవార్త:** ప్రభుత్వం నిర్ధేశించిన నిబంధనలు పాటించని ప్రైవేటు కళాశాలపై విజిలెన్స్ కమిషన్ ఇచ్చిన నివేదిక ఆధారంగా చర్యలు చేపట్టి బోధనా ప్రమాణాలు పెంచుకొనేందుకు తెలంగాణ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు, ఎమ్మెల్సీ విజయశాంతి డిమాండ్ చేశారు. తెలంగాణ లోని ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలు ఫీజుల వసూళ్లపై చూపే శ్రద్ధను, విద్యా సంస్థల నిర్వహణలో కనీప్రమాణాలు పాటించడంలో కూడా చూపాలని ఆమె హితవు చెప్పారు. రాష్ట్రంలోని ప్రైవేట్ కాలేజీలకు ఫీజు రియంబర్స్ మెంట్ కింద ప్రభుత్వం చెల్లించాల్సి న బకాయిలను విడుదల చేయాలంటూ హైకోర్టు ఇటీవల జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వుల నేపథ్యంలో ఆమె శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. హైకోర్టు ఆదేశాలను గౌరవిస్తూ, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా సానుకూల నిర్ణయం తీసుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని కోర్టుకు తెలపడం హర్షణీయమని విజయశాంతి పేర్కొన్నారు. ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలు విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయడంలో తప్పులేదని, కానీ దానికి తగ్గట్టుగా కాలేజీల్లో సరైన వసతులు, నాణ్యమైన విద్యా ప్రమా ణాలు కల్పించాల్సి న బాధ్యత కూడా వారిపైనే ఉంటుందని విజయ శాంతి స్పష్టం చేశారు. ప్రస్తుతం తెలంగాణలోని చాలా ప్రైవేట్ కాలేజీలు ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను పాటించడం లేదని, కనీస సదుపాయాలు కూడా కల్పించడం లేదని విజిలెన్స్ కమిషన్ విచారణలో తేలిందని ఆమె గుర్తుచేశారు. ఈ మేరకు విజిలెన్స్ కమిషన్ ప్రభుత్వానికి నివేదిక కూడా సమర్పించిందన్నారు.

# బొగ్గు మాయంపై హరీశ్ ఆరోపణలు అసత్యం

### ఆరోపణలకు సమాధానం చెప్పాలి

### సమస్యలు పరిష్కారం కాకపోతే ఆగస్టు 15 నుంచి సమ్మె

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

**హైదరాబాద్, జూన్ 26, ప్రభాతవార్త:** సింగరేణికి సంబంధించిన విష యాలపై బిఆర్ఎస్ నేత, మాజీమంత్రి హరీశ్‌రావు తనపై వ్యక్తిగతంగా దుష్ప్రచారం చేస్తున్నారని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాం బశివరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగరేణిలో 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైందని హరీశ్‌రావు చేస్తున్న ప్రచారం పూర్తిగా అసత్య మని, ఒక్క బొగ్గు పెల్ల కూడా దొంగతనం జరిగే అవకాశం లేదని తెలిపారు. సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్ శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కూనంనేని సాంబశివ రావు, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి అనుబంధం) రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, కార్యదర్శి కె.రాజ్ ఇటీవలి కాలంలో సింగరేణిలో జరుగుతున్న పరిణామాలపై మాట్లాడారు. సింగరేణిలో ఇప్పుడు స్కామ్ జరిగింది అంటే బిఆర్ఎస్ ప్రభుత్వ హయంలో 75 లక్షల టన్నుల బొగ్గు నిల్వలు ఎక్కువ చూపించారని, అప్పుడు కాంగ్రెస్ అధికార ప్రతినిధి ఇప్పుడు బిఆర్ఎస్ ఎమ్మెల్సీగా ఉన్న దాసోజు శ్రవణ్‌కుమార్ 2017లో టిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో 75 లక్షల టన్నుల బొగ్గు ఎక్కువగా ఉన్నదని చూపెట్టారని ‘ఇది సత్యం స్కాం లాంటి’దని ఆనాటి కేంద్ర విజిలెన్స్ కమిషన్ కే చౌదరికి ఫిర్యాదు చేశారని గుర్తు చేశారు. హరీశ్‌రావు ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం సరైందికాదని, ఆయన అసత్యాలు చెప్పడం మానేసి, బొగ్గు నిల్వలపై అనుమానం ఉంటే సిబిఐ విచారణ కోరవచ్చని సాంబశివరావు సూచించారు. టిజిబికెఎస్ యూనియన్ పంచాయతీ కోసం సింగరేణి సంస్థ ప్రతిష్టను దెబ్బ తీయొద్దన్నారు. సింగరేణిలో నెలకొన్న సమస్యలు పరిష్కారం కాకపోతే ఆగస్టు 15 నుంచి సమ్మెకు పిలుపునిస్తామని సంస్థను హెచ్చరించినట్లు సాంబశివరావు వెల్లడించారు.

# నెలాఖరులోగా రైతు డిస్కంకు లైసెన్స్

### విద్యుత్ నియంత్రణ కమిషన్ కసరత్తు పూర్తి

**హైదరాబాద్, జూన్ 26, ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యవసాయ, రైతాంగంతో పాటు, ఉచిత విద్యుత్ అందిస్తున్న వివిధ విభాగాలకు సంబంధించి మరింత మెరుగైన విద్యుత్ సేవలు అందించే లక్ష ్యంతో ప్రతిపాదిత ఉచిత విద్యుత్ పంపిణీ సంస్థ ఏర్పాటు చివరిదశకు చేరింది. ఈ నూతన విద్యుత్ పంపిణీ సంస్థ అధికారికంగా కార్యకలాపాలు ప్రారంభించేందుకు అత్యంత కీలకమైన లైసెన్స్ జారీకి రంగం సిద్ధమైంది. రాష్ట్ర విద్యుత్తు నియంత్రణ కమిషన్ ఈ లైసెన్స్ జారీకి అవసరమైన విధివిధానాలపై ప్రస్తుతం చేస్తున్న కసరత్తు పూర్తయింది.

కొత్తగా ఏర్పడనున్న ఈ ఉచిత డిస్కంకు అధికారిక హోదా దక్కాలంటే నియంత్రణ కమిషన్ అనుమతి తప్పనిసరి. ఈ నేపథ్యంలో లైసెన్స్ మంజూరు కోసం అధికారులు గత మార్చి 19వ తేదీన దరఖాస్తు సమర్పించారు. నిబంధనల ప్రకారం నూతన సంస్థ ఏర్పాటుపై ప్రజల నుంచి అభ్యంతరాలు, సూచనలు, సలహాలను నియంత్రణ కమిషన్ ఆహ్వానించింది . ఇందులో భాగంగా మే 29వ తేదీన ఒక బహిరంగ విచారణ కూడా నిర్వహించింది. ఈ విచారణలో వచ్చిన అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని తదుపరి చర్యలకు ఉపక్రమించింది.

ఇందులో భాగంగా రాష్ట్రంలో ప్రస్తుతం విద్యుత్ పంపిణీ బాధ్యతలు చూస్తున్న ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ, దక్షి ణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ల లైసెన్సుల్లో పలు మార్పులు చేయాల్సి ఉంటుంది.

దీని నిమిత్తం వాటి అధికార పరిధిని సవరించడానికి సంబంధించి ప్రజల నుంచి అభిప్రాయాలు కోరుతూ అభ్యంతరాలు, సూచనలు సమర్పించేందుకు గడువు ఈ నెల 22తో ముగిసింది.

ఈ ప్రక్రియలో మొత్తం నాలుగు అభ్యంతరాలు, మరికొన్ని సూచనలు ఈఆర్‌సీకి అందాయి. ప్రస్తుతం అధికారులు వాటిని పరిశీలిస్తున్నారు. ఈ పరిశీలన పూర్తయిన వెంటనే రైతు డిస్కం ఏర్పాటుకు అవసరమైన లైసెన్స్‌ను మంజూరు చేస్తూ ఈఆర్‌సీ తుది ఉత్తర్వులు జారీ చేసే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

లైసెన్స్ మంజూరుతో పాటు ప్రస్తుత డిస్కంల పరిధిలో కీలక మార్పులు జరగనున్నాయి. సాధారణ గృహ, వాణిజ్య, పారిశ్రామిక కనెక్షన్లు మినహాయించి ప్రభుత్వ సబ్సిడీలతో నడిచే పలు కనెక్షన్లను కొత్త సంస్థకు బదిలీ చేస్తారు.

వాటిల్లో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న లక్షలాది వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లతో పాటు భారీ, మధ్యతరహా ఎత్తిపోతల పథకాలకు సంబంధించిన కనెక్షన్లు, ఇంటింటికీ తాగునీరు అందించే మిషన్ భగీరథ ప్రాజెక్టు పంప్‌హౌస్‌లు, ఇతర ప్రభుత్వ, మున్సి పల్ తాగునీటి సరఫరా పథకాల కనెక్షన్లు ఉండనున్నాయి. ఈ కనెక్షన్లన్నింటినీ ప్రస్తుతమున్న రెండు డిస్కంల పరిధి నుంచి పూర్తిగా తొలగించి వాటిని ఉచిత డిస్కం పరిధిలోకి మారుస్తారు. ఔఈ బదలీ ప్రక్రియ అంతా పూర్తి చేసి ఈఆర్‌సీ లైసెన్స్ జారీ చేసిన తదుపరి ఈ కనెక్షన్లకు నిరంతర విద్యుత్ సరఫరా చేసే చట్టబద్ధమైన అధికారం ఈ కొత్త డిస్కంకు లభిస్తుందని అధికారవర్గాలు వెల్లడించాయి.

# డ్రగ్స్ బారినపడి విలువైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దు

### డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క

**హైదరాబాద్ (సూలురాబాద్ ప్రతినిధి), జూన్ 26, ప్రభాతవార్త:** విలువైన జీవితాన్ని డ్రగ్స్ భారినపడిన నాశనం చేసుకోవద్దని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క యువతరానికి సూచించారు. శిల్పకళా వేదికలో నిర్వహించిన ఈగల్ ఫోర్స్ యాంటీ డ్రగ్ అవగాన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తల్లిదండ్రులు తమ పిల్లలను కంటికి రెప్పలా కాపాడుకుంటూ వస్తారని,ఈ ప్రభుత్వం వారిని కాపాడుకోవాలని ప్రయత్నం చేస్తుందన్నారు. సమాజ శ్రేయస్సు కోసం పోలీసులు ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నారన్నారు. తమ జీవితాలను రిస్క్‌లో పెట్టి డ్రగ్స్ ముఠాలను పట్టుకుంటున్నారన్నారు. ఈ కేసుల్లో దొరికితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని తేల్చిచెప్పారు. ఈగల్ ఫోర్స్ సంస్థాపూర్ణంగా పనిచేసేలా అన్ని వసతులు కల్పించామన్నారు. డ్రగ్స్ కట్టడికి ఎలాంటి కఠిన నిర్ణయమైనా తీసుకుంటామన్నారు.డ్రగ్స్ రహిత తెలంగాణలో పుట్టి పెరగటం ఓ బరోసాగా భావించే పరిస్థితులు కల్పిస్తున్నామన్నారు. సమాజంలో పరివర్తన రాకుంటే ఎన్ని చట్టాలు చేసినా ప్రయోజనం శూన్యమన్నారు. సినీనటులు ఇచ్చే సందేశం సమాజంలోనికి బలంగా వెళుతుందని బట్టి విక్రమార్క అన్నారు. కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్,డీజీపీ సీవీ ఆనంద్, సినీనటులు రామ్‌పోతినేని, మీనాక్షి చౌదరి తదితరులు పాల్గొన్నారు.

### రామజన్మభూమి తీర్థట్రస్ట్ అవినీతికి బాధ్యత వహించి

# యుపి సిఎం రాజీనామా చేయాలి

### భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, జూన్ 26, ప్రభాతవార్త:** రామజన్మభూమి తీర్థట్రస్ట్ అవి నీతికి బాధ్యత వహించి ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్య నాథ్ రాజీనామాచేయాలని భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఒక ప్రకనటలో డిమాండ్ చేశారు. అయోధ్య రామ జన్మ భూమి తీర్థ ట్రస్ట్ కు సంబంధించి ఎలాంటి అవినీతి జరగలేదని కార్యదర్శి చంపత్ రాయ్ చెప్పారు కానీ యూపీ సిట్ పోలీసులు చంపత్‌రాయ్ మనుషులను అరెస్టు చేశారనీ చామల ఎద్దేవా చేశారు. దేశవ్యాప్తంగా ప్రజల సెంటి మెంట్‌ను అడ్డం పెట్టుకుని విరాళాలు వసూలుచేసి వాటితో రాజకీయ ప్రయోజనాలు బిజెపి తీర్చుకొందని ఆయన ఆరోపించారు. యూపీ సీఎం పదవికి యోగీ ఆడిత్యనాథ్ రాజీనామా చేయాలనీ ఆయన డిమాండ్ చేశారు. అయోధ్య రామజన్మ భూమి ట్రస్ట్ పేరుతో 200 కోట్లు అవినీతిచేసి వాటిని బెంగాల్‌లో మమతా బెనర్జీ ఎంపీలు 20 మందిని, మహారాష్ట్రలో శివసేన ఉద్ధవ్ థాక్రే ఎంపీలు 6 మందిని ఒక్కొక్కరికి 75 కోట్లు ఇచ్చి బీజేపీ కొనుగోలు చేసిందని ఆరోపించారు.

# అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లకు ప్రమోషన్లు ఇవ్వాలి

### మంత్రి దామోదర రాజనర్సింహాకు టిజిఒ డాక్టర్స్ ఫోరం విజ్ఞప్తి

**హైదరాబాద్, జూన్ 26, ప్రభాతవార్త:** మెడికల్ కాలేజీలు, బోధనా స్పత్రుల్లో పనిచేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లకు ప్రమోషన్లు ఇవ్వాలని తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్(టిజివో) డాక్టర్స్ ఫోరమ్ డిమాండ్ చేసింది. ఈ మేరకు డాక్టర్స్ ఫోరమ్ నేతలు శుక్రవారం వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సి ంహను కలిసి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్(టిజివో) అసోసియేషన్ డాక్టర్స్ ఫోరం ప్రతి నిధులు వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజ నర్సి ంహను కలిసి మూడేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న మెడికల్ అండ్ హెల్త్ ఉద్యో గులకు రిక్వెస్ట్ బదిలీలకు అనుమతి ఇవ్వాలని కోరారు. అలాగే మెడికల్ కాలేజీలు, బోధనాసుపత్రులలో పనిచేస్తున్న ఫ్యాకల్టీ రిటైర్మెంట్ వయస్సు ను పెంచకుండా 65 సంవత్స రాలకే పరిమితం చేయాలని విజ్ఞప్తి చేశారు. దాంతోపాటు అసోసియేట్ ప్రొఫెసర్లకు ప్రొఫెసర్లుగా, అసిస్టెంట్ ప్రొఫెసర్ నుంచి అసోసియేట్ ప్రొఫెసర్స్ గా ప్రమోషన్లను త్వరగా చేపట్టాలని విజ్ఞప్తి చేసినట్టు డాక్టర్స్ ఫోరమ్ అధ్యక్షులు డాక్టర్ కత్తి జనార్ధన్ తెలిపారు. తాము మంత్రి దృష్టికి తీసుకొచ్చిన సమస్యలపై మంత్రి సానుకూలంగా స్పం దించారని ముఖ్యమంత్రితో చర్చించి సానుకూల నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారని డాక్టర్ కత్తి జనార్ధన్ తెలిపారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం జులై 2న కాలేజీల బంద్

### బిసి జెఎసి చైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్

**హైదరాబాద్, జూన్ 26, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్ మెంట్ పథకాన్ని రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కుట్ర చేస్తుందని బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు. ప్రభుత్వం చేయాలనుకున్న పనిని కోర్టుల ద్వారా చేపిస్తుందని మండిపడ్డారు. ఫీజు రీయింబర్స్ మెంట్‌ను రద్దు చేయాలని కుట్రలకు నిరసనగా జూలై 2న రాష్ట్రవ్యాప్తంగా కాలేజీల బంద్‌ను చేపట్టనున్నట్టు తెలిపారు. పథకం పకడ్బందీగా అమలు చేయడం కోసం జూలై 15న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బీసీ భవన్‌లో బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ వెరిక సురేష్ ఆధ్వర్యంలో బిసి విద్యార్థి, యువజన సంఘాల విస్తృతస్థాయి సమావేశం జరిగింది. సమావేశం అనంతరం జరిగిన మీడియా సమావేశంలో జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్ మెంట్‌పై గురువారం రాష్ట్ర హైకోర్టు విద్యార్థుల నుంచి ఫీజులను కళాశాలలు వసూలు చేసుకోవచ్చని మద్యంతర ఉత్తర్వులు ఇచ్చిందని, విద్యార్థులకు వ్యతిరేకంగా కోర్టు తీర్పులు రావడానికి ప్రధాన కారణం రాష్ట్ర ప్రభుత్వమేనని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని రద్దు చేయాలని గత రెండు సంవత్స రాలుగా కుట్ర చేస్తుందని, అందులో భాగంగానే రూ. 7000 కోట్ల ఫీజుల బకాయిలు చెల్లించకుండా నాన్చివేత దోరణి అవలంబిస్తుందన్నారు. ఫీజు బకాయిలు ప్రభుత్వం చెల్లించకపోవడంతో అనివార్యంగా కాలేజీ యజమాన్యాలు కోర్టుల్లో కేసులు వేశారని, కోర్టుల్లో ప్రభుత్వం తరఫున బలమైన వాదనలు వినిపించాల్సి ఉన్నప్పటికీ “రోగి కోరుకున్నది, డాక్టర్ ఇచ్చిన మందు అదే“ అన్నట్టు ప్రభుత్వం చేయాలనుకున్న రద్దును కోర్టు తీర్పుల ద్వారా పరోక్షంగా చేపిస్తుందని జాజుల మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం తల తోక లేకుండా విద్యార్థి వ్యతిరేక భావంతో జీవో నెంబర్ 7, 8, 9 లను తీసుకువచ్చి రాష్ట్రంలోని లక్షలాది మంది విద్యార్థులను తీవ్ర గందరగోళానికి గురి చేసిందన్నారు.

# మధ్యప్రాచ్యంలో మరో కొత్త యుద్ధం?

## లెబనాన్ రక్షణకే ఇరాన్ అత్యంత ప్రాధాన్యం



**టెహ్రాన్, బీరూట్, జూన్ 26:** మధ్య ప్రాచ్యంలో నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతలకు లెబనాన్, ముఖ్యంగా ఇజ్రాయెల్ సరిహద్దును ఆనుకుని ఉన్న ఆ దేశ దక్షిణ ప్రాంతం ఎప్పుడూ ప్రధాన కేంద్రంగా ఉంటూ వస్తోంది. ఇరాన్ మద్దతు ఉన్న బలమైన సాయుధ సంస్థ హెజ్బొల్లా ఇక్కడ క్రియాశీలకంగా పనిచేస్తోంది. ఇజ్రాయెల్, హిజ్బుల్లా బలగాల మధ్య నిరంతరం ఘర్షణలు జరుగుతూనే ఉన్నాయి. ప్రస్తుతం 2026లోనూ ఇక్కడి పరిస్థితి అత్యంత ఆందోళనకరంగా మారింది. దక్షిణ లెబనాన్ ప్రాంతం నుంచి తమ సైన్యం వెనక్కి వెళ్లాలంటే హెజ్బొల్లా తన ఆయుధాలను పూర్తిగా వదిలిపెట్టాలనేది ఇజ్రాయెల్ ప్రధాన డిమాండ్. ఇందుకు భిన్నంగా మొదట ఇజ్రాయెల్ తన సైన్యాన్ని పూర్తిగా ఉపసంహరించుకుని, దాడులను ఆపాలని ఇరాన్ పట్టుబడుతోంది. ఇరు పక్షాల మధ్య నడుస్తున్న ఈ పంతాలు మిడిల్ ఈస్ట్‌లో మరో భీకర యుద్ధానికి స్క్రిప్ట్ రాస్తున్నాయి.తమ దేశ భద్రతకు హిజ్బుల్లానే అతిపెద్ద ముప్పు అని ఇజ్రాయెల్ బలంగా నమ్ముతోంది. ఇజ్రాయెల్ నగరాలను లక్ష్యంగా చేసుకోగల వేలాది రాకెట్లు, అధునాతన ఆయుధాలు హెజ్బొల్లా వద్ద ఉన్నాయి. అందుకే తమ దేశ సరిహద్దులను రక్షించుకోవడానికి దక్షిణ లెబనాన్‌లో ఒక సెక్యూరిటీ జోన్ (భద్రతా వలయం) కొనసాగించడం అవసరమని ఇజ్రాయెల్ ప్రధాని, రక్షణ మంత్రి స్పష్టం చేస్తున్నారు. గతంలో జరిగిన ఒప్పందాల ప్రకారం హెజ్బొల్లా ఆయుధాలను వీడాల్సి ఉన్నా, ఆ మాట నిలబెట్టుకోలేదని, ఇప్పుడు వారిని నమ్మే పరిస్థితి లేదని ఇజ్రాయెల్ వాదిస్తోంది. హెజ్బొల్లా ఉనికి లెబనాన్ సార్వభౌమాధికారాన్ని కూడా బలహీనపరుస్తోందని, ఒకవేళ హెజ్బొల్లా మళ్లీ దాడులకు తెగబడితే తాము భారీ స్థాయిలో ఎదురుదాడికి సిద్ధమని ఇజ్రాయెల్ హెచ్చరిస్తోంది. లెబనాన్ ప్రభుత్వం ఆర్థిక సంక్షోభం, రాజకీయ అస్థిరత, అంతర్గత విభేదాలతో చాలా బలహీనంగా ఉంది. దేశ రాజకీయాల్లోనూహెజ్బొల్లా ప్రభావం ఎక్కువగా ఉండటం వల్ల, ఇజ్రాయెల్ వెనక్కి తగ్గకపోతే హెజ్బొల్లా మద్దతుదారుల్లో ఆగ్రహం పెరిగి కొత్త యుద్ధానికి దారితీసే ప్రమాదం ఉంది. లెబనాన్ సైన్యం దక్షిణ సరిహద్దుల్లో మోహరించినప్పటికీ, హెజ్బొల్లా సైనిక శక్తి ముందు దాని పాత్ర పరిమితంగానే కనిపిస్తోంది. హెజ్బొల్లాకు ప్రధాన అండగా నిలుస్తున్న ఇరాన్ ఆ సంస్థకు భారీగా ఆయుధాలు, నిధులు, సైనిక శిక్షణను అందిస్తోంది. ఇజ్రాయెల్ మొదట లెబనాన్ నుంచి పూర్తిగా తప్పుకోవాలని, లేదంటే తాము కూడా రంగంలోకి దిగాల్సి వస్తుందని ఇరాన్ హెచ్చరిస్తోంది. ఇరాన్‌ఇజ్రాయెల్ మధ్య చాలా కాలంగా నడుస్తున్న ఈ పరోక్ష యుద్ధంలో లెబనాన్ కేవలం ఒక వేదిక మాత్రమే. ఈ ప్రాంతం అంతటా తన ప్రభావాన్ని విస్తరించుకోవాలని ఇరాన్ భావిస్తోంది. భవిష్యత్తులో జరిగే ఏ శాంతి ఒప్పందమైనా లెబనాన్ ప్రయోజనాలను కాపాడేదిగా ఉండాలని ఇరాన్ పట్టుబట్టడం వల్ల అమెరికా, ఇజ్రాయెల్‌లతో దౌత్యపరమైన ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. చర్చలు విఫలమైతే యుద్ధం ఏ విధంగా సాగుతుందో విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. మొదట సరిహద్దుల్లో చిన్న చిన్న ఘర్షణలతో ప్రారంభమై.. హిజ్బుల్లా రాకెట్ దాడులు, ఇజ్రాయెల్ వైమానిక దాడులతో ఇది ఉధృతం కావచ్చు. ఇజ్రాయెల్ సైన్యం దక్షిణ లెబనాన్ లోపలికి దూసుకువెళ్లే అవకాశం ఉంది. ఈ క్రమంలో ఇరాన్ తన మద్దతును మరింత పెంచడం ద్వారా ఇతర ప్రాంతాల నుంచి కూడా ఇజ్రాయెల్‌పై ఒత్తిడి తెచ్చే ప్రయత్నం చేస్తుంది. దీనివల్ల లెబనాన్‌లో భారీ విధ్వంసం జరిగి, వేలాది మంది ప్రాణాలు కోల్పోవడమే కాకుండా లక్షలాది మంది నిరాశ్రయులవుతారు.

యుద్ధ నిర్వహణ భారంతో ఇజ్రాయెల్ ఆర్థిక వ్యవస్థ కూడా దెబ్బతింటుంది. ప్రపంచవ్యాప్తంగా చమురు ధరలు పెరిగి అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థపై భారం పడుతుంది. ఇప్పటికే లక్షలాది మంది శరణార్థులతో సతమతమవుతున్న లెబనాన్‌లో ఆకలి, వ్యాధులు, నివాసాలు కోల్పోవడం వంటి మానవీయ సంక్షోభం మరింత తీవ్రమవుతుంది. లెబనాన్ ప్రభుత్వం తన దేశ భూభాగంపై పూర్తి నియంత్రణ సాధించేలా బలోపేతం కావాలి.

## మాజీమంత్రి ముద్రగడకు తీవ్రఅస్వస్థత

### హైటెక్‌సిటీలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స



**హైదరాబాద్ (శేరిలింగంపల్లి), జూన్ 26, ప్రభాతవార్త:** మాజీ మంత్రి, కాపునేత ముద్రగడ పద్మనాభం తీవ్ర అనారోగ్యంతో నగరంలోని హైటెక్‌సిటీలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కిడ్నీ సంబంధిత సమస్యల కారణంగా ఆయనను ఆసుపత్రిలో చేర్పించారు. ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణలో ముద్రగడకు చికిత్స కొనసాగుతుంది. ముద్రగడ అనారోగ్యం గురించి తెలుసుకున్న వైఎస్ఆర్ సీపీ సీనియర్ నేతలు, మండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ,ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు శుక్రవారం ఆసుపత్రికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా ఇద్దరు నాయకులు ముద్రగడ పద్మనాభం ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆయనకు అందుకున్న వైద్యసేవలను, ఆరోగ్యం మెరుగుపడుతున్న తీరును అక్కడి వైద్యనిపుణులను ఆరాతీశారు. ముద్రగడ త్వరగా కోలుకోవాలని వారు ఆకాంక్షించారు.ఇప్పటికే వైఎస్ఆర్‌సీపీ అధినేత మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ ముఖ్యనేతలు సజ్జల రామకృష్ణారెడ్డి తదితరులు కూడా ఆసుపత్రికి వెళ్లి ముద్రగడను పరామర్శించారు.

## ఆర్ఎస్ ప్రవీణ్ హత్యకు ప్రభుత్వం కుట్ర పన్నుతోంది: శ్రీనివాస్‌గౌడ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 26:** బీఆర్ఎస్ నేత, మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ను హతమార్చడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పన్నుతోందంటూ మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ సంచలన ఆరోపణలు చేశారు. ప్రవీణ్ కుమార్‌కు ఉన్న భద్రతను కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే తగ్గించిందని ఆందోళన వ్యక్తం చేశారు. 'ఆయనకు భద్రతను పూర్తిగా తొలగించాలని లేదా కుదించాలని ఇంటెలిజెన్స్ ఏమైనా నివేదిక ఇచ్చిందా? ఒకవేళ ఇస్తే ఆ నివేదికను ప్రభుత్వం ఎందుకు దాస్తోంది? తక్షణమే పబ్లిక్ డొమైన్ లో పెట్టాలి' అని డిమాండ్ చేశారు. ప్రవీణ్ కుమార్‌కు ఏదైనా జరిగితే కాంగ్రెస్ ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.



చార్మినార్ వద్ద దట్టీలు సమర్పిస్తున్న నగర పోలీస్ కమిషనర్ వి.సి.సజ్జనార్

## మొహర్రం ఊరేగింపు.. పాతబస్తీలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు

**హైదరాబాద్ (చార్మినార్), జూన్ 26, ప్రభాతవార్త :** హైదరాబాద్ పాతబస్తీలో షియా ముస్లింలు శు క్రవారం 10వ మొహ ర్రం సామూహిక ఊరేగింపును నిర్వహించారు.పాతనగరంలో జరిగిన మొహర్రం ఊరేగింపు సందర్భంగా చార్మినార్ జోన్ పోలీసులు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.డబీర్‌పుర బీబీకాఅలావాకు చెందిన బీబీకా ఆలంతో షియా ముస్లింలు ఊరేగి ంపులో పాల్గొన్నారు.ఊరేగింపులో పాల్గొన్న షియా ముస్లింలు శరీరంపై బాదుకుంటూ విషాద గీతాలతో రక్తాన్ని చిందించారు.శు క్రవారం మధ్యాహ్నం అంబారిపై ఆలంను ప్రతిష్టించిన అనంతరం ఊరేగింపు చారిత్రాత్మక బీబీకాఆలం నుంచి ప్రారంభం అయ్యింది.డబీర్‌పురలోని బీబీకాఅలవా నుంచి ప్రారంభమై ఊరేగింపు పాతబస్తీలోని ఎత్తెబార్‌చౌక్,కోట్ల అలీజా,సర్దార్ మహల్, చార్ కమాన్, గుల్జారాహౌస్,ఫంజేషా, ఎత్తెబార్‌చౌక్, మీరాలంమండి, దారుషిఫా, అజాఖానాజహరా ప్రాంతాలు మీదుగా చాదర్‌ఘాట్ వరకు కొనసాగింది.చార్మినార్ జోన్ పోలీసులు ఎటువంటి అవాంఛనీయసంఘటనలు చోటు జరగకుండ పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

మాజీ గవర్నర్,మాజీ కేంద్రమంత్రి బండారు దత్తాత్రేయ,సీనియర్ బిజెపి నాయకులు జి.హనుమంతరావు,మీర్ ఫిరాసత్ అలీ బాక్రీలు దట్టీలు సమర్పించారు.నగర పోలీస్ కమిషనర్ వి.సి.సజ్జనర్ పాతబస్తీలో పర్యటించి శాంతి భద్రతలను పర్యవేక్షించారు. చార్మినార్ వద్ద హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వి.సి.సజ్జనార్ చార్మినార్ వద్ద బీబీకాఆలంకు దట్టిలు సమర్పించారు.ఈ సందర్బంగా నగర పోలీస్ కమిషనర్ వి.సి.సజ్జనర్ మాట్లాడుతూ మొహర్రం ఊరేగింపు ప్రశాంతమైన వాతావరణంలో కొనసాగిందని,దాదాపు రెండు వేల మంది పోలీసులు మొహర్రం ఊరేగింపు బందోబస్తులో పాల్గొన్నారని తెలిపారు. కాగా ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలగకుండ వాహనాలను వేరే ప్రాంతాలు మీదుగా మళ్లించారు. విద్యుత్, వాటర్ వర్క్స్, జిహెచ్ఎంసి,పోలీస్ శాఖలకు చెందిన అధికారులు పాత బస్తీలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండ అన్ని ఏర్పాట్లు చేశారు.నగర అడిషనల్ సిపి క్రైమ్స్ ఎం.శ్రీనివాస్,జాయింట్ సిపి ట్రాఫిక్ జోయల్ డేవిస్, చార్మినార్ జోన్ డిసిపి కిరణ్ ఖరే ప్రభాకర్,సిఎఆర్ హెడ్ క్వార్టర్స్ డిసిపి వెంకటేశ్వర్లుతో పాటు పలువురు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# దేశంలో మొదటి హైడ్రోజెన్ రైలు సిద్ధం

## జింద్ సోనిపట్ మార్గంలో రాకపోకలకు రెడీ

**న్యూఢిల్లీ, జూన్ 26:** భారతీయ రైల్వే తన మొట్టమొదటి హైడ్రోజన్ రైలును సిద్ధంచేసింది. ఈ రైలు హర్యానాలోని నార్తర్న్ రైల్వే పరిధిలోని జింద్ సోనిపట్ మార్గంలో నడుస్తుంది. బ్రాడ్ గేజ్ నెట్వర్క్‌పై నడవబోతున్న ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన, పొడవైన హైడ్రోజన్ రైలుగా దీనిని అభివర్ణిస్తున్నారు. ప్రపంచంలో ప్రస్తుతం జర్మనీ, జపాన్, చైనా, అమెరికా వంటి దేశాల వద్దే హైడ్రోజన్ రైలు ఉంది. ఇప్పుడు ఈ జాబితాలో భారత్ కూడా చేరుతోంది. ఈ రైలులో 10 కోచ్‌లు ఉంటాయి. రెండు డ్రైవింగ్ పవర్ కార్లలో ఒక్కోదానికి 1200 కిలోమీట్ల సామర్థం కలిగిన హైడ్రోజన్ ఫ్యూయ్ల్ సెల్ వ్యవస్థ ఉంటుంది. మొత్తం దీని ఇంధనశక్తి 2400 కిలోవాట్లు. దీని కమర్షియల్ స్పీడ్ గంటకు 75 కిలోమీటర్లు. ట్రయల్ సమయంలో ఇది గంటకు 120 కి.మీ వేగంతో నడిచింది. ఒక్కసారి హైడ్రోజన్ నింపితే సుమారు 250 కిలో మీటర్లు ప్రయాణం చేస్తుంది. ప్రత్యేకంగా హైడ్రో జన్ సిలిండర్లు, బ్యాట రీలు, కంట్రోల్ సిస్టమ్ కోసం ప్రత్యేక భాగాలు ఉన్నాయి. డీజిల్, ఎలక్ట్రిక్ లోకో మోటివ్ లతో పోలిస్తే హైడ్రోజన్ రైలు వల్ల కాలుష్యం తక్కువ. ఈ



రైలులో హైడ్రోజన్, ఆక్సిజన్ మధ్య జరిగే రసాయన చర్య ద్వారా విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. ఈ ప్రక్రియలో నీటి ఆవిరి, స్వల్పంగా వేడి మాత్రమే విడుదలవుతుంది. కార్బన్ ఉద్గారాలు ఉండవు. రైలు ముందు భాగంలో 27, వెనక భాగంలో 27 హైడ్రోజన్ సిలిండర్లు ఏర్పాటు చేశారు. స్వదేశీ సాంకేతికతతో హైడ్రోజన్ నిల్వ, రీఫ్యూయలింగ్ కేంద్రాన్ని జిందలో నిర్మించారు. ఈ రైలులో భద్రతకు పెద్ద పీట వేశారు. హైడ్రోజన్ లీక్ డిటెక్టర్లు, ఫ్లేమ్ డిటెక్టర్లు, భద్రతా సెన్సార్లు ఏర్పాటు చేశారు. ఆత్మ నిర్భర భారత్ ప్రోగ్రాంలో భాగంగా దీనిని పూర్తిగా భారత్‌లోనే రూపొందించారు. రిసెర్చ్ డిజైన్స్ అండ్ స్టాండర్డ్స్ ఆర్గనైజేషన్, లక్నో డిజైన్ అందించగా,చెన్నై ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీలో తయారు చేశారు. ప్రస్తుతం భారత్‌లోని రైల్వే బ్రాడ్ గేజ్ నెట్వర్క్‌లో 92 శాతం విద్యుదీకరణ పూర్తయింది. దీని వల్ల ఈ మార్గాల్లో హైడ్రోజన్ రైలును నడిపితే ప్రయోజనం ఉండదు. విద్యుత్ లైన్లు వేయడం కష్టమైన ప్రాంతాలు, హెరిటేజ్ రైల్వే మార్గాల్లో వీటిని ఉపయోగించాలని రైల్వే శాఖ భావిస్తోంది.

# కొండాపూర్ ఫ్లైఓవర్‌పై ఘోరప్రమాదం

## రెండు ద్విచక్రవాహనాలు ఢీ

### ఇద్దరు మృతి - మరో ఐటి ఉద్యోగికి తీవ్రగాయాలు



కేతావత్ విఠల్(ఫైల్),



బానోతు శ్రీకాంత్(ఫైల్)

**హైదరాబాద్ (గచ్చిబౌలి), జూన్ 26, ప్రభాతవార్త:** కొండాపూర్ ఫ్లైఓవర్‌పై శుక్ర వారం తెల్లవారు జామున ఘోరప్రమాదం చోటుచేసుకుంది. స్కూటీ వాహనం మీద రాంగ్‌టైమ్‌లో రాంగ్‌రూట్‌లో ఫ్లైఓవర్ ఎక్కిన ఇద్దరు.. ఎదురుగా వచ్చిన బుల్లెట్ వాహనాన్ని ఢీకొట్టడ ంతో తీవ్రగాయాలతో అక్కడికక్కడే మ ృతి చెందారు. బుల్లెట్ వాహనం మీద ప్రయాణిస్తున్న ఐటీ ఉద్యోగిసైతం తీవ్ర గాయాలతో అపస్మారకస్థితిలో ఆస్పత్రిలో చికిత్స పొందుతునా ్నదు. నిర్మాణ లోపంతో వన్‌వేగా నిర్మించిన కొండాపూర్ ఫ్లైఓవర్‌పై రోజులో కొంత సమయం టూవేగా తెరిచి ఉంచడం, మిగిలిన సమయంలో వన్‌వేగా మార్చడం కొత్తగా వచ్చేవారిని తికమకపడేలా చేస్తుండగా, తెల్లవారుజామునే రాంగ్‌రూట్‌లో ఫ్లైఓవర్ ఎక్కిన ఇద్దరు ప్రాణాలు కోల్పోవడం విషాదాన్ని నింపింది. గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలు పోలీసుల కథనం ప్రకారం.. పటాన్‌చెరు మండల పరిధిలోని ఇంద్రేశంలో నివాసం ఉండే కేతావత్ విఠల్(38) పటాన్‌చెరులో ఉన్న ఓ చికెన్ షాపులో పనిచేస్తున్నాడు. ఇదే గ్రామానికి చెందిన విఠల్ బంధువు బానోతు శ్రీకాంత్(17)సైతం అదే చికెన్ షాపులో పనిచేస్తున్నాడు. కాగా శుక్రవారం హైటెక్‌సిటీ, గచ్చిబౌలి ప్రాంతాల్లో చికెన్ డెలివరీ ఉండడంతో ఇద్దరు ఉదయం స్కూటీ వాహనంపై చికెన్ తీసుకొని పటాన్‌చెరు నుంచి బయలుదేరారు. ఉదయం 7 గంటల ప్రాంతంలో కొండాపూర్ ఆర్‌టీఏ కార్యాలయం వద్ద రాంగ్‌రూట్‌లో కొండాపూర్ ఫ్లైఓవర్ ఎక్కి గచ్చిబౌలివైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో ఫ్లైఓవర్‌పై ఎఎంబి మాల్ సమీపంలోకి రాగానే, నైట్‌డ్యూటీ ముగించుకొని రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్ బైక్‌పై ఫ్లైఓవర్ మీదుగా గచ్చిబౌలివైపు నుంచి హైటెక్‌సిటీ వెళ్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి వినోద్ కుమార్(24) వాహనాన్ని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో రెండు వాహనాలు వేగంగా ఉండడంతో స్కూటీమీద వెళ్తున్న విఠల్, శ్రీకాంత్‌లు ఎగిరి రోడ్డు మీదపడి తీ వ్రగాయాలతో ఘటనాస్థలంలోనే మ ృతి చెందారు. బుల్లెట్ మీద వెళ్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్ యోగి వినోద్‌కుమార్‌కు సైతం తీవ్రగాయాల య్యాయి. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న గచ్చిబౌలి పోలీసులు సంఘటనాస్థలికి చేరుకొని విఠల్, శ్రీకాంత్ మ ృతదేహాలను పోస్టుమార్టం నిమి త్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన వినోద ్‌కుమార్‌ను ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, అసస్మారకస్థితిలో చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## ఆహారభద్రతా ప్రమాణాల నిబంధనలకు సవరణలు

### ఎఫ్ఎస్ఎస్ఎఐ కీలక నోటిఫికేషన్

**న్యూఢిల్లీ, జూన్ 26:** ఆహార వ్యాపార రంగంలో నిబంధనల భారాన్ని తగ్గించి, వ్యాపార సౌలభ్యాన్ని పెంచే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆహార భద్రత, ప్రమాణాల నిబంధనలు 2011కు సవరణలు చేస్తూ కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ మార్పుల ద్వారా ఆహార పదార్థాలను తయారు చేయని వ్యాపార సంస్థలకు కొన్ని ప్రధాన నిబంధనల నుంచి మినహాయింపు లభించింది. తాజా సవరణల ప్రకారం స్టాక్ రొటేషన్, రికార్డుల నిర్వహణ వంటి నిబంధనలు ఇకపై కేవలం ఆహార పదార్థాలను తయారు చేసే సంస్థలకు మాత్రమే వర్తిస్తాయి. గతంలో లైసెన్స్ పొందిన అన్ని ఆహార వ్యాపార సంస్థలు తప్పనిసరిగా రికార్డులను నిర్వహించడంతో పాటు ఫస్ట్ ఇన్, ఫస్ట్ అవుట (ఎఫ్ఐఎఫ్ఓ) లేదా ఫస్ట్ ఎక్స్‌పైరీ, ఫస్ట్ అవుట్ (ఎఫ్ఈఎఫ్ఓ) పద్ధతులను పాటించాల్సి ఉండేది. ఇప్పుడు రిటైలర్లు, ఇతర అనుబంధ వ్యాపార సంస్థలకు ఈ నిబంధనల నుంచి ఉపశమనం కల్పించారు. ఆహార భద్రత, నాణ్యత, ఉత్పత్తుల ట్రేసబిలిటీ వంటి అంశాల దృష్ట్యా తయారీ రంగంలో ఈ నిబంధనలు అత్యవసరం కాబట్టి, వాటికి కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మార్పుల వల్ల ముఖ్యంగా చిన్న, మధ్య తరహా వ్యాపారాలపై నిబంధనల భారం గణనీయంగా తగ్గుతుందని, వారి కార్యకలాపాలు సులభతరం అవుతాయని మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది.




## వారణాసి ఎయిర్‌పోర్టులో ఈజీ కనెక్ట్‌ను ప్రారంభించిన కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు

**వారణాసి,జూన్ 26:** టైర్2, టైర్3 నగరాల నుంచి అంతర్జాతీయ ప్రయాణాలు చేసే వారికి కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. విదేశాలకు వెళ్లే ప్రయాణికుల కోసం నూతన విధానంలో భాగంగా ఈజీ కనెక్ట్ విమాన సేవలను ప్రారంభించింది. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు శుక్రవారం వారణాసిలోని లాల్ బహదూర్ శాస్త్రి అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి తొలి సర్వీస్‌ను లాంఛనంగా ప్రారంభించారు. ఈ కొత్త విధానంతో ఇకపై చిన్న నగరాల నుంచి విదేశాలకు వెళ్లే ప్రయాణికులు తాము బయలుదేరే విమానాశ్రయంలోనే చెక్‌ఇన్, ఇమ్మిగ్రేషన్, కస్టమ్స్ వంటి లాంఛనాలన్నీ పూర్తి చేసుకోవచ్చు. వారణాసిలో అంతర్జాతీయ ప్రయాణం మొదలుపెట్టే వారు అక్కడే అన్ని ఫార్మాలిటీస్ పూర్తి చేసి, దేశీయ విమానంలో ఢిల్లీ వంటి ఇంటర్నేషనల్ హబ్ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి ఎలాంటి తనిఖీలు లేకుండా నేరుగా అంతర్జాతీయ విమానం ఎక్కవచ్చు. ఈ సందర్భంగా మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ విమాన ప్రయాణాన్ని అందరికీ అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, భారత విమానయాన రంగాన్ని ప్రపంచంలోనే పోటీపడేలా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.

## ఫిలిప్పీన్స్‌లో మరోసారి భారీ భూకంపం

### రిక్టర్ స్కేలుపై 6.5 తీవ్రత నమోదు

**మనీలా,జూన్ 26:** ఫిలిప్పీన్స్ దక్షిణ తీరంలో శుక్రవారం సాయంత్రం మరోసారి భారీ భూకంపం సంభవించింది. అమెరికా భూగర్భ సర్వే సంస్థ వెల్లడించిన వివరాల ప్రకారం రిక్టర్ స్కేలుపై ఈ భూకంప తీవ్రత 6.5గా నమోదయింది. తొలుత 6.7గా ప్రకటించిన తీవ్రతను అనంతరం 6.5గా సవరించారు.స్థానిక కాలమానం ప్రకారం సాయంత్రం 7 గంటల 42 నిమిషాలకు సంభవించిన ఈ భూకంప కేంద్రం మిండనావో ద్వీపంలోని జోస్ అబాద్ సాంటోస్ పట్టణానికి నైరుతి దిశగా సుమారు 35 కిలోమీటర్ల దూరంలో, 52.4 కిలోమీటర్ల లోతులో ఉన్నట్లు యూఎస్‌జీఎస్ తెలిపింది. ఈ భూకంపం అనంతరం సునామీ హెచ్చరికలు జారీ చేయలేదు.

# మార్కెట్ యార్డుల్లో బ్రేక్‌ఫాస్ట్ కోసం సెంట్రలైజ్డ్ కిచెన్లు!

## రాష్ట్రవ్యాప్తంగా 39 ప్రాంతాల్లో ఏర్పాటు

## విడతల వారీగా స్కూళ్లు, జూనియర్ కాలేజీల్లో అమలు

## గవర్నమెంట్ జూనియర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజనం కూడా

## 26,561 విద్యాసంస్థల్లో 20.29 లక్షల మందికి బ్రేక్‌ఫాస్ట్

**హైదరాబాద్, జూన్ 26, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ స్కూల్స్‌తోపాటు, జూనియర్ కాలేజీల్లోనూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అల్పాహారం(బ్రేక్‌పాస్ట్) పథకాన్ని అమలు చేస్తున్న విషయం తెలిసిందే. దీంతోపాటు గవర్నమెంట్ జూనియర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజనాన్ని కూడా ఇదే సంవత్సరం నుంచి ప్రారంభించనుంది. ఈ రెండింటిని అమలు చేయడానికి సెంట్రలైజ్డ్ కిచెన్లను ఏర్పాటు చేయనుంది. సెంట్రలైజ్డ్ కిచెన్ల ఏర్పాటుకు సంబంధించి ఈ పథకాన్ని అమలు చేయడం కోసం టెండర్లు దక్కించుకున్న సంస్థలు వీటిని ఏర్పాటు చేయనున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 39 ప్రాంతాల్లో సెంట్రలైజ్డ్ కిచెన్లను ఏర్పాటు చేసి వాటి ద్వారా విద్యార్థులకు ఉదయం స్కూల్, కాలేజీ విద్యార్థులకు బ్రేక్‌పాస్ట్‌ను పాలను అందించనుండగా.. మధ్యాహ్నం జూనియర్ కాలేజీ విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని అందించనున్నారు. సెంట్రలైజ్డ్ కిచెన్లను మార్కెట్ యార్డుల్లో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మార్కెట్ యార్డుల్లో సెంట్రలైజ్డ్ కిచెన్ల ఏర్పాటుకు రూ. 299.90కోట్లను ఖర్చు చేయనున్నారు. అందులో 70 శాతం నిధులు ప్రభుత్వం ఖర్చు చేయనుండగా, టెండర్ దక్కించుకున్న ఎన్‌జీవో సంస్థ మిగిలిన 30 శాతం నిధులను ఖర్చు చేయనుంది. కొత్తగా ఏర్పాటు చేసే వాటికి మాత్రమే ప్రభుత్వం నిధులను ఇస్తుంది. ఇప్పటికే కిచెన్స్ ఉంటే వాటి అప్‌గ్రేడేషన్‌ను ఎన్‌జీవోనే చూసుకోవల్సి ఉంటుంది. రాష్ట్ర వ్యాప్తంగా 26,561 విద్యా సంస్థల్లో 2029 లక్షల మంది విద్యార్థులకు ఉదయం బ్రేక్‌పాస్ట్ అందించనుంది. అలాగే రాష్ట్రంలోని 430 ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చదువుతున్న సుమారు 2 లక్షల మందికి ఈ సెంట్రలైజ్డ్ కిచెన్ల ద్వారానే మధ్యాహ్న భోజనాన్ని అందించనున్నారు. రాష్ట్రంలోని 26,561 విద్యాసంస్థల్లో బ్రేక్‌పాస్ట్‌ను, గవర్నమెంట్ జూనియర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజనాన్ని విడతల వారీగా ప్రారంభించనున్నారు. పాఠశాలలు ప్రారంభమైన జూన్ 15 నుంచి కొన్నిచోట్ల ప్రారంభించారు. విడతల వారీగా అక్టోబర్, నవంబర్ నాటికి రాష్ట్రం మొత్తం ఈ పథకాన్ని అమలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. మొదటి విడతలో 1269 స్కూల్స్‌లో 1,30,185 మంది విద్యార్థులకు బ్రేక్‌పాస్ట్‌ను అందించనున్నారు. 1269 స్కూల్స్‌లో హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లో 107 స్కూల్స్ ఉండగా వాటిలో 26,294 మంది విద్యార్థులు బ్రేక్‌పాస్ట్ పథకంలో పాలుపంచుకోబోతున్నారు. రాష్ట్రంలోని 33 ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో 14,425 మంది విద్యార్థులకు ఈ పథకం అమలు చేయనున్నారు. మొదటి విడతలో రాష్ట్రంలోని 1269 స్కూల్స్, 33 ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లోని 1,44,610 మంది విద్యార్థులకు బ్రేక్‌పాస్ట్ అందించనుండగా, 14,425 మంది గవర్నమెంట్ జూనియర్ కాలేజీ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించనున్నారు.

**26,561 విద్యాసంస్థలు..**
**20.29 లక్షల మంది విద్యార్థులు..**

33 జిల్లాల్లోని 26,561 ప్రభుత్వ స్కూల్స్, జూనియర్ కాలేజీల్లో 20.29 లక్షల మంది విద్యార్థులకు ఉదయం బ్రేక్‌పాస్ట్‌ను అందించాలని నిర్ణయించారు. వారిలో 436 ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చదువుతున్న సుమారు 1.86 లక్షల మంది విద్యార్థులకు ఉదయం బ్రేక్‌పాస్ట్‌తోపాటు, మధ్యాహ్న భోజనం కూడా అందించనున్నారు. పాఠశాల విద్యార్థులకు బ్రేకపాస్ట్, జూనియర్ కాలేజీ విద్యార్థులకు బ్రేక్‌పాస్ట్, మధ్యాహ్న భోజనం పథకం అమలు చేయడం కోసం రాష్ట్ర ప్రభుత్వం టీజీఈడబ్ల్యూఐడీసీ ద్వారా టెండర్లను పిలిచింది. టెండర్ల నోటిఫికేషన్‌లో రాష్ట్రంలోని 33 జిల్లాల్లో 26,561 విద్యా సంస్థల్లో 20.29 లక్షల మంది విద్యార్థులకు బ్రేక్‌పాస్ట్‌తోపాటు ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అమలుకు టెండర్లను ఖరారు చేశారు. రెండు సంస్థలు టెండర్లను దక్కించుకున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 39 సెంట్రలైజ్డ్ కిచెన్లను ఏర్పాటు చేయాలని టెండర్లలో స్పష్టం చేశారు. 39 సెంట్రలైజ్డ్ కిచెన్ల ద్వారానే విద్యార్థులకు ఉదయం బ్రేక్‌పాస్ట్‌ను, పాలను అందించనున్నారు. అలాగే గవర్నమెంట్ జూనియర్ కాలేజీ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించనున్నారు. 39 సెంట్రలైజ్ కిచెన్లలో 15వేల మంది నుంచి లక్ష మందికంటే ఎక్కువ విద్యార్థులకు ఒకేసారి భోజనం, బ్రేక్‌పాస్ట్ అందించేలాగా ఏర్పాటు చేస్తున్నారు. 50వేల మందికంటే ఎక్కువగా బ్రేక్‌పాస్ట్, మధ్యాహ్న భోజనాన్ని 6 సెంట్రలైజ్డ్ కిచెన్ల నుంచి అందించాల్సి ఉంటుంది. వాటిల్లో యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మార్కెట్ యార్డులో 80వేల మందికి, రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ మార్కెట్ యార్డులో 80వేల మందికి, సిద్దిపేట జిల్లా సిద్దిపేట మార్కెట్ యార్డులో 90వేల మందికి, నిజామాబాద్ జిల్లా నిజామాబాద్ మార్కెట్ యార్డులో లక్ష మందికి, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా షామీర్‌పేట్ ప్రైవేట్ ల్యాండ్‌లోని కిచెన్‌లో 90వేల మందికి, హైదరాబాద్ జిల్లా ఉప్పల్–2లోని ప్రైవేట్‌ల్యాండ్‌లోని కిచెన్‌లో 1.40 లక్షల మందికి, సంగారెడ్డి జిల్లా, కంది విలేజ్‌లో ఇప్పటికే ఉన్న కిచెన్ నుండి లక్ష మందికి బ్రేక్‌పాస్ట్‌ను, మధ్యాహ్న భోజనాన్ని అందించడానికి సెంట్రలైజ్డ్ కిచెన్లను ఏర్పాటు చేయ నున్నారు. 25నుంచి 50 వేల మందికి బ్రేక్‌పాస్ట్, మధ్యాహ్న భోజనాన్ని అందించాల్సిన కిచెన్లు 20 ఉండగా, 15వేల నుంచి ఆపైన బ్రేక్‌పాస్ట్, మధ్యా హ్న భోజనం అందించాల్సిన కిచెన్స్ 13 ప్రాంతాల్లో ఉన్నాయి. ఒక సెంట్రలైజ్డ్ కిచెన్‌లో తయారైన వంట సుమారు 4 గంటలపాటు వేడిగా ఉండేలాగా ఏర్పాటు చేస్తున్నారు. గంటలోగానే ఆయా విద్యాసంస్థల దగ్గరికి చేరేలా సెంట్రలైజ్డ్ కిచెన్ నుంచి రవాణా సౌకర్యాన్ని ఏర్పాటుచేశారు.

## జులై 1నుంచి మూడు రోజులపాటు జపాన్ ప్రధాని భారత్ పర్యటన



**న్యూఢిల్లీ,జూన్ 26:** భారత్, జపాన్ దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసే దిశగా ఆదేశ ప్రధానమంత్రి సనాయే తకాయిచి భారత ప్రధాని నరేంద్ర మోడీ ఆహ్వానం మేరకు జులై 1 నుంచి 3వ తేదీ వరకు భారత్‌లో పర్యటించనున్నారు. ఈ మేరకు భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ పర్యటనలో భాగంగా ఢిల్లీలో నిర్వహించనున్న 16వ భారత్ జపాన్ వార్షిక సదస్సులో ఇరు దేశాల ప్రధానులు పాల్గొంటారు. జపాన్ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత సనాయే తకాయిచి భారత్‌లో పర్యటించడం ఇదే తొలిసారి. వాస్తవానికి, ఈశాన్య రాష్ట్రాల్లో జపాన్ చేపడుతున్న అభివృద్ధి ప్రాజెక్టులకు చిహ్నంగా ఈ సదస్సును గౌహతిలో నిర్వహించాలని తొలుత భావించారు. అయితే, ప్రధాని తకాయిచి పర్యటన షెడ్యూల్ మరియు ఇతర లాజిస్టికల్ కారణాల రీత్యా వేదికను ఢిల్లీకి మార్చినట్లు అధికారులు వెల్లడించారు.

## తిరుపతి కళాకారులకు పుట్టినిల్లు

### 'శ్రీకృష్ణదేవరాయ కళాదర్బార్' నృత్య పోటీలు ఆరంభం



**తిరుపతి, జూన్ 26 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆధ్యాత్మిక నగరం తిరుపతి కళాకారులకు పుట్టినిల్లు అని, అంతరించిపోతున్న మన సంస్కృతి సాంప్రదాయాలను భవిష్యత్ తరాల వారికి అందించాలనే లక్ష్యంతో వ్యయ ప్రయాసలకోర్చి అనేక సంవత్సరాలుగా విజయవంతంగా నడిపిస్తున్న రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి, కార్యదర్శి కెఎన్ రాజాల పనితీరు అభినందనీయం. శుక్రవారం తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో మూడురోజులు రాయలసీమ రంగస్థలి ఆద్వర్యంలో జరిగే "శ్రీకృష్ణదేవరాయ కళాదర్బార్" జాతీయ నృత్య పోటీలు ప్రారంభమయ్యాయి. టిటిడి సహకారంతో అనేక సాంస్కృతిక ఆధ్యాత్మిక పౌరాణిక ప్రదర్శనలతో ఆంధ్రప్రదేశ్‌తో పాటు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన చిన్నారుల అద్భుత నృత్య ప్రదర్శనలతో నగర ప్రజలను, కళాభిమానులను అలరించారు. వేంకటేశ్వరస్వామి పద్మావతి అమ్మ ఆశీస్సులతో చిన్నారులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ముఖ్యఅతిధిగా విచ్చేసిన పి.నవీన్‌కుమార్‌రెడ్డి ఆకాంక్షిస్తూ అభినందనలు తెలియజేశారు. టిటిడి ధర్మకర్తల మండలి ఇలాంటి ఆధ్యాత్మిక పౌరాణిక సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు సంపూర్ణ సహకారం అందించాలని నవీన్ విజ్ఞప్తి చేశారు. అనంతరం రాష్ట్రం నలుమూలల నుండి వచ్చిన చిన్నారులు అద్భుతంగా తమ కళా ప్రదర్శనను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ రంగస్థలి వ్యవస్థాపక కార్యదర్శి కెఎన్ రాజా, చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి, గౌరవ కార్యదర్శి కస్పా పద్మనాభం, సభ్యులు డాక్టర్ సోము ఉమాపతి, పురోహితులు సురేష్ స్వామి, బండారి భాస్కర్ రెడ్డి, ఆర్ఎంఎస్ భాస్కర్, సిద్ధేంద్ర శర్మ, ఆమూరు సుబ్రహ్మణ్యం, చంద్రబాబు నాయుడు, కన్నప్ప గారి కేశవులు, విగ్రహాల కళ్యాణి, మునేంద్ర రెడ్డి, ఆముదాల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## శివయ్య సేవలో జస్టిస్ వై.లక్ష్మణరావు



**శ్రీకాళహస్తి, జూన్ 26 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరుని సేవలో శుక్రవారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ వై.లక్ష్మణరావు కుటుంబసభ్యులతో దర్శించుకున్నారు. ఆయనకు దక్షిణ గోపురం వద్ద ఆలయ మర్యాదలతో ప్రోటోకాల్ ఎఈఓ లోకేష్‌బాబు, ఎపిఆర్ఓ రవిలు వేదపండితులతో స్వాగతం పలికారు. ఆలయంలోని స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం చేసుకున్న వారికి మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. ఆలయ ఇఒ బి.వెంకటేష్ స్వామి అమ్మవార్ల చిత్రపటాలను అందించారు. ఆలయంలో నిర్వహిస్తున్న ధార్మిక కార్యక్రమాలు, అభివృద్ధికి సంబంధించి ఇఒ బిసి వెంకటేష్ వివరించారు.


## సినీ నటి రాహుకేతుదోష నివారణ పూజలు

**శ్రీకాళహస్తి, జూన్ 26 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం సినీనటి కీర్తి సురేష్ కుటుంబ సమేతంగా రాగా ఆమెకు దక్షిణ గోపురం వద్ద ధర్మకర్తల మండలి సభ్యుడు వాకచర్ల గురుప్రసాద్, తెలుగుదేశం నాయకుడు డిల్లీబాబులు స్వాగతం పలికారు. నటి ఆలయంలో నిర్వహించే రాహుకేతు దోష నివారణ పూజలు జరిపించుకోవాలని కోరగా ఆలయ ఇన్‌స్పెక్టర్ హరియాదవ్ సహాయసహకారాలతో ఆలయం వద్ద వేదపండితులతో ఏర్పాటు చేసారు. పూజలు అనంతరం ఆమెకు స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు. మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేక ఆశీర్వచనాలు అందించారు. ఏర్పాట్లను ఆలయ ఇఒ బిసి వెంకటేష్, ప్రోటోకాల్ ఎఇఒ లోకేష్‌బాబు, ఆలయ ఎఇఒ విద్యాసాగర్‌రెడ్డి, పర్యవేక్షకులు నాగభూషణం యాదవ్, ఎపిఆర్ఓ రవిలు పర్యవేక్షించారు.

## వాసవి ఆలయ ద్వితీయ ద్వాదశ కుంభాభిషేకానికి సన్నాహాలు

**శ్రీకాళహస్తి, జూన్ 26 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలోని శివయ్య సన్నిధికి సమీపంలో వెలసిన శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయ ద్వితీయ ద్వాదశ కుంభాభిషేకానికి ఆలయ యువ కమిటీ సన్నాహాలు చేస్తున్నారు. ఆలయ అర్చకులు బ్రహ్మశ్రీ ఇందుకుమార్ శర్మ పర్యవేక్షణలో నాలుగురోజుల పాటు నిర్వహించే కార్యక్రమాలను రూపకల్పన చేసారు. కుంభాభిషేకానికి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఈ నెల 30 నుంచి వచ్చేనెల 2 వరకు కార్యక్రమాలను నిర్వహించేందుకు నిర్ణయించినట్లు ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షులు జులుగంటి మురళి వివరించారు. 30న సాయంత్రం గణపతి పూజలతో కార్యక్రమాలు ప్రారంభమౌతాయి. జులై 2న దేవి హోమాలు కళశోహం, దేవి ఖడ్గమాల హోమం, నవగ్రహ హోమాలు, ఉపపాలక జలాధి హోమాలు, పూర్ణాహుతి నిర్వహించాబడుతున్నారు. సాయంత్రం ఆడపడుచులకు పడిబాల, అలాగే రాత్రి అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు అధ్యక్షులు వివరించారు.

## దుర్గమ్మ దర్శనానికి భక్తజనం



**ఇంద్రకీలాద్రి, జూన్ 26 ప్రభాతవార్త:** శుక్రవారం ప్రభుత్వ సెలవు దినం కావడంతో విజయవాడ ఇంద్రకీలాద్రిపై వేంచేసియున్న శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వారి దేవస్థానానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుండే క్యూలైన్లు భక్తులతో నిండిపోయాయి. అంతరాలయ దర్శనం నిలిపివేసినట్లు రద్దీ విపరీతంగా పెరగడంతో అందరికీ త్వరితగతిన దర్శనం కల్పించేందుకు ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2:30 గంటల వరకు అంతరాలయ దర్శనంతో పాటు వి.ఐ.పి దర్శనాలను పూర్తిగా నిలిపివేసి సర్వదర్శనం లైన్ల ద్వారానే భక్తులను అనుమతించారు. భక్తులకు విస్తృత సదుపాయాలుండేలా తీవ్రతను దృష్టిలో ఉంచుకుని క్యూలైన్లలో ఉన్న భక్తుల కోసం మొబైల్ టిన్ల ద్వారా నీరు నిరంతరాయంగా పంపిణీ చేశారు. అలాగే ఆలయానికి వచ్చిన భక్తులందరికీ సరిపడా ఉచిత ప్రసాదం, నిత్యాన్నదాన వితరణను విస్తృతంగా ఏర్పాటు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు, సిబ్బంది నిరంతరం పర్యవేక్షించారు.

**నిత్యాన్నదాన పథకానికి విరాళం:** విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ కనకదుర్గమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి రు.1,01,116ల విరాళాన్ని శుక్రవారం విజయవాడకు చెందిన నంబూరు కుటుంబరావు అందించారు. దాతలకు దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసిన అధికారులు వారికి దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

# ఆదాయానికి మించిన అక్రమాస్తుల కేసులో పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఇంజినీర్ అరెస్టు

● కర్నూలు, తిరుపతి, హైదరాబాద్‌లో 6 చోట్ల ఎసిబి సోదాలు ● నగదు, బంగారం, వెండి, స్థిరాస్తులు, వాహనాలు స్వాధీనం





**కర్నూలు, జూన్ 26 ప్రభాతవార్త:** పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారి విధులు నిర్వహించేందుకు సైతం అడ్డదారులు తొక్కాడమే ఆరోపణలపై ఏసీబీ అధికారులు కేసు నమోదు చేశారు. ఆ మేరకు తనిఖీలు చేసి పాదానికి మించిన ఆస్తులను గుర్తించి సీజ్ చేశారు చివరగా అరెస్టు చేసి ఏసిబి కోర్టులో హాజరు పరచమన్నారు. తిరుపతి కాలుష్య నియంత్రణ మండలిలో సీనియర్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న బేతి యుగంధర్ ముని ప్రసాద్‌ను శుక్రవారం కర్నూలు ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. చట్టబద్ధమైన ఆదాయానికి మించి ఆస్తులు సంపాదించారన్న విశ్వసనీయ సమాచారం మేరకు అవినీతి నిరోధక చట్టం 1988 సెక్షన్ 13(2), 13(1)(బి) కింద కేసు నమోదు నమో చేశారు ఎఫ్ఐఆర్ నమోదు సమయానికి ఆయన ఆదాయాన్ని కన్నా 130 శాతం అధికంగా ఆస్తులు ఉన్నట్లు రికార్డు చేశారు. కాగా విచారణలో అంతకుమించి ఆస్తులు గుర్తించినట్లు ఎస్పిబీడిఎస్పి సోమన్న తెలిపారు. దర్యాప్తులో భాగంగా శుక్రవారం కర్నూలు, తిరుపతి, హైదరాబాద్‌లలోని మొత్తం ఆరు ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. సోదాల్లో ఆస్తి పత్రాలతో పాటు కీలక ఆధారాలను స్వాధీనం చేసుకున్నారు. సోదాల్లో ఆదిత్యనగర్‌లో జి+3 అంతస్తుల భవనం, శిఖర్ ఫ్రైడ్‌లో డ్యూప్లెక్స్ విల్లా, క్లౌడ్9 అపార్ట్‌మెంట్‌లో ఒక ఫ్లాట్, నాలుగు ఇంటి స్థలాలు, రూ.5.78 లక్షల నగదు, సుమారు 172 గ్రాముల బంగారం, 3.3 కిలోల వెండి, పోస్టల్ పీపీఎఫ్, సుకన్య సమృద్ధి యోజన, బ్యాంకు డిపాజిట్లు, ఎల్ఐసీ బాండ్లు, బీమా పాలసీలు కలిపి సుమారు రూ.49 లక్షల విలువైన పెట్టుబడులు గుర్తించారు. అలాగే రూ.8 లక్షల విలువైన బాలెనో కారు, రూ.1 లక్ష విలువైన హోండా యాక్టివా వాహనాన్ని కూడా గుర్తించారు. సోదాల సందర్భంగా ఎస్‌బీఐ బ్యాంకు లాకర్ తాళం చెవి లభించగా, సంబంధిత లాకర్‌ను జూన్ 29న తనిఖీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. మరిన్ని సోదాలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. నిందితుడిని అరెస్టు చేసి కర్నూలులోని ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరచనున్నట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. కర్నూలు ఏసీబీ డీఎస్పీగా సోమన్న చార్జి తీసుకున్నప్పటినుంచి ఏసిపి కేసుల వేగం పెరిగింది. గతంలో చాలా తక్కువగా నమోదయ్యే కర్నూలు పరిధిలో డిఎస్పీ సోమన్న ఆధ్వర్యంలో అధికారులు అవినీతిపరులను వరుసగా పట్టేస్తుండడం ప్రశంసనీయం.

## జైలు నుంచి రియాజ్ విడుదల... మళ్లీ అరెస్ట్

**కడప (కార్పొరేషన్), జూన్ 26 ప్రభాతవార్త:** అల్మాస్ పేట ఘటనలో రియాజ్‌ను పోలీసులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. శుక్రవారం కడప కేంద్ర కారాగారం నుంచి రియాజ్ ను బెయిల్ పై విడుదల చేశారు. అయితే విడుదల అయిన మరుక్షణమే టూ టౌన్ పోలీసులు మళ్లీ అదుపులోకి తీసుకున్నారు. కేంద్ర కారాగారం వద్ద భారీగా పోలీస్ బలగాలను మోహరించారు. జైలు నుండి బయటకు రాగానే రియాజ్‌ను బలవంతంగా అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారని రియాజ్ కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.
అల్మాస్ పేట ఘటనకు సంబంధం లేకపోయినా గతంలో గంజాయి కేసులో అరెస్ట్ చేశారని రియాజ్ కుటుంబం కుటుంబం ఆరోపించింది. సిసిటివి ఫుటేజ్ ఆధారాలతో రియాజ్ హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ వేయడాన్ని పోలీసులు సీరియస్‌గా తీసుకున్నట్లు సమాచారం.
కొడుకుపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని, రెండు నెలలుగా జైల్లో ఉంచారన్న రియాజ్ తల్లి వాపోయింది.

## మంత్రి ఇల్లు ముట్టడించిన ఔట్‌సోర్సింగ్ టీచర్లు



**పార్వతీపురం మన్యం జిల్లా(సాలూరు), జూన్ 26 ప్రభాతవార్త:** పార్వతీపురం మన్యం జిల్లా మంత్రి సంధ్యారాణి ఇల్లు ముట్టడి చేసిన ఔట్ సోర్సింగ్ టీచర్ రాష్ట్రంలో ఔట్ సోర్స్ టీచింగ్ వ్యవస్థ ఏ విద్యాసంస్థలో లేదని కేవలం ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌లో మాత్రమే ఈ వ్యవస్థ ఉందని అలాగే 15 సంవత్సరాల నుండి ఇందులో విధులు నిర్వహిస్తున్న మమ్మల్ని రెగ్యులర్ చేయాలని శుక్రవారం మంత్రి సంధ్యారాణి ఇంటి ముందు బైఠాయించి గురుకుల ఔట్‌సోర్సింగ్ టీచర్స్ పెద్దఎత్తున ధర్నా చేసి నిరసన చేపట్టారు. అలాగే మంత్రి సంధ్యారాణికి వ్యతిరేకంగా మా సమస్యలు పరిష్కరించారని ప్రాణాలైనా విడుస్తాం ఉద్యోగాలను సాధిస్తాం అని నినాదాలు చేయడంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దీంతో టౌన్ సీఐ అప్పలనాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ అనిల్ కుమార్ సిబ్బంది రంగంలోకి దిగి టీచర్లను నిలువరించగా ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అయినప్పటికీ మా సమస్యలు పరిష్కరించకుంటే మరింత ఆందోళన చేపడుతామని గురుకుల ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు తెలియజేశారు.




# పసిమొగ్గపై పైశాచికం

### నాలుగేళ్ల బాలికను నీళ్ల డ్రమ్‌లో ముంచి హత్య
### 24 గంటల్లో కేసు ఛేదించిన పోలీసులు
### పక్కింటి మహిళే స్వాతినే నిందితురాలిగా గుర్తింపు
### న్యాయం కోసం రోడ్డెక్కిన బాధిత కుటుంబం
### కఠినంగా శిక్షించాలని బాధితుల డిమాండ్

**పులివెందుల, జూన్ 26 ప్రభాతవార్త:** పసిమొగ్గలాంటి నాలుగేళ్ల చిన్నారి ప్రాణాలను పొట్టన పెట్టుకున్న హృదయ విదారక ఘటన పులివెందుల నియోజకవర్గం లింగాల మండలంలో చోటుచేసుకుంది. లోపట్నూతల గ్రామంలో నాలుగేళ్ల బాలిక నిత్వికను నీళ్ల డ్రమ్‌లో ముంచి హత్య చేసిన ఘటన గ్రామాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఘటన జరిగిన 24 గంటలు కూడా పూర్తికాకముందే పోలీసులు కేసును ఛేదించి నిందితురాలిని గుర్తించారు.
గ్రామానికి చెందిన సృజన శ్రీ, రామాచారి దంపతుల కుమార్తె నిత్విక (4) గురువారం అనుమానాస్పద స్థితిలో నీళ్ల డ్రమ్‌లో మృతి చెంది కనిపించింది. చిన్నారి మృతిపై తల్లిదండ్రులు, గ్రామస్థులు అనుమానాలు వ్యక్తం చేయడంతో పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు ప్రారంభించారు.
**రాత్రివేళ రోడ్డుపై ధర్నా:** చిన్నారిని హత్య చేసి నీటిలో పడవేశారని ఆరోపిస్తూ గురువారం రాత్రి తల్లిదండ్రులు, బంధువులు, గ్రామస్థులు పులివెందుల-పార్నపల్లె రింగ్ రోడ్డుపై ధర్నాకు దిగారు. నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. డీఎస్పీ మురళి నాయక్ ఆధ్వర్యంలో పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. కేసును త్వరితగతిన ఛేదించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.
**పోలీసుల దర్యాప్తులో కీలక ఆధారాలు:** లింగాల ఎస్సై జగదీశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో కేసు నమోదు చేసిన పోలీసులు డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం సహాయంతో ఆధారాలు సేకరించారు. సీసీ కెమెరా ఫుటేజీలు, సాంకేతిక ఆధారాల ఆధారంగా పక్కింట్లో నివసించే స్వాతిపై అనుమానం బలపడిందని పోలీసులు తెలిపారు. ఈ మేరకు ఆమెపై హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.
పులివెందులలో నిరసనలు: శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులు పులివెందుల రూరల్ పోలీస్ స్టేషన్ వద్ద, పూలంగల సర్కిల్ వద్ద నిరసన తెలిపారు. చిన్నారి విషయంలో జరిగిన ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిందితురాలికి కఠిన శిక్ష పడాలని డిమాండ్ చేశారు. కుటుంబాల మధ్య ఉన్న వివాదాలకు చిన్నారిని బలి చేయడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. నిందితుదిరాలికి పోలీస్ శాఖలోనే ఉన్నతాధికారి బంధువు ఉన్నారని కేసు నీరుగార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం నిరసన చేశారు డీఎస్పీ మురళి నాయక్ బాధితులను కలిసి మాట్లాడు తూ నిందితురాలు వెనుక ఎవరున్నా చట్టపరంగా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఇప్పటికే డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం, సీసీ కెమెరాల ఆధారాలతో దర్యాప్తు ముందుకు సాగిందని తెలిపారు. పులివెందుల డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో డీఎస్పీ మురళి నాయక్ మాట్లాడుతూ చిన్నారి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు లింగాల ఎస్సై జగదీశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పోస్టుమార్టం కోసం చిన్నారి మృతదేహాన్ని కడప రిమ్స్‌కు తరలించారు. నీటి నమూనాలు, ఇతర ఆధారాలను ఫోరెన్సిక్ పరీక్షలకు పంపినట్లు పోలీసులు తెలిపారు. చిన్నారి నిత్విక మృతితో లోపట్నూతల గ్రామం విషాదంలో మునిగిపోయింది. వేగంగా స్పందించి కేసును ఛేదించిన పోలీసులపై గ్రామస్థులు విశ్వాసం వ్యక్తం చేస్తూ.. నిందితురాలికి చట్ట ప్రకారం కఠిన శిక్ష పడాలని కోరుతున్నారు.

# కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను బర్తరఫ్ చేయాలి



**తిరుపతి, జూన్ 26 ప్రభాతవార్త ప్రతినిధి:** దేశంలో విద్యా వ్యవస్థ దోపిడీ యంత్రంగా మారిందని, నీట్ పరీక్షల నిర్వహణతో కేంద్ర ప్రభుత్వ అసమర్థత బట్టబయలైందని తక్షణం కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను బర్తరఫ్ చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు బాలగురవం బాబు, తిరుపతి నగర అధ్యక్షుడు గౌడపేర చిట్టిబాబు శుక్రవారం తిరుపతిలో మీడియాతో మాట్లాడారు. నీట్ పరీక్షల నిర్వహణను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీకి అప్పగించి ఎలాంటి పర్యవేక్షణ లేకపోవడంతోనే దేశంలో లక్షలాదిమంది యువత భవిష్యత్తు తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురిచేసిందని అన్నారు. వారి జీవితాలను అంధకారంలోకి నెట్టేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలోని ప్రశ్నించే గొంతుకులను ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీపై బిజెపి ప్రభుత్వం కక్షగట్టి అక్రమ కేసులతో అరికట్టే చర్యలకు పాల్పడుతోంన్నారు. యువతకు, విద్యార్థులకు లోకసభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుందని ఆయన చెప్పారు. కాంగ్రెస్ పార్టీ తిరుపతి అర్బన్ జిల్లా అధ్యక్షుడు గౌడపేర చిట్టిబాబు మాట్లాడుతూ నీట్ పరీక్షల ప్రశ్నా పత్రాలు లీకేజీ భారత విద్యా వ్యవస్థలో లోపాలను బయట పెట్టిందని చెప్పారు. నీట్ పరీక్షల కోసం విద్యార్థుల కుటుంబాలు పెడుతున్న ఖర్చు కేంద్ర ప్రభుత్వం విద్యా బడ్జెట్ తో సమానంగా ఉందని తెలిపారు. కోచింగ్ సెంటర్ల ఫీజులు, స్టడీ మెటీరియల్స్ కోసం ఇప్పటికే లక్షలాది రూపాయలు వెచ్చించిన తల్లిదండ్రులపై పునఃపరీక్షల వల్ల అదనపు ప్రయాణ ఖర్చులు, వసతి ఖర్చుల భారం పడిందని వివరించారు. కేంద్ర విద్యా శాఖ మంత్రిని తక్షణం బర్తరఫ్ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పిసిసి ప్రధాన కార్యదర్శి తమటం వెంకట నరసింహులు, ఎన్ఎస్‌యుఐ తిరుపతి జిల్లా అధ్యక్షుడు శివబాలాజీ, కాంగ్రెసు పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్చార్జ్ తలప దామోదర్ రెడ్డి, సర్వేపల్లి నియోజకవర్గ ఇన్చార్జ్ బల్ల హరిబాబు, సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్చార్జ్ వెంకటాచలపతి, పంట శ్రీనివాసులు రెడ్డి, ఐరాల లోకేష్ రెడ్డి, తిరుపతి జిల్లా ఎస్టి విభాగం అధ్యక్షుడు జ్యోతీశ్వర్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## మొహర్రం అంటేనే త్యాగం: సిఎం చంద్రబాబు

**విజయవాడ, జూన్ 26 ప్రభాతవార్త ప్రతినిధి:** మొహర్రం పర్వదినం నేడు. ఈ నేపథ్యంలో ముస్లిం సోదరులకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ మొహర్రం పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మొహర్రం అంటేనే త్యాగం అని సిఎం చంద్రబాబు అన్నారు. సత్య మార్గంలో నడవాలనే స్ఫూర్తిని మొహర్రం అందిస్తుందని అన్నారు. సత్యం, న్యాయం కోసం ఇమామ్ హుస్సేన్ పోరాడారని, ఇమామ్ హుస్సేన్ త్యాగాన్ని మొహర్రం సందర్భంగా స్మరించుకుందామని అన్నారు. మొహర్రం అందరికీ శాంతిని తీసుకురావాలి అన్నారు.

### శాంతి, సామరస్యాల ప్రతీకగా మొహర్రం: లోకేశ్

శాంతి, సామరస్యాల ప్రతీకగా మొహర్రం జరగాలని మంత్రి లోకేశ్ ఆకాంక్షించారు. హజ్రత్ హుస్సేన్ త్యాగం స్మరించుకునే సందర్భం మొహర్రం జరుపుకొంటారని అన్నారు. ధర్మ పరిరక్షణకు పాటుపడటమే మొహర్రం ఇచ్చే సందేశం అని అన్నారు. మానవత్వానికి ప్రతీక హజ్రత్ హుసేన్స్ అన్నారు.

## గోవా గవర్నర్‌కు బర్త్‌డే విషెస్ చెప్పిన మంత్రి లోకేష్

**విజయవాడ, జూన్ 26 ప్రభాతవార్త ప్రతినిధి:** గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతిరాజుకు ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యామంత్రి నారా లోకేష్ తెలిపారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా ఒక ప్రత్యేక పోస్ట్ చేశారు. అశోక్ గజపతి రాజును విలువల శిఖరం మనసున్న మహారాజు అంటూ లోకేశ్ కొనియాడారు. "ప్రజాస్వామ్యంలో నిలువెత్తు మానవత్వ రాజసం అశోక్ గజపతిరాజు. విద్యాలయాలకు వేల ఎకరాలు దానమిచ్చిన వితరణశీలి, ఆధ్యాత్మిక సేవకు ఆస్తులు ధారపోసిన ధర్మకర్త, రాజకీయాలలో అందరి మన్ననలు అందుకున్న అజాతశత్రువు" అని లోకేశ్ తన పోస్టులో ప్రశంసించారు. ప్రజల మనిషిగా వారి హృదయాల్లో స్థానం సంపాదించు కున్నారని పేర్కొన్నారు. అశోక్ గజపతిరాజు ఆయురారోగ్యాలతో, ఆనందంగా వందేళ్లు వర్ధిల్లాలని దేవుడిని ప్రార్థిస్తున్నట్లు మంత్రి లోకేశ్ తన శుభాకాంక్షల సందేశంలో తెలిపారు.

## డ్రగ్స్ మాఫియాపై డేగ కన్ను: ఈగిల్ ఐజి

**విజయవాడ, జూన్ 26 ప్రభాతవార్త:** యువతను నిర్వీర్యం చేస్తున్న డ్రగ్స్ మాఫియాపై నిఘాను తీవ్రతరం చేసి నేరాలను అరికడుతున్నట్లు ఎ.పి. ఈగిల్ ఛీఫ్ ఐజి రవికృష్ణ స్పష్టం చేశారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శుక్రవారం విజయవాడలోని పాత ప్రభుత్వ ఆసుపత్రివద్ద రాష్ట్ర విభిన్న ప్రతిభావంతులు, ట్రాన్స్‌జెండర్, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, ఈగల్ ఏపీ, ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ, వాకథాన్ నిర్వహించారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశా, రాష్ట్ర విభిన్న ప్రతిభావంతులు, ట్రాన్స్‌జెండర్, వయోవృద్ధుల సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి హాజరైన ఈ కార్యక్రమంలో అధికారులు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈగల్ ఏపీ ఐజీ రవికృష్ణ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 40 వేలకుపైగా ఈగల్ క్లబ్‌లు ఏర్పాటు చేసి విద్యార్థుల్లో పెద్ద ఎత్తున అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఆపరేషన్ చైతన్య ద్వారా రాష్ట్రంలో "జీరో గంజాయి సాగు లక్ష్యాన్ని సాధించామని పేర్కొన్నారు. తమ ప్రాంతాల్లో గంజాయి లేదా మాదకద్రవ్యాల కార్యకలాపాలు గుర్తిస్తే ప్రజలు 1972 ఈగల్ నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. డ్రోన్ నిఘా ద్వారా హాట్‌స్పాట్ ప్రాంతాల్లో మంచి ఫలితాలు సాధించినట్లు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం "ఈగల్ ఏపీ" ద్వారా మాదక ద్రవ్యాల సరఫరా, రవాణా, విక్రయాలపై డేగ కళ్లతో నిఘా ఉంచుతూ మాఫియాపై కఠిన చర్యలు తీసుకుంటోందన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ డా. జి. లక్ష్మీశ మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా తల్లిదండ్రులు, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు సమిష్టిగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు, యువత ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని చేరుకునేందుకు దృష్టి సారించాలని సూచించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్, గంజాయి నిర్మూలనకు ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోందని, ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు విస్తృత కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## కేంద్ర ప్రభుత్వ పురస్కార గ్రహీతకి సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా సన్మానం




**అనంతపురం, జూన్ 26 ప్రభాత వార్త బ్యూరో:** కేంద్ర ప్రభుత్వ పురస్కారం అందుకున్న అనంతపురం జిల్లా పెద్దవడుగూరు గ్రామానికి చెందిన స్వాతంత్ర సమరయోధుల కుటుంబ సభ్యులు, ప్రముఖ సిపిఐ నాయకులు ఎద్దుల సూర్యనారాయణ రెడ్డిని ఢిల్లీలోని ఇంద్రజిత్ గుప్త మార్గ్లో ఉన్న అజయ్ భవన్లో సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డి.రాజా మాట్లాడుతూ.. 92 ఏళ్ల వయస్సులో కూడా సూర్యనారాయణ రెడ్డి ఎంతో చురుకుగా ఉండటం ఆనందదాయకమని అన్నారు. సిపిఐ పార్టీకి ఎనలేని సేవలు అందించడంతో పాటు సమాజ సేవలో నిరంతరం పాల్గొంటూ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. కేంద్ర ప్రభుత్వం అందించిన పురస్కారం ఆయన జీవితకాల సేవలకు దక్కిన గౌరవమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ నాయకులు, మాజీ ఎమ్మెల్యే కె. రామకృష్ణ, అఖిల భారత స్వాతంత్ర సమరయోధుల వారసుల సంఘం జాతీయ కార్యదర్శి రాంపిళ్ల జయప్రకాశ్, గుత్తి కోట సంరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు విజయభాస్కర్, ఢిల్లీ సామాజిక కార్యకర్త గురుదేవ్ తదితరులు పాల్గొని ఎద్దుల సూర్యనారాయణ రెడ్డికి అభినందనలు తెలియజేశారు.

## తండ్రి కట్టిన ఇల్లు.. కూల్చడం ఇష్టం లేక జాకీలతో పైకి!

### జంగారెడ్డిగూడెంలో అరుదైన దృశ్యం



**జంగారెడ్డిగూడెం, జూన్ 26 ప్రభాతవార్త:** తండ్రి జ్ఞాపకంగా నిలిచిన ఇంటిని కూల్చివేయడం ఇష్టం లేక, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఓ వ్యక్తి భవనాన్ని ఏకంగా ఐదు అడుగుల మేర పైకి లేపారు. జంగారెడ్డిగూడెంకు చెందిన ధూబగంట్ల వెంకటేశ్వరరావుకు చెందిన ఇల్లు పరిసరాల్లోకి నీరు చేరుతుండటంతో ఈ వినూత్న నిర్ణయం తీసుకున్నారు. తన తండ్రి సత్యనారాయణ నిర్మించిన ఈ ఇంటిని పడగొట్టి మళ్లీ నిర్మించాలంటే ప్రస్తుత పరిస్థితుల్లో సుమారు రూ.2 నుండి 3 కోట్ల వరకు ఖర్చు అయ్యే అవకాశం ఉంది. దీనికి తోడు తండ్రి కట్టిన ఇల్లు కావడంతో దానిని కూల్చడానికి మనసొప్పని వెంకటేశ్వరరావు.. జాకీల సాయంతో భవనాన్ని పైకి లేపేందుకు గత కొన్ని సంవత్సరాలుగా నమ్మకమైన సంస్థ కోసం అన్వేషించారు. ఈ క్రమంలో విజయవాడకు చెందిన ఒక ప్రైవేట్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకున్నారు. సుమారు రూ.30 లక్షల వ్యయంతో చేపట్టిన ఈ పనుల కోసం సదరు సంస్థ 40 మంది కార్మికులతో, దాదాపు 600 జాకీలను ఏర్పాటు చేసి భవనాన్ని సురక్షితంగా పైకి లేపే ప్రక్రియను ప్రారంభించింది. ప్రస్తుతం ఈ పనులు తుదిదశకు చేరుకున్నాయి. కూల్చివేత లేకుండా, భారీ ఖర్చు ఆదా అవుతూ ఇల్లు పైకి లేస్తున్న ఈ అద్భుత ప్రక్రియను స్థానికులు ఆసక్తిగా తరలివచ్చి తిలకిస్తున్నారు.

27 -6Pg9th cheli 1:27 -6Pg9th cheli 1.qxd 6/26/2026 5:41 PM Page 1



ఫ్యాషన్ ఫ్యాషన్

# పూల ఆర్గంజా లెహంగాలు




రంగు రంగుల పూల డిజైన్లతో, తక్కువ బరువుతో ఉండే ఆర్గంజా లెహంగాలు భలే లుక్ ఇస్తాయి. అందుకే ఆ తరం, ఈ తరం అనే తేడా లేకుండా కాలేజీ అమ్మాయిల నుంచి నడివయసు వాళ్లవరకూ వీటిని వేసుకుని మురిసిపోతున్నారు. ఎంబ్రాయిడరీ, క్రిస్టల్, మిర్రర్, క్రష్డ్, శాటిన్.. అంటూ రకరకాల లెహంగాలు అతివల మనసు దోచేస్తున్నాయిప్పుడు. అల్లంత దూరాన ఉన్నా కూడా.. ఆకాశంలో తారల్లా మెరిసిపోతున్నారు. ఒకప్పుడు పెళ్లిళ్లూ, వేడుకలంటే బ్రైడ్, బోల్డ్ రంగులే. కానీ, ప్రస్తుతం మ్యూటెడ్, పేస్టల్ షేడ్స్ ఇష్టపడే వారి సంఖ్య పెరుగుతోంది. అందుకే ఈ పూల ఆర్గాంజా లెహంగా ఒక్కటన్నా ఉండాల్సిందే అనుకుంటున్నారంతా. ఇక ఫ్యాషన్ ప్రియుల సంగతి చెప్పనక్కర్లేదు. వాళ్ల వార్డ్‌రోబ్‌లో అయితే, ఆర్గెంజా లెహంగా తప్పక ఉండాల్సిందే. అందుకే హల్దీ, మెహందీ, సంగీత్‌లకు మోడ్రన్‌గా కనిపించాలనుకుంటే ఫ్లోరల్ డిజైన్‌లను ఎంచుకుంటున్నారు ముద్దుగుమ్మలు. ఏ రిసెప్షనో, స్నేహితురాలి పెళ్లికో అయితే, కొంచెం గ్రాండ్‌గా బ్లౌజ్‌కూ, స్కర్ట్ బోర్డర్‌కూ జరీ, సీక్విన్స్ ఎంబ్రాయిడరీ లాంటివి చేయించి.. సందర్భమేదైనా ఫ్యాషనబుల్‌గా, హుందాగా ఉండడంతో పాటు సౌకర్యంగానూ ఉంటాయివి. వీటి మీదకు మరీ హెవీ జ్యూయెలరీ అవసరం కూడా ఉండదు. కాబట్టి, మెడలో ఓ చిన్న చోకర్ వేసుకుని జుట్టు వదిలేస్తే చాలు. సింపుల్ లుక్‌లో మెరిసిపోతారంతే.




# కట్టె కాలే దాకా.. ఇక్కడే ఉంటా !!



జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి 'గరీయసీ' అన్న శ్రీరామచంద్రుడి వాక్యాలను పుణికిపుచ్చుకున్నట్లుంది ఓ వృద్ధురాలు తన మాతృభూమిలోనే కాలం చెయ్యాలని ఆశపడ్తోంది. మమ్మూటికీ, అది పుట్టిన గడ్డ మీద మమకారమే. అందుకే తనకట్టె ఇక్కడే కాలాలని కోరుకోవడం విశేషం. ఈ నేపథ్యంలో మధ్యలో మరో దేశ పౌరసత్వం పొందినా భారత్‌కి తిరిగొచ్చాక తాజాగా బాపట్ల కలెక్టర్ ముందు భారత రాజ్యాంగాన్ని గౌరవిస్తూ, దేశ చట్టాలకు కట్టుబడి ఉంటానని ప్రమాణం చేశారు. అమెరికా పౌరసత్వం కలిగిన ఓ భారతీయ వృద్ధురాలు ఇప్పుడు తన పౌరసత్వాన్ని వదులుకోవాలని నిర్ణయించుకోవడం స్వాగతించదగినది. ఇన్నాళ్ల తన జీవితకాలంలో జీవితపు లోతుపాతాలు, జీవనగమనంలో ఎగుడు దిగుడులను చవిచూసిన పాతగుంటూరు వాసి 94 ఏళ్ల కొండ్రగుంట మహాలక్ష్మమ్మ తన జన్మభూమిని మరువలేక తనకు భారతీయ పౌరసత్వంలోనే తుదిశ్వాస విడవాలని ఆకాంక్షిస్తున్నారు. 2000 సంవత్సరంలో ఆమె అమెరికా పౌరసత్వం పొందారు. దాదాపు 18 ఏళ్ల పాటు తన సంతతి బాగోగులు చూసుకుంటూ అక్కడే ఉన్నారు. ఎనిమిదేళ్ల క్రితమే భారతదేశానికి వచ్చినా ఇప్పుడామె తనకు భారత పౌరసత్వమే ముద్దంటూ బాపట్ల కలెక్టర్‌ని కలిసి తనకు భారతీయ పౌరసత్వం ఇవ్వాలని దరఖాస్తు చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్ల జిల్లా, చినగంజాం మండలం చింతగుంపాల గ్రామానికి చెందిన, శ్రీమతి లక్ష్మమ్మ బాపట్ల జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళిని కలిసి తన మనోగతాన్ని వివరించారు. ఆమె కుమారుడు వర్జీనియాలో స్థిరపడడంతో అక్కడికెళ్లాల్సి వచ్చింది.

# కాఫీ

వేగవంతమైన మన దైనందిన జీవితంలో కాఫీ అవసరం చాలా ఉందనే చెప్పాలి. ప్రపంచవ్యాప్తంగా 400 బిలియన్ కప్పుల కాఫీని రోజువారీ అవసరాల నిమిత్తమై వినియోగిస్తున్నారని అంచనా. కాఫీ అనేది శక్తినిచ్చే, ఉత్తేజాన్నిచ్చే, ఆరోగ్యానికి మద్దతు నిచ్చే ప్రయోజనకరమైన పానీయం. స్కూల్స్ ఆఫ్ ది వైజ్‌గా ప్రపంచంలో మొట్టమొదటి మాయాపానీయంగా కాఫీ షాపు ప్రారంభమైనది. మక్కాలో వీటని కవేకేన్స్ అంటారు. ఇది అరబిక్ పదం నుండి వచ్చింది. ఇది వైన్‌లాగా చేదుగా, నల్లగా ఉండడంతో దీన్ని వైన్ ఆఫ్ రబీ అని అంటారు. కాఫీ చెట్లు 3-9 మీటర్ల ఎత్తువరకు జూలై, ఆగస్టు నెలలో పెరిగే పచ్చదనాన్ని కల్గిన చిన్నాచెట్టు. ఇది దాదాపు 100 సంవత్సరాలు జీవిస్తాయి. 7-20 సంవత్సరాల మధ్య అధిక ఉత్పాదక శక్తిని కల్గి ఉంటాయి. తెల్లని పూలు, ఆకు పచ్చని పండ్లని కలిగి ఉండే కాఫీ మొక్కని కాఫీ చెర్రీస్ అంటారు.



సంత్సరానికి ఒక కాఫీ చెట్టు నుండి 2000-4000 కాఫీ బీన్స్ (10 పౌండ్లు) వస్తాయి. వీటిని మాగిన ఎర్రటికాఫీ చెర్రీస్ నుండి వేరుచేసి ఎండబెట్టి, వేడి చేసి, పొడిగొట్టి కాఫీ పౌడర్‌గా ఉపయోగిస్తారు. ఎర్రటి పండిన కాఫీ చెర్రీస్‌లో రెండు బీన్స్(కాఫీ గింజలు) ఉంటాయి. ఒక బీన్ అరుదుగా ఉంటే పీ బెర్రీ (స్పానిష్‌లో కారాకోల్/ నత్త) అంటారు. ఇవి తియ్యగా, రుచిగా ఉంటాయి.

**రకాలు :** వీటిలో 25-100 రకాల కాఫీ మొక్కలున్నాయి. వీటిలో ముఖ్యమైనవి 5 జాతులు అవి.

**కాఫీయా అరబికా :** ఇది 70% ఎత్తైన కొండ ప్రాంతాల్లో, వర్షపాతం అధికంగా ఉన్న ప్రాంతాల్లో పెరుగుతుంది. ఇవి ఎక్కువగా లాటిన్ అమెరికా, దక్షిణ ఈశాన్య ఉంటుంది. ఇది సర్వసాధారణంగా పెరిగే మొక్క. **కాఫీయా రొబస్టా :** ఇది 30% దిగువ ప్రాంతాల్లో, మైదాన ప్రాంతాల్లో పెరుగుతుంది. ఇది అమెరికా, జపాన్, యూరోప్, బ్రెజిల్‌లో నుండి ప్రపంచ వ్యాప్తంగా విస్తరించడమైనది. సేంద్రీయ పద్ధతుల్లో గిరిజనుల చేత అరకులోయలో పండించిన కాఫీకి 'అరకు కాఫీ' అంటారు. వీటిలో కెఫిన్ కంటెంట్ 200చం ఉంటుంది.

**కాఫీయా లిబరికా :** దీన్నే లిబేరియన్ కాఫీ అంటారు. ఇది లెబేరియా, పశ్చిమ ఆఫ్రికా, ఇండోనేషియా, మలేషియా, ఫిలిఫ్ఫైన్స్ ఆసియాలో అరబికా, రోబస్టా కన్నా 20 మీటర్ల ఎత్తులో పెరిగే కాఫీ మొక్క. ఇది ఖరీదైనదే కాకుండా కెఫిన్ హటెంట్ చాలా తక్కువగా 1.23 గ్రా/100 గ్రా ఉంటుంది.

**కాషీయా కానెఫోరా:** ఇది మధ్య, పశ్చిమ సహారా ఆఫ్రికాలో, టాంజానియా, బోర్నియో, జమైకా, అంగోలా, కోస్టారికా, బోర్నియోలో ఎక్కువగా పెరిగే సంకర జాతి మొక్క అని చెప్పబచ్చు. దీనిలో తక్కువ చక్కెర, 2.7% కెఫిన్ కల్గి ఉంటుంది.

**కాఫీయా ఎక్సెలా:** ఇది అరుదుగా 1903లో పశ్చిమ ఆఫ్రికాలోని సబ్‌ట్రోపికల్ ఏరియాలో ఉత్తర ఆసియాలో పెరిగే మొక్క.

భారతదేశంలో నీడలో పండే ఆత్తుత్తమ భారతీయ కాఫీగా ప్రపంచ ఉత్పత్తిలో 4.5%గా, కాఫీ ఉత్పత్తిలో 7వ అతి పెద్ద ఉత్పత్తిదారుగా ఉంది. మనదేశంలో కర్ణాటక, కేరళ, తమిళనాడు, ఆస్సాం మేఘాలయ, త్రిపుర, నాగాలాండ్, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లో ఎక్కువగా పండిస్తారు. కాఫీలో ఉండే కెఫిన్ ఆల్కలాయిడ్ సైకోఆక్టివ్ డ్రగ్ అని చెప్పవచ్చు. ఒక కప్పు కాఫీలో 6 కేలరీలుండి రక్త ప్రవాహంలో 30-45 నిమిషాల్లో చేరు తాయి. కాలేయం ద్వారా జీవక్రియ చేయబడి మూత్రంద్వారా విసర్జింపబడు తుంది. 4-6 గంటల్లో దీని ప్రభావం పోతుంది. ఇది సెరిబ్రల్ వాస్కులార్ సిస్టమ్, దీని ప్రభావం పోతుంది. ఇది సెరిబ్రల్ వాస్కులార్ సిస్టమ్, రక్తపోటు, శ్వాసకోశ పనితీరు, గ్యాస్ట్రిక్, పెద్ద ప్రేగుకార్య కలాపాలు, కిడ్నీల పనితీరు, వ్యాయామంపై ఆధారపడి ఉంటాయి.



డాక్టర్ కె.ఉమాదేవి
తిరుపతి

# కర్మ ఫలం

కౌండిన్య మహర్షి ఓసారి వైకుంఠానికి వెళ్లాడు. మార్గమధ్యంలో తాను చూపిన కొన్ని విచిత్ర దృశ్యాల గురించి శ్రీమహావిష్ణువు వద్ద ప్రస్తావించాడు. 'స్వామీ! ఒక మామిడిచెట్టు విరగ కాసింది. సమృద్ధిగా ఆకులు, ఫలాలున్నా దాని మీద ఒక్క పక్షీ లేదు. కొంత దూరం వచ్చాక ఓ ఆవు కనిపించింది. పచ్చని పొలంలో తిరుగాడుతూ కూడా.. అది గడ్డిని తినలేకపోతోంది. ఆ ఆశ్చర్యం నుంచి తేరుకోకముందే గంతులేస్తున్న ఏనుగు, నేలపై దొర్లుతున్న గాడిద కనిపించాయి. వీటి అంతరార్థమేంటో బోధపడలేదు! మీరైనా చెప్పండి అన్నాడు. అప్పుడు ఆ వైకుంఠధాముడు మందహాసంతో మునివర్యా తమరు చూసిన మామిడి చెట్టు గత జన్మలో వేదవిద్వాంసుడు. అతడు పాండిత్యాన్ని తనవరకూ పరిమితం చేసుకున్నాడు. తన జ్ఞానాన్ని ఎవరితోనూ పంచుకోలేదు. అందుకే ఈ జన్మలో పక్షులువాలని చెట్టుగా మిగిలాడు. ఆ ఆవు పూర్వ జన్మలో బీడుభూమి ఎవరికీ ఉప యోగపడని కారణంగా, ఈ జన్మలో ఆకుపచ్చనిగడ్డి కళ్లెదురుగా ఉన్నా తినలేని దైన్యస్థితిలో ఉంది. ఏనుగు, గాడిదలు గతించిన జన్మలో విశృంఖల జీవనాన్ని గడిపిన ఉద్వేగ స్వభావులు. వారి తుంటరితనం, దుడుకు ప్రవర్తనల వల్ల ఈ జన్మలో ఇలా గంతులేస్తూ, రంకెలేస్తూ బతికాల్సి వచ్చింది. పరులకు ఉపయోగపడని జీవమైనా, జడ పదార్థమైనా కర్మఫలాల్ని అనుభవించాల్సిందే అని వివరించాడు.

# వంకాయ పచ్చడి



చింతపండు, ఆరేడు ఎండు మిరప కాయలు, చెంచా ఆవాలు, రెండు చెంచాల మినపప్పులను వేయించాలి. వంకాయలను ఒపయ్యి మీద అటూ ఇటూ తిప్పుతూ కాలానచలి. చల్లారనిచ్చి.. పొట్టు తీసేసి, లోపలి గుజ్జును మెత్తగా మెదపాలి. అందులో కాస్త బెల్లం పొడి కలపాలి. మేయించిన ఆవాలు, మినపప్పు, ఎండు మిరప కాయలకు చింతపండు, ఉప్పు జోడించి నూరి.. వంకాయ గుజ్జులో కలపాలి. ఇది మిక్సీ పట్టువచ్చు. కానీ రోట్లో చేస్తేనే మరింత రుచి. తర్వాత పోపు దినుసులు, కరివేపాకు, ఇంటువలతో తాలింపు వేయాలి. అంతే ఘుమఘుమలాడే కమనమలి వంకాయ పచ్చడి సిద్ధం. రుచినీ, ఆరోగ్యాన్నీ అందించే ఈ పచ్చడి ఎప్పుడైనా చేసుకోవచ్చు. అయితే భోగి, రథ సప్తమి, ఏకాదశి, షష్ఠి వంటి తిథుల్లో కొందరు తరిగిన కూరగాయలు తినరు. అటువంటి సందర్భాల్లో చేసుకోవడానికి ఇది సులవైన వంటకం.

తెర

# 'తత్వం' ట్రైలర్ విడుదల



కొత్త కథలు, వినూత్నమైన కథలకు తెలుగు ప్రేక్ష కుల్లో మంచి ఆదరణ ఉం టుంది. సినిమా చూస్తున్నంత సేపు వాళ్లని ఎంగేజ్ చేయ గలిగితే ఆ సినిమా చిన్నదైనా పెద్ద విజయాన్ని అందిస్తారు. ముఖ్యంగా మర్డర్ మిస్టరీ జానర్ సినిమాల్లో ఉండే ఉత్కంఠ, స్క్రీన్‌ప్లే ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుం టుంది. ఇప్పుడు ఇదే కోవలో ఓ వైవిధ్యమైన కథాంశంతో ప్రేక్షకులకు థ్రిల్ కలిగించే అంశా లతో రాబోతున్న చిత్రం 'తత్వం'. దినేష్ తేజ్, దష్విక.కె హీరో హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రానికి అర్జున్ కోల దర్శకుడు. త్రయతి ఇషాని క్రియేషన్స్, ఎస్.కె.ప్రొడక్షన్స్ సంయుక్త నిర్మాణంలో వంశీ సీమకుర్తి, శ్వేత పసుపులేటీ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ట్రైలర్ ఆవిష్కరణ కార్యక్రమం హైదరాబాద్‌లో జరిగింది. ఎగ్జిక్యూటివ్ నిర్మాత భరత్ మాట్లాడుతూ ట్రైలర్ అందరికి నచ్చింది. ఈ సినిమాలో అన్ని ఎలిమెంట్స్ కుదిరాయి. అందరూ ఈ సినిమా కోసం ఎంతో సపోర్ట్ చేశారు. అర్జున్ కోలా ఈ రోజు కోసం ఎప్పట్నుంచో ఎదురుచూస్తున్నాడు. నిర్మాత వంశీ సీమకుర్తి మాట్లాడుతూ ట్రైలర్ అందరికి నచ్చింది. సినిమా కూడా చాలా బాగుంటుంది. దర్శకుడు అనుకున్నది అనుకున్నట్లుగా స్క్రీన్‌పై ప్రజెంట్ చేశాడు. మరో నిర్మాత శ్వేత పసుపులేటి మాట్లాడుతూ తత్వం టైటిల్‌కు తగ్గట్టుగా చాలా డిఫరెంట్‌గా ఉంటుంది. ఓ కొత్త సినిమాను చూశామన్నఅనుభూతికి లోనవ ుతారు. దర్శకుడు అర్జున్ కోలా మాట్లాడుతూ ఈ మూవీ టైటిల్, కాన్సెప్ట్‌ను మన చుట్టు జరుగుతున్న ఇన్‌సిడెంట్స్ ఆధారంగా తయారుచేసుకున్నాను. సస్పెన్స్ థ్రిల్లర్ జోనర్ ఇది. దినేష్ తేజ్ వినగానే వెంటనే ఒకే చేశాడు. హీరో దినేష్ తేజ్ మాట్లాడుతూ నేను కలిసి పనిచేయాలనుకున్న టెక్నిషియన్స్‌తో ఈ సినిమాలో వర్క్ చేశాను. ఈసినిమాతో చాలా మంది కొత్తవాళ్లు పరిచయం అవుతున్నారు. అందరం చాలా కష్టపడ్డాం. అది సినిమా చూసిన తరువాత అందరికి తెలుస్తుంది..

# 'రాజా ది రాజా' లవ్ సాంగ్ ఊహాలే సాంగ్ రిలీజ్



యూత్‌ఫుల్ ప్రమోషనల్ కంటెంట్‌తో ఇప్పటికే ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచిన 'రాజా ది రాజా' చిత్రం మూవీ లవర్స్‌లో మంచి బజ్‌ను క్రియేట్ చేస్తోంది. రుత్విక్, విశాఖ ధీమన్ జంటగా నటిస్తున్న ఈ యూత్‌ఫుల్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌కు అనిల్ బోయిడపు దర్శకత్వం వహిస్తున్నారు. వృందావన్ క్రియేషన్స్ బ్యానర్‌పై కె. నిహారికా దాసరి ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, కె. శ్రీలతా రెడ్డి సమర్పిస్తు న్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్, ఫస్ట్ సింగిల్ కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఈ రోజు మేకర్స్ సెకండ్ సింగిల్ ఊహాలే రిలీజ్ చేశారు. మార్క్ కె రాబిన్ ఈ సాంగ్‌ని బ్యూటీఫుల్ లవ్ సాంగ్‌గా కంపోజ్ చేశారు. కృష్ణకాంత్ (కేకే) రాసిన హృదయాన్నితాకే సాహిత్యం మరింత అందాన్ని తీసుకొచ్చింది. కార్తీక్, శ్వేతా మోహన్ తమ ప్లజెంట్ వోకల్స్‌తో పాటలోని ప్రేమ భావాలను ఎంతో ఆహ్లాద కరంగా ఆవిష్కరించారు. ఈ సాంగ్‌లో విజువల్స్ చాలా లావిష్‌గా వున్నాయి. రుత్విక్, విశాఖ ధిమాన్ కెమిస్ట్రీ బ్యూటీఫుల్ ఆకట్టుకుంది. ఈ చిత్రానికి రవికిరణ్ బోయిడపు సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, విజయ్ కుమార్ పసుపులేటి ఆర్ట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఈ చిత్రంలో సాయికుమార్, డాక్టర్ నరేష్ విజయకృష్ణ, అవసరాల శ్రీనివాస్, విష్ణు ఓయి, పార్వతీశం, రాజశ్రీ నాయర్, రోహిణి, బద్రం, మైమ్ మధు, ఆనంద్ తదితరు లు కీలక పాత్రలు పోషిస్తున్నారు. మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ద్వారా రాజా ది రాజా జూలై 17న విడుదల కానుంది.

# 'రావు బహదూర్'కు మహేష్ బాబు ప్రశంసలు



సత్యదేవ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న సైకలాజికల్ డ్రామా 'రావు బహదూర్'ను, సూపర్ స్టార్ మహేష్ బాబు, నమ్రత శిరోద్కర్ తమ GMB ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై, A+S మూవీస్ , శ్రీచక్రాస్ ఎంటర్‌టైన్‌మెంట్స్‌తో కలిసి సమర్పిస్తున్నారు. వెంకటేష్ మహా రచన, ఎడిటింగ్, దర్శకత్వం వహిం చిన ఈ సినిమా గ్లింప్స్, టీజర్, పాటలు ఇప్పటికే సినిమాపై మంచి బజ్ క్రియేట్ చేశాయిఈ కథను మొదటి సారి విన్నప్పటి నుండే మహేష్ బాబు 'రావు బహదూర్' పట్ల ఎంతో ఆసక్తిని, ఎమోషనల్ ఎటాచ్మెంట్‌ని పెంచుకున్నారు. కేవలం సమర్పకుడిగానే కాకుండా, సినిమా ఆలోచన దశ నుండి పూర్తయ్యే వరకు దాని క్రియేటివ్ ప్రయాణాన్ని ఆయన దగ్గరుండి పర్యవేక్షి ంచారు. సోషల్ మీడియా వేదికగా తన అభిప్రాయాలను పంచు కుంటూ, మహేష్ బాబు ఈ సినిమాను, రూపొం దించిన విధానాన్ని ప్రశంసించారు. (ట్విట్టర్)లో మహేష్ బాబు ఒక స్పెషల్ పోస్ట్ పెట్టారు "రావు బహదూర్... ఇది కేవలం ప్రేక్షకులను కట్టిపడేసే సినిమా మాత్రమే కాదు, వారి మనసులో లోతుగా ముద్ర వేసుకునే చిత్రం! విభిన్నంగా, అందంగా, ఇంటెన్స్ డ్రామాతో కూడిన సినిమా ఇది. దర్శకుడు వెంకటేష్ మహా ఒక అద్భుతమైన ప్రపంచాన్ని సృష్టించారు. వచ్చే వారం జూలై 3న విడుదల కానున్న ఈ చిత్రానికి మహేష్ బాబు మాటలు మరింత ఉత్సాహాన్ని, బలాన్ని చేకూరుస్తున్నాయి.



# 'ఇట్స్ లైఫ్ బ్రో' ఫస్ట్ లుక్ విడుదల

కేఎం (కృష్ణమోహన్), పూజా సుందర్‌శెట్టి జంటగా నటిస్తున్న చిత్రం 'ఇట్స్ లైఫ్ బ్రో'. కేఎం ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సోమశేఖర్ రెడ్డి దర్శ కత్వంలో కృష్ణ మోహన్ సల్లగుండ్ల ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఎమోష నల్ లవ్‌స్టోరీగా తెరకెక్కుతోన్న ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను ప్రామిసింగ్ హీరో నితిన్ విడుదల చేశారు. దర్శ కుడు చిత్ర విశేషాలను తెలియజేస్తూ వైవిధ్య మైన కథ, కథనాలతో ఎమోషనల్ లవ్‌స్టోరీగా రూపొందుతున్న ఈ చిత్రం అందరి హృదయాలకు హత్తుకునే విధంగా ఉంటుంది. కృష్ణ మోహన్, పూజా సుందర్ శెట్టి, రాజీవ్ కనకాల, చమ్మక్ చంద్ర, అంబటి శ్రీనివాస్, దేవి ప్రసాద్, కిరీటి, త్రిశూల్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే: ఇ.రాజయ్య. డీఓపీ: చైతన్య, సంగీతం: సాహిత్య సాగర్, ఎడిటర్: సత్య గిద్దుటూరి

# ఖుష్బూ కూతురి పెళ్లిలో ఖుషీ.. ఖుషీగా !

## టాలీవుడ్.. బాలీవుడ్ సీనియర్లంతా అక్కడే !



ప్రముఖ నటి, రాజకీయ నాయకురాలు ఖుష్బూ సుందర్ ఇంట పెళ్లి సందడి నెలకొంది. ఆమె పెద్ద కుమార్తె అవంతిక వివాహం గోవాలో అత్యంత వైభవంగా జరిగింది. చెన్నైకి చెందిన వ్యాపార వేత్త శ్రవణ్ శ్రీనివాసన్‌తో అవంతిక వివాహ బంధంలోకి అడుగు పెట్టారు. గోవాలోని ఒక విలాస వంతమైన రిసార్ట్‌లో జరిగిన ఈ వేడుకకు పలువురు సినీ, రాజకీయ రంగ ప్రముఖులు హాజరై నూతన వధూ వరులను ఆశీర్వదించారు. ఈ పెళ్లి వేడుకకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ వివాహ వేడుకలో టాలీవుడ్ సీనియర్ హీరోలు చిరంజీవి, నాగార్జున, వెంకటేశ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ ముగ్గురు కథానాయకులు తమ సతీమణులు సురేఖ, అమల, నీరజలతో కలిసి హాజరయ్యారు. సంప్రదాయ వస్త్రధారణలో మెరిసిన ఈ దంపతులతో ఫొటోలు దిగి సందడి చేశారు. వీరితో పాటు బాలీవుడ్ నటులు అనిల్ కపూర్, జాకీ ష్రాఫ్, నటి త్రిష కూడా ఈ వేడుకలో పాలుపంచుకున్నారు. దీంతో 80, 90ల నాటి తారలంతా ఒకే చోట చేరిన అరుదైన దృశ్యం ఆవిష్కృతమైంది. ఖుష్బూకు టాలీవుడ్‌లోని ఈ ముగ్గురు అగ్ర హీరోలతో మంచి అనుబంధం ఉంది. 'కలియుగ పాండవులు' చిత్రంతో వెంకటేశ్, ఖుష్బూ ఇద్దరూ దాదాపు ఒకే సమ యంలో కెరీర్ ప్రారంభిం చారు. ఆ తర్వాత నాగార్జునతో 'కెప్టెన్ నాగార్జున' చిత్రంలో ఆమె హీరో యిన్‌గా నటిం చారు. ఇక, చిరంజీవి నటించిన 'స్టాలిన్' సినిమాలో ఖుష్బూ ఆయనకు సోదరిగా కీలక పాత్ర పోషించారు. వృత్తి పరంగానే కాకుండా వ్యక్తిగతంగా కూడా వీరందరి మధ్య స్నేహబంధం కొనసాగుతోంది. వెండి తెరపై ఒకరితో ఒకరు పోటీ పడినా, నిజ జీవితంలో మంచి స్నేహితులుగా మెలిగే చిరు, నాగ్, వెంకీ.. తమ స్నేహితురాలి కుమార్తె వివాహంలో ఇలా ఒకే ఫ్రేమ్‌లో కనిపించడంతో అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# 'తెల్ల కాగితం' మెలోడీ గీతం విడుదల



'తెల్ల కాగితం' నుంచి మెలోడీ గీతం విడుదల.. 'కోర్ట్', 'బ్యాండ్ మేళం' అంటూ యంగ్ అండ్ టాలెంట్ నటుడు హర్ష్ రోషన్ వరుస విజయాలతో దూసుకుపోతోన్నారు. హర్ష్ రోషన్, నక్షత్ర జంటగా 'తెల్ల కాగితం' అనే చిత్రంతో ఆడియెన్స్ ముందుకు రాబోతోన్నారు. అరుణాచల క్రియేషన్స్ బ్యానర్ మీద కృష్ణ కొమ్మలపాటి నిర్మాణంలో రమేష్ బండ్రెడ్డి ఈ మూవీని తెరకెక్కిస్తున్నారు. ఇప్పటి వరకు రిలీజ్ చేసిన పోస్టర్‌లు, ఇతర కంటెంట్ సినిమా మీద అంచనాల్ని పెంచేసింది. "చిలకా'అంటూ సాగే ఈ పాటకు పూర్ణాచారి సాహిత్యం, అనురాగ్ కులకర్ణి గాత్రం ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ఇక విజయ్ బుల్గానిన్ బాణీ అయితే ఎంతో వినసొంపుగా ఉంది. ఈ చిత్రానికి ప్రతిభావంతుడైన రచయిత నందు సవిరిగన కథను అందించారు. 'సమజవరగమన' మరియు 'నారి నారి నడుమ మురారి' వంటి విజయవంతమైన చిత్రాలకు సహరచయితగా పనిచేసి ఆయన మంచి గుర్తింపు పొందారు.



# 'మా ఇంటి బంగారం' రెస్పాన్స్‌తో హ్యాపీ: సమంత

ట్రాలాలా పిక్చర్స్ బ్యానర్ మీద సమంత, రాజ్ నిడిమోరు, హిమాంక్ దువ్వూరు సంయుక్తంగా నిర్మించిన సినిమా"మా ఇంటి బంగారం. సమంత ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రానికి నందినీ రెడ్డి దర్శకత్వం వహించారు. ఈ సినిమా జూన్ 19న వరల్డ్ వైడ్‌గా గ్రాండ్ రిలీజై బ్లాక్ బస్టర్ అయ్యింది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ థాంక్స్ మీట్‌ను ఏర్పాటు చేసింది. సమంత మాట్లాడుతూ మా ఇంటి బంగారం సినిమాకు వస్తోన్న రెస్పాన్స్ చూసిన తర్వాత చాలా సంతోషంగా అనిపించింది. నాకు సింక్ కాలేదు. దీన్నే ప్రతి ఆర్టిస్ట్ కోరుకుంటారు. ప్రతి సినిమాతో బెటర్ కావాలి. పెర్ఫామెన్స్ బెటర్ కావాలని డ్రీమ్‌లాగా భావి స్తారు. ఈవిషయంలో నేను చాలా లక్కీగా భావిస్తాను. థియేటర్స్‌లో సినిమాను చూస్తుంటే సర్‌ప్రైజింగ్‌గా ఉంది. డైరెక్టర్ నందినీ రెడ్డి మాట్లాడుతూ రాజ్ కథను డిజైన్ చేసినప్పుడే అన్నీ వర్గాల ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యేలా ఎలిమెంట్స్ ఉండాలనే ఆలోచనతో చేశారు. సమంత సెంటరాఫ్ ఎట్రాక్షన్‌గా పెట్టుకుని డిజైన్ చేశారు. సమంత ఎప్పటికీ స్పెషల్.. రాజ్‌గారు యాడ్ కావటం ఇంకా బలమైంది. ఓ బేబి సినిమా తర్వాత సమంత తో నేను చేసిన సినిమా. ఆమెలో కొత్త డైమన్షన్‌ను ఇందులో చూస్తారు. నిర్మాత రాజ్ నిడిమోరు మాట్లాడుతూ మేం హిందీలో ఫ్యామిలీ మ్యాన్, స్త్రీ వంటి సబ్జెక్ట్స్‌ను ప్రేక్షకులకు అందించాం. అయితే మా ఇంటి బంగారం సినిమాకు వచ్చినంత రెస్పాన్స్ ఎక్కడా రాలేదు. మా వాళ్లంతా ఇప్పుడు నిద్ర లేచి.. ఎంత బాగా తీశావురా! అన్నారు. .




# సాకర్ ప్రపంచకప్‌లో కాబో వెర్డే సంచలనాల మోత

**మాజీ ఛాంపియన్ స్పెయిన్‌తో 0-0తో డ్రా**
**మరో మేటి జట్టు ఉరుగ్వేతో 2-2తో డ్రా**

గ్రూప్-హెచ్‌లో ఉన్న ఈ రెండు జట్లు నాకౌట్‌కు చేరుకోవడం నల్లేరుపై నడకే అని అనుకున్నారంతా. బరిలోకి దిగాక కానీ తెలియలేదు. తమను ఓ ఫుట్‌బాల్ కూన ఇంతలా ఇబ్బంది పెడుతుందని. ఆ జట్టే కాబో వెర్డే. ఇప్పటివరకు ప్రపంచానికి పెద్దగా తెలియని పేరు.ఈపేరుతో ఓ దేశం ఉందా అన్నది సాకర్ ప్రపంచకప్‌తోనే అందరికి తెలిసింది.అలాంటి టీమ్... ఫిఫా ప్రపంచకప్‌లో అందరి అంచనాలకు భిన్నంగా రాణిస్తూ మహా మహా జట్లకే చెమటలు పట్టించింది. స్పెయిన్‌ను కనీసం గోల్ చేసే ఛాన్స్ కూడా ఇవ్వని కాబో వెర్డే... ఉరుగ్వేను అలాగే నిలువరించింది. ఓటమనేది లేకుండా ఉన్న కాబో వెర్డే పేరు సాకర్ ప్రపంచకప్‌లో మారుమోగుతోంది.

(వార్త క్రీడా విభాగం)

అమెరికా, కెనడా, మెక్సికో సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న సాకర్ ప్రపంచకప్ లీగ్ స్టేజ్ చివరికొచ్చింది. ఫేవరెట్ జట్లు తమస్థాయి విజయాలతో ముందంజ వేస్తున్నాయి. ఇక స్టార్ ఆటగాళ్లు కూడా గోల్స్ వర్షంతో అంచనాలను అందుకుంటున్నారు. ఈ మధ్యలో ఒకే ఒక జట్టు కాబో వెర్డే అందర్నీ ఆకర్షిస్తోంది.అసలు ఆ దేశం ఉందా అన్నది ఈ సాకర్ ప్రపంచకప్‌తోనే పరిచయమైంది. అందరి అంచనాలకు భిన్నంగా ఈ ఫుట్‌బాల్ కూన... ఆడుతున్న తొలి సాకర్ ప్రపంచకప్‌లోనే సంచలనాల మోత మోగిస్తోంది. స్పెయిన్, ఉరుగ్వేలతో డ్రా చేసి అజేయంగా నిలిచింది. నాకౌట్ రేసులో దూసుకుపోతోంది. సౌదీ అరేబియాతో చివరి లీగ్ మ్యాచ్‌లో గెలుపొందితే నాకౌట్ బెర్త్ పక్కా.

ఆఫ్రికా ఖండానికి పశ్చిమాన అట్లాంటిక్ మహాసముద్రంలో ఉన్న చిన్న ద్వీప దేశం కాబో వెర్డే. ఇది పది అగ్ని పర్వత ద్వీప సమూహం. 9 ద్వీపాలలోనే జానావాసాలు ఉన్నాయి. దేశ జనాభా దాదాపు 5 లక్షల 40వేలు. అధికారిక భాష పోర్చుగీస్. అద్భుతమైన సముద్ర తీరాలు, ఆహ్లాదకరమైన వాతావరణం కలిగి ఉంది. పర్యాటకానికి ప్రసిద్ధి.

కాబో వెర్డేలో ఫుట్‌బాల్ అంటే చెవికోసుకుంటారు. ప్రపంచ ఫుట్‌బాల్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకునే దిశగా అడుగులు వేస్తోంది.పరిమిత జనాభా, స్వల్ప వనరులు ఉన్నప్పటికీ... కాబో వెర్డే అంతర్జాతీయ సాకర్ వేదికపై క్రమంగా తన ప్రతిభను చాటుకుంటోంది. ఈ దేశ జాతీయ ఫుట్‌బాల్ జట్టు బ్లూ షార్క్స్ పేరుతో ప్రసిద్ధి చెందింది. ఆఫ్రికన్ ఫుట్‌బాల్ సమాఖ్య నిర్వహించే పోటీల్లో ఈ జట్టు పలుమార్లు మెరుగైన ప్రదర్శన కనబరిచి, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది.

ఫుట్‌బాల్ చరిత్రలోనే అత్యంత చిన్న దేశాల్లో ఒకటిగా 2026 ఫిఫా ప్రపంచ కప్‌కు అర్హత సాధించి సంచలనం సృష్టించింది. కామరూన్, ఈస్వాటిని లాంటి జట్లను ఓడించి సాకర్ ప్రపంచకప్‌కు అర్హత సాధించి చరిత్ర సృష్టించింది. అదే సంచలనాలను ఫిఫా ప్రపంచకప్‌లోనూ కొనసాగిసూనత యూరోపియన్ ఛాంపియన్ స్పెయిన్‌తో 0-0తో డ్రా చేసింది. రెండుసార్లు సాకర్ ప్రపంచ ఛాంపియన్ ఉరుగ్వేతో 2-2తో డ్రాగా ముగించింది. గత దశాబ్ద కాలంగా కాబో వెర్డే జట్టు ప్రదర్శించిన స్థిరత్వం, ఆ దేశ ఫుట్‌బాల్ అభివృద్ధికి నిదర్శనంగా నిలిచింది. కాబో వెర్డే జట్టులోని పలువురు ఆటగాళ్లు యూరప్‌లోని ప్రముఖ క్లబ్‌లకు ప్రాతినిధ్యం వహించడం ద్వారా జాతీయ జట్టుకు అంతర్జాతీయ అనుభవాన్ని తీసుకొచ్చారు. చిన్న దేశమైనప్పటికీ, పెద్ద కలలతో ముందుకు సాగుతున్న కాబో వెర్డే, ప్రపంచ ఫుట్‌బాల్‌లో తన ముద్ర వేస్తోంది. చిన్న దేశాలకూ అంతర్జాతీయ క్రీడల్లో విజయావకాశాలు ఉన్నాయని కాబో వెర్డే తన ప్రతిభతో మరోసారి నిరూపిస్తోంది.

## చిన్న దేశం.. పెద్ద కలలు

## ప్రి క్వార్టర్ ఫైనల్లో కిడాంబి శ్రీకాంత్

**కాలిఫోర్నియా:** యూఎస్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత ఏస్ షట్లర్ కిడాంబి శ్రీకాంత్ ప్రిక్వార్టర్ ఫైనల్‌కు చేరాడు. తొలి రౌండ్‌లో 21-14, 21-12తో భారత్‌కే చెందిన సనీత్ దయానంద్‌పై గెలుపొందాడు. మరో మ్యాచ్‌లో రౌనక్ చౌహాన్ (భారత్) 23-21, 21-16తో శంకర్ ముత్తుస్వామి (భారత్)పై గెలుపొంది ముందంజ వేశాడు.మహిళల సింగిల్స్‌లో ఐదో సీడ్ తన్వీ శర్మ, ఆరో సీడ్ దేవిక సిహాగ్ కూడా శుభారంభం చేశారు. తన్వీ 23-21, 21-16తో వొన్నె లీ (జర్మనీ)పై... దేవిక 21-14, 21-14తో లూసియా కాస్టిల్లో (పెరూ)పై విజయాలు సాధించారు. మరో మ్యాచ్‌లో రక్షిత శ్రీ 21-15, 21-8తో టెరెజా స్వాబికోవా (చెక్ రిపబ్లిక్)పై గెలిచి ముందంజ వేసింది. హైదరాబాద్ అమ్మాయి శ్రియాంశి వలిశెట్టి, అన్‌మోల్, తాన్యా హేమంత్, ఆకర్షి తొలి రౌండ్‌లోనే పరాజయం పాలయ్యారు.

## తుర్కియే గెలుపు బోణీ : అమెరికాకు ఝలక్

**లాస్‌ఏంజెల్స్ :** ఫిఫా ప్రపంచకప్2026లో తుర్కియే అనూహ్య రీతిలో పటిష్ట అమెరికాపై విజయం సాధించింది. గ్రూప్-డిలో భాగంగా జరిగిన మ్యాచ్‌లో ఆతిథ్య జట్టును 3-2తో చిత్తు చేసి తొలి విజయం నమోదు చేసింది. గ్రూప్-డి నుంచి ఇప్పటికే అమెరికా వరుసగా రెండు విజయాలతో నాకౌట్ దశకు అర్హత సాధించింది. ఈ క్రమంలో తుర్కియే మీదా గెలిచి హ్యాట్రిక్ విజయంతో అజేయంగా నిలవాలని భావించింది. కానీ తుర్కియే అంచనాలన్నీ తలకిందులు చేసింది. మూడో నిమిషంలోనే ఆస్టన్ ట్రస్టీ గోల్ కొట్టి అమెరికాకు శుభారంభం అందించాడు. అయితే, తుర్కియే ఆటగాడు బారిస్ యిల్మాజ్ ఇచ్చిన పాస్ తో ఆర్దా గూలర్ గోల్ కొట్టి 1-1తో స్కోరు సమం చేశాడు. ఇక రెండో అర్ధ భాగంలో ఒర్కూన్ కొకూ గోల్ కొట్టడంతో తుర్కియే 2-1తో ఆధిక్యంలోకి వెళ్లింది. అయితే, సెబాస్టియన్ బెర్‌హాల్టర్ గోల్ కొట్టడంతో.. అమెరికా 2-2తో స్కోరు సమం చేసింది. అదనపు సమయంలో కాన్ అహ్యాన్ అనూహ్య రీతిలో గోల్ కొట్టి తుర్కియేను విజేతగా నిలిపాడు. అయినా టోర్నీ నుంచి నిష్క్రమించింది.

**ఆసీస్, పరాగ్వే సైతం**

ఇక గ్రూప్‌డి మరో మ్యాచ్‌లో ఆస్ట్రేలియా పరాగ్వేతో మ్యాచ్‌ను డ్రా చేసుకుంది. దీంతో టేబుల్ టాపర్ అమెరికాతో పాటు.. రెండు, మూడు స్థానాల్లో నిలిచిన ఆస్ట్రేలియా, పరాగ్వే నాకౌట్‌కు చేరాయి.



## శ్రీలంక-ఏతో ఏకైక టెస్ట్ పట్టుబగించిన భారత్

**గాలే, జూన్26:** నధికారిక టెస్టులో శ్రీలంక-ఏ జట్టుపై భారత్-ఏ ఆధిపత్యం కొనసాగుతోంది. రెండో రోజు ఆట ముగిసేసమయానికి శ్రీలంక 31 ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 113 పరుగులు చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో ఇంకా 339 పరుగులు వెనుకబడి ఉంది.క్రీజ్‌లో నువానిదు ఫెర్నాండో(65), ఆష్వేన్ బండారా (18) ఉన్నారు. ఓపెనర్లు వీరసింగే (11), డిక్‌వెల్లా (10) విఫలమయ్యారు. అన్షుల్ కాంబోజ్, యశ్ ఠాకూర్ చెరో వికెట్ తీశారు. అంతకుముందు భారత్-ఏ తొలి ఇన్నింగ్స్‌ను 6 వికెట్లకు 452 స్కోరు వద్ద డిక్లేర్డ్ చేసింది.

**కెప్టెన్ ధ్రువ్ జురెల్ సెంచరీ**

తొలి రోజే సాయి సుదర్శన్ (132) సెంచరీ సాధించగా.. రెండో రోజు ఆ పనిని కెప్టెన్ ధృవ్ జురెల్ చేపట్టాడు. ఓవర్ నైట్ స్కోరు 333/4తో రెండో రోజు ఆటను ప్రారంభించిన భారత్-ఏ కాసేపటికే షేక్ రషీద్ (63) రూపంలో వికెట్ కోల్పోయింది. అయితే, కెప్టెన్ ధ్రువ్ జురెల్ (215 బంతుల్లో 141 రన్స్;13 ఫోర్లు, ఓ సిక్స్) అద్భుత సెంచరీతో జట్టు స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. అతడికి హర్ష్ దూబె (51 బంతుల్లో 30) తోడ్పాటు అందించాడు. భారత్ స్కోరును 450 మార్కు దాటించారు. ఈ దశలో ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేస్తూ ధ్రువ్ నిర్ణయం తీసుకున్నాడు.

శ్రీలంక బౌలర్లలో చమిక గుణశేఖర 3, దిలుమ్ సుదీరా 2, రవిందు ఫెర్నాండో ఒక వికెట్ పడగొట్టారు.





అభిషేక్ ధనాధన్

## తొలి టి20లో టీమిండియాకు ఐర్లాండ్ షాక్

**బెల్‌ఫాస్ట్,జూన్ 26:** టీ20 ప్రపంచ ఛాంపియన్ టీమిండియాకు ఐర్లాండ్ షాకిచ్చింది. తొలి టీ20 మ్యాచ్ లో 34 పరుగులతో గెలుపొందింది. రెండు టీ20ల సిరీస్‌లో 1-0 ఆధిక్యం చాటింది. మొదట ఐర్లాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 182 పరుగులు చేసింది. లక్ష్యఛేధనలో తడబడ్డ మెన్ ఇన్ బ్లూ 18.5 ఓవర్లలో 148 పరుగుల స్వల్ప స్కోరుకే ఆలౌటైంది. మాథ్యూ హాంప్‌రేస్, మాట్‌హోలార్డ్ చెరో మూడు వికెట్లు పడగొట్టి టీమిండియా బ్యాటింగ్‌ను కుప్పకూల్చారు.

183 పరుగుల లక్ష్య ఛేదనలో భారత్ ఇన్నింగ్స్‌ను అభిషేక్ శర్మ(20 బంతుల్లో 49; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు), సంజూ శాంమ్సన్(5) ప్రారంభించారు. తొలి ఓవర్లోనే 16 పరుగులు రాబట్టారు. అయితే మూండ్రా వస్తూనే తొలి బంతికి సంజూను క్లీన్‌బౌల్డ్ చేశాడు. ఒకవైపు అభిషేక్.. ఐర్లాండ్ బౌలర్లపై విరుచుకుపడుతుంటే, మరో ఎండ్‌లో భారత్ టాప్ ఆర్డర్ పెవిలియన్‌కు క్యూ కట్టింది. ఇషాన్ కిషన్(1), కెప్టెన్ శ్రేయాస్(3)ను వరుస ఓవర్లలో హోలార్డ్ అవుట్‌చేశాడు. అభిషేక్ శర్మ బౌండరీలు, సిక్స్‌లతో హాఫ్ సెంచరీకి చేరువయ్యాడు. భారీ షాట్‌తో హాఫ్ సెంచరీ పూర్తి చేసే ప్రయత్నంలో మెక్‌కార్తీ బౌలింగ్‌లో అవుటయ్యాడు. వాషింగ్టన్ సుందర్ కూడా 9 పరుగులే చేసి నిరాశపరిచాడు. తిలక్‌వర్మ(19), శివమ్ దూబే(14 బంతుల్లో 25), అక్షర్ పటేల్(15) భారత్‌ను ఆదుకునే ప్రయత్నం చేసినా హాంప్‌రేస్, ముండ్రా వెంటవెంటనే వికెట్లు కూల్చారు. చివరి వరుస బ్యాట్స్‌మెన్ కూడా చేతులెత్తేయడంతో భారత్ మరో 7 బంతులుండగానే 148 పరుగులకు ఆలౌటైంది. ఐర్లాండ్ బౌలర్లలో హాంప్‌రేస్, హోలార్డ్ చెరో 3 వికెట్లు పడగొట్టగా.. జై మోంద్రా 2, మెక్‌కర్తీ, గరేత్ ఒక్కో వికెట్ తీశారు.

అంతకు ముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఐర్లాండ్ ఆరంభంలో తడబడింది.యువ బౌలర్ హర్షిత్ రాణా టాప్ ఆర్డర్ పనిపట్టాడు. అతనికి అర్షదీప్‌కూడా తోడవడంతో ఐర్లాండ్ 51 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయింది. ఓపెనర్లు టిమ్ టెక్టర్(17), రాస్ అడైర్(12), బెన్ కార్లిట్జ్(15)లను హర్షిత్ రాణా అవుట్ చేయగా, హారీ టెక్టర్‌ను అర్షదీప్ డకౌట్ చేశాడు. ఈ దశలో కెప్టెన్ లొర్కాన్ టక్కర్ (50), డాక్‌రెల్ (49) క్రీజ్‌లో నిలదొక్కుకుని భారత్ బౌలర్ల జోరును అడ్డుకున్నారు. ఐర్లాండ్ స్కోరును 150 మార్కు దాటించారు. వీరి అవుట్ తర్వాత ఐర్లాండ్ వేగంగా వికెట్లు కోల్పోయింది. దీంతో 20 ఓవర్లలో 9 వికెట్లకు 182 రన్స్ చేసింది. భారత బౌలర్లలో హర్షిత్ రాణా 3, అక్షర్ పటేల్ 2, అర్షదీప్ సింగ్ 2, శివమ్ దూబే ఒక వికెట్ తీశారు. ఈ ఓటమితో ఐర్లాండ్ టూర్‌ను టీమిండియా ఓటమితో ప్రారంభించింది. రెండో టీ20 మ్యాచ్ ఆదివారం జరగనుంది.

## భారత్ ఆర్థికవృద్ధి 6.8శాతం!




### గోల్డ్‌మాన్ శాక్స్ అంచనా

**న్యూఢిల్లీ, జూన్ 26:** అమెరికాఇరాన్ శాంతి ఒప్పందం నేపథ్యంలో భారత్ ఆర్థిక వృద్ధిపై గోల్డ్‌మన్ శాక్స్ సానుకూల అంచనాలతో ఉంది.ముడి చమురు ధరలు తగ్గడం, దేశీయ ఆర్థిక పరిస్థితులు బలోపేతం కావడం వల్ల 2026 క్యాలెండర్ సంవత్సరానికి భారత్ జీడీపీ వృద్ధి అంచనాను 6.8 శాతానికి పెంచింది. ఇదివరకు 6.5 శాతం పరిధిలో అంచనా వేసిన సంస్థ, తాజా పరిణామాల నేపథ్యంలో వృద్ధి అంచనాలను మరింత మెరుగుపరిచింది. ఇండియా: ఇంప్రూవ్డ్ మ్యాక్రో అవుట్‌లుక్ ఆఫ్టర్ ది యూఎస్ఇరాన్ డీల్ పేరుతో విడుదల చేసిన నివేదికలో, ముడి చమురు ధరలు తగ్గడంతో ద్రవ్యోల్బణం, కరెంట్ అకౌంట్ లోటు వంటి స్థూల ఆర్థిక ప్రమాదాలు తగ్గాయని పేర్కొంది. ప్రస్తుతం 2026 మూడు, నాలుగో త్రైమాసికాల్లో బ్యారెల్‌కు సగటు చమురు ధర 82 డాలర్లు, 2027లో 75డాలర్లుగా ఉండొచ్చని అంచనా వేసింది. ఈ నేపథ్యంలో 2026 క్యాలెండర్ సంవత్సరానికి భారత్ వాస్తవ జీడీపీ వృద్ధి అంచనాను 0.3 శాతం పెంచి 6.8 శాతానికి చేర్చినట్లు గోల్డ్ మన్ శాక్స్ తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి గతంలో 6.1 శాతం వృద్ధిని అంచనా వేసిన సంస్థ, ఇప్పుడు ఆర్థిక పరిస్థితులు మెరుగ్గా ఉన్నాయని పేర్కొంది.తొలి త్రైమాసికంలో భారత ఆర్థిక వ్యవస్థ 7.8 శాతం వృద్ధి నమోదు చేయడం కూడా ఈ సవరణకు ప్రధాన కారణమని వెల్లడించింది.

పెట్టుబడుల పెరుగుదలతో పాటు సేవల రంగం బలంగా విస్తరించడం వృద్ధికి ఊతమిచ్చిందని తెలిపింది. 2027 ఆర్థిక సంవత్సరానికి రిటైల్ ద్రవ్యోల్బణ అంచనాను 5.1శాతం నుంచి 4.9శాతానికి తగ్గించింది. పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగే అవకాశాలు తగ్గడంతో పాటు పెట్రోకెమికల్ ఉత్పత్తుల తయారీ వ్యయాలు కూడా తగ్గనున్నాయని పేర్కొంది.ప్రపంచ మార్కెట్లో యూరియా, ముడిచమురు ధరలు తగ్గడం వల్ల ఎరువుల సబ్సిడీ భారం తగ్గి ప్రభుత్వ ఆర్థిక పరిస్థితులకు కూడా ఊరట లభిస్తుందని గోల్డ్‌మన్ శాక్స్ అంచనా వేసింది. 2026 సంవత్సరానికి కరెంట్ అకౌంట్ లోటు జీడీపీలో 1.1 శాతానికి పరిమితం అవుతుందని, బ్యాలెన్స్ ఆఫ్ పేమెంట్స్ మిగులు 0.7 శాతానికి చేరవచ్చని నివేదికలో పేర్కొంది.

## లక్షకుపైగా ఉద్యోగాలకు వోక్స్ వ్యాగన్ కోత

**బెర్లిన్,జూన్ 26:** జర్మనీకి చెందిన ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ వోక్స్ వ్యాగన్ గ్రూప్ చేపట్టిన పునర్వ్యవస్థీకరణ ప్రణాళికలో భాగంగా ప్రపంచ వ్యాప్తంగా లక్ష మంది వరకు ఉద్యోగులను తొలగించడం, జర్మనీలోని నాలుగు తయారీ ప్లాంట్లను మూసివేయడం, రాబోయే ఐదేళ్ల పెట్టుబడులను గణనీయంగా తగ్గించడం వంటి చర్యలను కంపెనీ యాజమాన్యం పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.

కంపెనీ ప్రధాన కార్యనిర్వాహణ అధికారి (సీఈఓ) ఒలివర్ బ్లూమ్ ప్రతిపాదించిన ఈ ప్రణాళికకు ఇంకా బోర్డు ఆమోదం లభించాల్సి ఉంది. ఈ ప్రణాళిక ప్రకారం పెట్టుబడులను సుమారు 15 శాతం తగ్గించి, వచ్చే ఐదేళ్లలో మూలధన వ్యయాన్ని 130 బిలియన్ యూరోల కంటే కొద్దిగా ఎక్కువ స్థాయికి పరిమితం చేయాలని భావిస్తున్నట్లు సమాచారం. పునర్వ్యవస్థీకరణలో భాగంగా వోక్స్‌వ్యాగన్ తన ప్రధాన ప్రయాణికుల కార్ల విభాగం, విడిభాగాల వ్యాపారాలను ప్రత్యేక సంస్థలుగా విభజించే అవకాశాన్ని కూడా పరిశీలిస్తోంది. కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా నిర్వహించడం,లాభదాయకతను పెంచడం ఈ చర్యల ప్రధాన ఉద్దేశ్యంగా పేర్కొంటున్నారు.అమెరికా విధించిన దిగుమతి సుంకాలు,చైనా ఎలక్ట్రిక్ వాహన తయారీ సంస్థల నుంచి పెరుగుతున్న పోటీ, ఎలక్ట్రిక్ మొబిలిటీ వైపు మార్పుతో పెరుగుతున్న వ్యయాలు వోక్స్‌వ్యాగన్‌పై తీవ్ర ఒత్తిడిని తీసుకొచ్చాయి.

ఈ నేపథ్యంలో కంపెనీ తన ప్రధాన ఆటోమొబైల్ వ్యాపారంపై మరింత దృష్టి సారించాల్సిన అవసరం ఉందని సీఈఓ ఒలివర్ బ్లూమ్ పలుమార్లు




పేర్కొన్నారు. ప్రస్తుత వాహన ఉత్పత్తి కార్యక్రమాలు ముగిసిన తర్వాత హానోవర్, జ్వికౌ, ఎమ్డెన్ ప్లాంట్లతో పాటు ఆడీకి చెందిన నెకార్సుల్మ్ తయారీ కేంద్రంలో ఉత్పత్తిని నిలిపివేసే అవకాశమున్నట్లు నివేదికలు వెల్లడించాయి. ప్రస్తుతం అమలులోఉన్న 50 వేల ఉద్యోగాల కోత ప్రణాళికకు మించి ఈ కొత్త చర్యలు ఉండనున్నాయి. ఇవి అమలైతే వోక్స్‌వ్యాగన్ ప్రపంచవ్యాప్తంగా ఉన్న మొత్తం ఉద్యోగుల్లో దాదాపు 15 శాతం మందిపై ప్రభావం చూపే అవకాశం ఉంది.అయితే ఈ అంతర్గత ప్రణాళికలపై వోక్స్‌వ్యాగన్ అధికారికంగా స్పందించలేదు. అయితే సంస్థలో "విస్తృత స్థాయి మార్పులు తప్పనిసరి" అని మాత్రమే పేర్కొంది.

## ఎంఎస్‌ఎంఈలు, స్టార్టప్‌లు స్టాక్ మార్కెట్‌లో లిస్టింగ్ చేసుకోవాలి

### ఎన్ఎస్ఈ సీఈఓ అశిష్ చౌహాన్



**ముంబయి,జూన్ 26:** స్టార్టప్‌లు, ఎంఎస్ఎంఈలు తమ వ్యాపారాలను విస్తరించుకోవడానికి స్టాక్ మార్కెట్‌లో లిస్టింగ్‌ను అవకాశంగా వినియోగించుకోవాలని నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ అశిష్ చౌహాన్ సూచించారు. వ్యవస్థాపకులు రోజువారీ షేర్ ధరల మార్పులపై కాకుండా లాభదాయకమైన, దీర్ఘకాలికంగా నిలబడే సంస్థల నిర్మాణంపై దృష్టి పెట్టాలని అన్నారు.పబ్లిక్ లిస్టింగ్ ద్వారా కంపెనీలకు వృద్ధి కోసం అవసరమైన మూలధనం లభిస్తుందని, కార్పొరేట్ గవర్నెన్స్ మెరుగుపడుతుందని, మార్కెట్లో విశ్వసనీయత పెరుగుతుందని, నైపుణ్యం కలిగిన ఉద్యోగులను ఆకర్షించడం సులభమవుతుందని తెలిపారు. కంపెనీపై ప్రమోటర్ల నియంత్రణ కూడా కొనసాగుతుందని స్పష్టంచేశారు. ప్రారంభంలో కంపెనీ ఈక్విటీలో కేవలం 25శాతం వాటాను మాత్రమే మార్కెట్లోకి విడుదల చేసి, మిగిలిన 75 శాతం వాటాను ప్రమోటర్లు తమ వద్దే ఉంచుకోవచ్చని అశిష్ చౌహాన్ వివరించారు.వ్యాపార అవసరాలను బట్టి భవిష్యత్తులో మాత్రమే మరింత వాటాను విక్రయించే అవకాశంఉంటుందని చెప్పారు.ఏడాదికి 2 కోట్ల లాభం ఆర్జించే సంస్థ కూడా స్టాక్ మార్కెట్‌లో లిస్టింగ్ అనంతరం 40 నుంచి 50 కోట్ల వరకు మార్కెట్ విలువను పొందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. దీంతో కంపెనీలు సులభంగా నిధులు సమీకరించి, కొత్త ఇన్వెస్టర్లను తీసుకురాగలిగి వ్యాపార విస్తరణ చేపట్టవచ్చని తెలిపారు.లిస్టెడ్ కంపెనీలకు షేర్ల రూపంలో సొంత కరెన్సీ లభించినట్లేనని, వాటిని ఇతర కంపెనీల కొనుగోళ్లకు, ఉద్యోగులకు స్టాక్ ఆప్షన్లు ఇవ్వడానికి ఉపయోగించుకోవచ్చని చెప్పారు. ఇన్ఫోసిస్ ప్రారంభ దశలో ఉద్యోగులను ఆకర్షించేందుకు స్టాక్ ఆప్షన్లను సమర్థంగా వినియోగించిన విషయాన్ని ఆయన ఉదాహరణగా ప్రస్తావించారు.లిస్టింగ్ వల్ల కంపెనీలకు విశ్లేషకుల కవరేజ్ లభించడంతో పాటు బ్యాంకుల నుంచి రుణాలు సులభమవుతుందని, వారసత్వ నిర్వహణ కూడా సక్రమంగా జరిగే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు.

## భారత్‌కు మేలుచేస్తేనే యుఎస్ ఎఫ్టీయేపై సంతకం: గోయల్


**లండన్,జూన్ 26:** భారత్-అమెరికా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం తుది దశకు చేరుకుందని భారత ఎగుమతులకు ఇతర దేశాల కంటే ఎక్కువ మేలు చేకూరితేనే ఈ ఒప్పందంపై సంతకం చేస్తామని కేంద్రమంత్రి పియూష్‌గోయల్ స్పష్టం చేశారు. లండన్‌లో మీడియాతో మాట్లాడిన గోయల్ ఫిబ్రవరి 6నుంచే ఒప్పందంలోని ప్రధాన అంశాలపై ఇరు దేశాలు అంగీకారానికి వచ్చాయని, ప్రస్తుతం తుది నిబంధనలు, సుంకాల అంశాలపై చర్చలు కొనసాగుతున్నాయని తెలిపారు.భారత్‌కు అమెరికా మార్కెట్లో ప్రత్యర్థి దేశాల కంటే మెరుగైన టారిఫ్ రాయితీలు లభించేలా చట్టపరమైన వ్యవస్థను రూపొందించాలన్నదే ప్రస్తుతం ప్రధాన చర్చాంశమని గోయల్ పేర్కొన్నారు.

అలాంటి ప్రయోజనం తర్వాతే ఒప్పందం అమల్లోకి వస్తుందని చెప్పారు. గతంలో 18



శాతం టారిఫ్ రేటుకు భారత్ అంగీకరించినప్పటికీ అది కూడా ఇతర దేశాల కంటే భారత్‌కు ప్రత్యేక ప్రయోజనం ఉంటుందనే షరతుపైనే నని మంత్రి స్పష్టం చేశారు. భారత టెక్స్‌టైల్స్, ఇంజినీరింగ్ ఉత్పత్తులు, ఔషధాలకు అమెరికాలో వియత్నాం, బంగ్లాదేశ్ వంటి దేశాల ఉత్పత్తుల కంటే తక్కువ దిగుమతి సుంకం ఉంటే భారత ఎగుమతిదారులకు భారీ ప్రయోజనం లభిస్తుంది. దీంతో ఎగుమతులు పెరగడంతో పాటు మార్కెట్ వాటా, ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడే అవకాశం ఉంటుంది. ప్రతిపాదిత భారత్‌అమెరికా వాణిజ్య ఒప్పందంలో టారిఫ్‌లు, రూల్స్ ఆఫ్ ఒరిజిన్, పెట్టుబడులు, పలు రంగాల్లో పరస్పర సహకారం వంటి అంశాలు చోటు చేసుకోనున్నాయి. ఈ ఒప్పందం ప్రపంచంలోని అతిపెద్ద, ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల మధ్య వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేయడంతో పాటు భారత వ్యాపారాలకు కొత్త అవకాశాలు కల్పిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.

## భారత్ ఫారెక్స్ ఖజానా కళకళ



**ముంబయి,జూన్26:** భారత్ విదేశీ మారక నిల్వలు మరోసారి పెరిగాయి. ఈనెల 19తో ముగిసిన వారానికి భారత విదేశీ మారక నిల్వలు 963 మిలియన్ డాలర్లు పెరిగి 672.587 బిలియన్ డాలర్లకు చేరినట్లు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెల్లడించింది. అంతకుముందు వారంలో విదేశీ మారక నిల్వలు 9.985 బిలియన్ డాలర్లు తగ్గి 671.625 బిలియన్ డాలర్ల వద్ద నమోదయ్యాయి.ఈసారి విదేశీ కరెన్సీ ఆస్తులు 3.072 బిలియన్ డాలర్లు తగ్గి 541.217 బిలియన్ డాలర్లకు చేరాయి. డాలర్‌తో పోలిస్తే యూరో, పౌండ్, యెన్ వంటి కరెన్సీల విలువల్లో వచ్చిన మార్పులు కూడా విదేశీ కరెన్సీ ఆస్తులపై ప్రభావం చూపినట్లు ఆర్‌బీఐ తెలిపింది.

మరోవైపు, బంగారం నిల్వల విలువ గణనీయంగా పెరిగింది. బంగారం నిల్వలు 4.110 బిలియన్ డాలర్లు పెరిగి 107.930 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి.అలాగే, స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ (ఎస్‌డీఆర్‌లు) 52 మిలియన్ డాలర్లు తగ్గి 18.647 బిలియన్ డాలర్లకు చేరగా, అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) వద్ద భారత రిజర్వ్ స్థాయి 22 మిలియన్ డాలర్లు తగ్గి 4.793 బిలియన్ డాలర్లుగా నమోదైంది. దీంతో ఖజానా కళకళ లాడుతోంది.



## డాక్టర్ రెడ్డీస్‌లో ఎఫ్‌డిఎ తనిఖీలు

**న్యూఢిల్లీ,జూన్ 26:** ప్రముఖ ఔషధ తయారీ సంస్థ డాక్టర్ రెడ్డీస్ లాబొరేటరీస్ బాచుపల్లిలోని బయోలాజిక్స్ తయారీ కేంద్రంపై నిర్వహించిన తనిఖీల అనంతరం అమెరికా ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ ఏడు పరిశీలనాత్మక అభ్యంతరాలు జారీ చేసినట్లు కంపెనీ వెల్లడించింది. కంపెనీ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు ఇచ్చిన సమాచారం ప్రకారం, ఈనెల 16 నుంచి 25, వరకు బాచుపల్లి బయోలాజిక్స్ తయారీ కేంద్రంలో ఎఫ్‌డిఎ ప్రీలైసెన్స్ ఇన్‌స్పెక్షన్ నిర్వహించింది. తనిఖీలు పూర్తైన అనంతరం ఫామ్483 కింద ఏడు పరిశీలనలు జారీ చేసినట్లు తెలిపింది. వాటికి నిర్దేశిత గడువులోగా సమాధానాలు ఇచ్చి, అవసరమైన సవరణ చర్యలు చేపడతామని కంపెనీ పేర్కొంది. గతంలోకూడా 2025 సెప్టెంబర్ 4 నుంచి 12 వరకు ఇదే ప్లాంట్‌లో నిర్వహించిన ప్రీఅప్రూవల్ ఇన్‌స్పెక్షన్ అనంతరం ఎఫ్‌డిఎ ఐదు అభ్యంతరాలు జారీ చేసిన విషయం తెలిసిందే.

ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో డాక్టర్ రెడ్డీస్ పనితీరు గణనీయంగా బలహీనపడింది.కంపెనీ నికర లాభం వార్షిక ప్రాతిపదికన 86 శాతం తగ్గి రూ.1,593 కోట్ల నుంచి రూ.221 కోట్లకు పడిపోయింది. లెనాలిడొమైడ్ ఔషధానికి సంబంధించిన షెల్ఫ్ స్టాక్ అడ్జస్ట్‌మెంట్ కారణంగా కంపెనీకి రూ.4,530 కోట్ల ప్రభావం పడింది. అలాగే కార్-టి ఆస్తులు, ఎప్టిలాగిమోడ్ ఆల్ఫాకు సంబంధించిన రూ.27 కోట్ల ఇంపెయింమెంట్, వ్యాట్ బకాయిలకు సంబంధించిన రూ.14 కోట్ల ప్రొవిజన్లు కూడా ఫలితాలపై ప్రతికూల ప్రభావం చూపాయి.

కంపెనీ ఆదాయం కూడా 12 శాతం తగ్గి రూ.8,528 కోట్ల నుంచి రూ.7,546 కోట్లకు చేరింది. ఇక ఎబిట్డా వార్షిక ప్రాతిపదికన 60 శాతం క్షీణించి రూ.2,475 కోట్ల నుంచి రూ.981 కోట్లకు పడిపోయింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.